ఆంధ్రభూమి

సంపుటి: 30 . సంచిక: 213 | విజయవాడ సిటీ | హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడ, రాజమహేంద్రవరం, అనంతపురం, కరీంనగర్, నెల్లూరు | www.andhrabhoomi.net | బుధవారం 2 జనవరి, 2019 | 20 పేజీలు | ధర: రూ.3.00

శుభోదయం

కలియుగం - 5120
శాలివాహన శకం - 1940
శ్రీ చాంద్రమాన విలంబ నామ సంవత్సరం - దక్షిణాయనం, హేమంతఋతువు, మార్గశిరమాసం
తిథి: బహుళ ద్వాదశి రా.తె.3.16
నక్షత్రం: విశాఖ ఉ.11.51
వర్జ్యం: మ.3.56నుండి 5.34 వరకు
దుర్ముహూర్తం: ఉ.11.36 నుండి 12.24 వరకు
రాహుకాలం: మ.12.00 నుండి 1.30 వరకు

హంద్రీనీవాకు అడ్డంకులు!

గండ్లు కొడుతున్న రైతులు

హిందూపురం, జనవరి 1: అనంతపురం జిల్లాకు కృష్ణాజలాలను తరలిస్తున్న హంద్రీనీవా కాలువకు రైతులు గండ్లు కొడుతున్నారు. కాలువ నీటిని తమ ప్రాంతంలోని చెరువులకు మళ్లించకుండా ఇతర ప్రాంతాలకు తరలించడాన్ని రైతులు వ్యతిరేకిస్తున్నారు. దీంతో హిందూపురం నియోజకవర్గంలోని పలు చోట్ల రైతులు హంద్రీనీవా కాలువకు గండ్లు కొట్టి చెరువులకు నీరు మళ్లిస్తున్నారు. తాజాగా హిందూపురం రూరల్ మండల పరిధిలోని కొటిపి తదితర చెరువులకు నీటిని మళ్లించకుండా మడకశిరకు తరలించడాన్ని స్థానిక రైతులు వ్యతిరేకించారు. మంగళవారం బలవంతంగా కెంచనపల్లి వద్ద కాలువకు గండికొట్టారు. తమప్రాంతాల్లోని చెరువుకు నీటిని వదలకుండా మడకశిర వైపు తరలించడం ఎంతవరకు సబబని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ హిందూపురం రూరల్ పోలీసుస్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. దీంతో కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తాము నీటిని తరలిస్తున్నామని నీటిపారుదలశాఖ అధికారులు స్పష్టం చేశారు. యుద్ధప్రాతిపదికన గండిని పూడ్చిన అధికారులు నీటిని మడకశిరకు తరలించారు.



లోక్‌సభకు పోటీ చేస్తా

ప్రజల మద్దతు కావాలి
సినీటుడు ప్రకాశ్‌రాజ్

చెన్నై, జనవరి 1: సినీ నటుడు ప్రకాశ్ రాజ్ రాజకీయాల్లో ప్రవేశిస్తున్నట్లు ప్రకటించారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తానని ట్వీట్ ద్వారా తెలిపారు. నూతన సంవత్సర శుభాకాంక్షలను తెలియచేస్తూ, ప్రజల మద్దతుతో తాను వచ్చే ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తానన్నారు. బెంగళూరుకు చెందిన ప్రకాశ్‌రాజ్ చాలా రోజుల నుంచి క్రియాశీల రాజకీయాల్లోకి వస్తారనే ప్రచారం జరిగింది. కేంద్రంలో బీజేపీ సర్కార్‌పై ఆయన అనేకసార్లు విమర్శలు చేశారు. బెంగళూరులో గుర్తు తెలియని వ్యక్తుల - మిగతా 6వ పేజీలో

ఫనగామా




కొన్నాళ్లు ఆ సూట్లు పక్కనబెట్టి ఇలా పంచెకట్టు అలవాటు చేసుకో..!

మోదీ, జైట్లీకి దేశ క్షేమం పట్టదు

ఫెడరల్ ఫ్రంట్‌ను వీళ్లే మోస్తున్నారు ◆ కేసీఆర్ సన్నాసి అన్నా పొగుడుతారు
తెలంగాణలో బీజేపీ చిత్తుగా ఓడలేదా.. ◆ టీఆర్‌ఎస్ గెలిస్తే మీకేంటి ఆనందం?
జగన్ సామంతరాజులా మారాడు ◆ రాష్ట్రాభివృద్ధిని దెబ్బతీసేందుకే కుట్రలు
ముస్లింల పట్ల వివక్ష తగదు ◆ బీజేపీయేతర కూటమిలోనే మమత: బాబు స్పష్టీకరణ

ఆంధ్రభూమి బ్యూరో

అమరావతి, జనవరి 1: జాతీయ స్థాయిలో థర్డ్ ఫ్రంట్ గురించి ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీలే విస్తృత ప్రచారం చేస్తున్నారని, వారికి దేశ క్షేమం గురించి అస్సలు పట్టదని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విమర్శించారు. మోదీ, కేసీఆర్, జగన్ - ఈ ముగ్గురు మోదీలు త్రీడీగా మారి ఫెడరల్ ఫ్రంట్‌ను తెరపైకి తెస్తున్నారని విమర్శించారు. తెలంగాణలో ప్రజాకూటమి ఓటమిని విమర్శిస్తున్న కేంద్ర మంత్రి అరుణ్ జైట్లీ ఆ రాష్ట్రంలో బీజేపీకి ఎన్ని సీట్లు వచ్చాయో గుర్తుంచుకోవాలన్నారు. అక్కడ టీఆర్‌ఎస్ గెలిస్తే జైట్లీకి ఆనందమేమిటని నిలదీశారు. ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న అభివృద్ధిని అడ్డుకోవటం ద్వారా భవిష్యత్‌లో లబ్ధి పొందేందుకు మోదీ, కేసీఆర్ చేస్తున్న కుట్రలో జగన్ సామంతరాజులా మారాడని ఆరోపించారు. దేశాభివృద్ధికి అవసరమైన విధానాలను అవలంభించకపోగా వ్యవస్థలన్నింటినీ గుప్పెట్లో



పెట్టుకుని ప్రతిపక్ష పార్టీలను అణచివేయటమే లక్ష్యంగా పెట్టుకున్నారని మండిపడ్డారు. తప్పుడు సమాచారంతో ప్రజలను మభ్యపెట్టటమే వీరి అజెండా అన్నారు. పార్లమెంట్‌లో ముస్లిం మైనారిటీ సోదరులంతా కేంద్ర - మిగతా 6వ పేజీలో



ఏపీ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ ప్రవీణ్‌కుమార్‌తో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న గవర్నర్ నరసింహన్

• హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా

ప్రవీణ్ కుమార్ ప్రమాణ స్వీకారం

మరో 13 మంది న్యాయమూర్తులతో ప్రమాణం చేయించిన గవర్నర్

విజయవాడ (క్రైం), జనవరి 1: రాష్ట్ర హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సీ ప్రవీణ్‌కుమార్ మంగళవారం ప్రమాణస్వీకారం చేశారు. ఆయనతో తెలుగు రాష్ట్రాల గవర్నర్ ఇఎస్‌ఎల్ నరసింహన్ ప్రమాణీస్వీకారం చేయించారు. చీఫ్ జస్టిస్‌తోపాటు మరో 13మంది హైకోర్టు న్యాయమూర్తులతో కూడా ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హాజరయ్యారు. విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తుల ప్రమాణ స్వీకారోత్సవం ఘనంగా జరిగింది. ముందుగా సభావేదిక వద్దకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేరుకుని గవర్నర్ నరసింహన్‌నకు సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని ప్రారంభించారు. మొదట హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సీ ప్రవీణ్‌కుమార్‌తో ప్రమాణస్వీకారం చేయించగా, అనంతరం న్యాయమూర్తులుగా జస్టిస్ ఎస్వీ భట్, జస్టిస్ ఆకుల వెంకట శేషసాయి, జస్టిస్ ఎం సీతారామమూర్తి, జస్టిస్ యు దుర్గాప్రసాదరావు, జస్టిస్ టి సునీల్‌చౌదరి, జస్టిస్ ఎం సత్యనారాయణ మూర్తి, జస్టిస్ జి శ్యాంప్రసాద్, జస్టిస్ జె ఉమాదేవి, జస్టిస్ ఎన్ బాలయోగి, జస్టిస్ టి రజని, జస్టిస్ టివిఎన్‌ఎస్ సోమయాజులు, జస్టిస్ కె విజయలక్ష్మి, జస్టిస్ ఎం గంగారావు ప్రమాణస్వీకారం చేశారు. తొలుత హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ సి మానవేంద్రనాధ్ రాయ్ రాష్ట్రపతి నోటిఫికేషన్ ప్రొసీడింగ్స్‌ను వేదికపై చదివి వినిపించారు. అనంతరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనిల్ చంద్ర పునేఠా ప్రమాణస్వీకార కార్యక్రమాన్ని ప్రారంభించి తదుపరి గవర్నర్ చేతుల మీదుగా న్యాయమూర్తుల ప్రమాణస్వీకార కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమం పూర్తవగానే ప్రమాణస్వీకార కార్యక్రమం - మిగతా 6వ పేజీలో

90 టీఎంసీలతో రబీ ప్రణాళిక

'పెథాయ్'తో గోదావరి నాట్లకు జాప్యం ◆ సీలేరు నుంచి 60 టీఎంసీలకు అవకాశం ◆ పోలవరం కాఫర్ డ్యామ్‌తో ఇబ్బంది లేనట్టే



గోదావరి జిల్లాలకు ప్రాణాధారమైన ధవళేశ్వరం కాటన్ బ్యారేజి

ఆంధ్రభూమి బ్యూరో

రాజమహేంద్రవరం, జనవరి 1: గోదావరి డెల్టాలో రబీ-2019 నీటి అవసరాలను 90 టీఎంసీలతో పూర్తిచేయడానికి కార్యాచరణ ప్రణాళిక రూపొందించారు. పెథాయ్ తుపాను ప్రభావం వల్ల వరి నాట్లలో కాస్తంత జాప్యం జరిగింది. ప్రస్తుతం కొన్నిచోట్ల నాట్లు జరుగుతుంటే, మరికొన్నిచోట్ల నారుమడులు, ఇంకొన్ని ప్రాంతాల్లో దుక్కులు కూడా జరుగుతున్నాయి. మొత్తమ్మీద వివిధ దశల్లో రబీ పనులు సాగుతున్నాయి. గోదావరి డెల్టాల్లో రబీపంట మాత్రమే కీలకమైన దిగుబడి ఇచ్చే పంట కాబట్టి ప్రధానంగా దృష్టిపెట్టి రైతులు సాగు చేస్తుంటారు. ఖరీఫ్ సమయంలో తుపాన్లు, వరదలు వంటి ప్రకృతి వైపరీత్యాలకు అవకాశముండటంతో రైతులు భయపడుతూనే సాగుచేస్తుంటారు. ఈ నేపథ్యంలో గ్యారంటీ దిగుబడి ఇచ్చేది గోదావరి డెల్టాల్లో రబీ మాత్రమే. ప్రస్తుతం రబీ వరి నాట్లు జోరుగా జరుగుతున్నాయి. ఉభయ గోదావరి జిల్లాలు 10.26 లక్షల ఎకరాల విస్తీర్ణంలో ఈ ఏడాది రబీకి సిద్ధమయ్యాయి. బోర్ల కింద సాగుచేసే భూముల్లో ఇప్పటికే నాట్లు పూర్తయ్యాయి. మరి కొన్నిచోట్ల ముందస్తు నాట్లు కూడా పడ్డాయి. సాగునీటి కాలువల వ్యవస్థలోని డెల్టాలోనే కాస్తంత ఆలస్యంగా నాట్లు సాగుతున్నాయి. ఉభయ గోదావరి జిల్లాల్లో మొత్తంగా సుమారు 45 శాతం వరకు నాట్లు పూర్తయినట్టు అంచనావేస్తున్నారు. ఈసారి రబీ సీజన్‌లో వరితో పాటు మొక్కజొన్న, అపరాలు, శనగ పంటల సాగు విస్తీర్ణం పెరిగినట్టు అంచనా వేశారు. కాగా రబీకి సంబంధించి 90 టిఎంసీల నీరు అవసరమవుతుందని భావిస్తున్నారు. గతంలో - మిగతా 6వ పేజీలో

ప్రకాశం జిల్లాలో భూ ప్రకంపనలు

ఆంధ్రభూమి బ్యూరో


ఒంగోలు, జనవరి 1: కొత్త సంవత్సరం వచ్చీ రావడంతోనే ప్రకాశం జిల్లాలోని ప్రజలను భయాందోళనలకు గురిచేసింది. మంగళవారం ఉదయం 11 గంటల సమయంలో పలుప్రాంతాల్లో భూ ప్రకంపనలు రావటంతో ప్రజలు ఆందోళనకు గురయ్యారు. జిల్లాలోని అద్దంకి, కొరిశపాడు, జె పంగులూరు చినగంజాం మండలాల్లోని పలుగ్రామాల్లో భూమి ఒక సెకను పాటు కంపించింది. ఏం జరుగుతుందో తెలియక ప్రజలు భయాందోళనతో ఇళ్లనుంచి బైటకు పరుగులు తీశారు. ఎటువంటి ప్రాణనష్టం, ఆస్తి నష్టం సంభవించలేదు. కాగా భూకంపంపై అధికారులు స్పందించలేదు.

కూటమికి ఓటమే!

తెలంగాణలో పట్టిన గతే పడుతుంది ◆ రాఫెల్‌లో అవినీతి అబద్ధం ◆ దేశాన్ని నిజాయితీగా పాలించా
పాక్‌కు బుద్ధి చెప్పేందుకే సర్జికల్ దాడులు ◆ అయోధ్యపై సుప్రీం నిర్ణయమే శిరోధార్యం
రైతుల రుణమాఫీ ఎన్నికల స్టంటే ◆ నోట్ల రద్దు తొందరపాటు చర్య కాదు ◆ ప్రధాని నరేంద్ర మోదీ ఉద్ఘాటన

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

న్యూఢిల్లీ, జనవరి 1: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిని చవిచూసినట్లే 2019 లోక్‌సభ ఎన్నికల్లోనూ మహాకూటమికి ఓటమి తప్పదని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు. నాలుగున్నర సంవత్సరాలుగా దేశాన్ని నిజాయితీ, చిత్తశుద్ధితో పరిపాలించాను.. ఇస్లామిక్ ఉగ్రవాదులు జమ్ముకశ్మీర్‌లోని ఉరి సైనిక క్షేత్రంలో మన సైనికులపై చేసిన దాడికి ప్రతీకారంగానే మెరుపు దాడి జరిగింది.. రాఫెల్ యుద్ధ విమానాల కొనుగోలులో అవినీతి ఎంత మాత్రం లేదు.. మన సైనిక దళాలను పరిపుష్టం చేసేందుకు ఎన్ని ఆరోపణలు వచ్చినా సహిస్తాను.. జీఎస్‌టీ సమష్టి నిర్ణయం.. పెద్దనోట్ల రద్దు తొందరపాటు చర్యకాదు.. రైతులను ఆదుకునేందుకు ఆలోచనతో కూడిన కార్యక్రమాన్ని అమలు చేస్తాం.. సుప్రీం కోర్టు నిర్ణయం ఆధారంగా అయోధ్యలో రామమందిర నిర్మాణం జరుగు



తుంది' అని నరేంద్ర మోదీ తెలిపారు. నరేంద్ర మోదీ ఏఎన్‌ఐకి 90 నిమిషాలపాటు ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు విషయాలను వెల్లడించారు. తెలంగాణ ప్రజలు మహాకూటమిని చావుదెబ్బ తీశారు, లోక్‌సభ ఎన్నికల్లోనూ దేశ ప్రజలు మహాకూటమిని ఓడిస్తారని ఆయన తెలిపారు. తెలుగుదేశం జాతీయ అధ్యక్షుడు, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ, ఇతర ప్రతిపక్ష పార్టీల నాయకులతో కలిసి జాతీయస్థాయిలో మహాకూటమిని ఏర్పాటు చేస్తున్నారు దీనిపై మీ అభిప్రాయం ఏమిటన్న ప్రశ్నకు నరేంద్ర మోదీ సమాధానమిస్తూ- తెలంగాణ ప్రజలు మహాకూటమిని చావుదెబ్బ తీశారు, దీని గురించి జాతీయస్థాయిలో ఎందుకు చర్చ జరగటం లేదని ప్రశ్నించారు. తెలంగాణ ప్రజలు ఓడించినట్లే లోక్‌సభ ఎన్నికల్లో దేశ ప్రజలు మహాకూటమిని ఓడిస్తారని ఆయన చెప్పారు. తెలంగాణ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు మీ ఆశీస్సులతోనే ఫెడరల్ ఫ్రంట్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయన్న ప్రశ్నకు బదులిస్తూ- చంద్రశేఖరరావు - మిగతా 6వ పేజీలో

ప్రతీకారంతోనే మెరుపు దాడులు

జమ్మూ-కశ్మీర్‌లోని ఉరి సైనిక శిబిరంపై చేసిన దాడికి ప్రతీకారంగానే పాకిస్తాన్‌పై మెరుపుదాడి చేశామని, దీనిని రాజకీయ ప్రయోజనాల కోసం ఎంతమాత్రం వాడుకోలేదని నరేంద్ర మోదీ తెలిపారు. దీనికోసం కొన్నినెలల పాటు ఏర్పాట్లు చేశామని..



ప్రత్యేకంగా ఎంపిక చేసిన సైనికులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చామని తెలిపారు. పాక్‌లోని ఉగ్ర స్థావరాలపై మెరుపుదాడి జరుగుతున్నప్పుడు ఎప్పటికప్పుడు తనకు సమాచారం అందేలా ఏర్పాట్లు చేశామన్నారు. సూర్యోదయమయ్యే సమయానికి మెరుపుదాడిలో పాల్గొన్న వారంతా వెనక్కి రావాలనే స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామని.. మెరుపుదాడి విజయవంతమైనా, విఫలమైనా.. ఒక్క సైనికుడు కూడా మరణించకూడదనే స్పష్టమైన ఆదేశాలిచ్చామని - మిగతా 6వ పేజీలో

బెనారస్.. పూరీ?

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఎక్కడ నుండి పోటీ చేస్తారనేది చర్చనీయాంశంగా మారింది. ఈ ప్రశ్నకు స్పష్టమైన సమాధానం కూడా ఆయన ఇవ్వలేదు. మీరు ఈసారి వారణాసితోపాటు ఒడిశాలోని పూరి లోక్‌సభ నియోజకవర్గం నుండి పోటీ చేస్తారనే మాట వినిపిస్తోందని.. ఇందులో ఏది నిజమని అడగ్గా- చిరునవ్వే ఆయన సమాధానమైంది. 'నది వద్దకు వచ్చినప్పుడు ఎలా దాటాలనేది నిర్ణయిస్తాం' అని చెప్పారే తప్ప స్పష్టమైన సమాధానం ఇవ్వలేదు.

జనంలోకి గాజు గ్లాసు

జనసేన వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక
త్వరలో జిల్లాలవారీ సమీక్షలు ◆ నెలాఖరున అభ్యర్థుల ప్రకటన?

భీమవరం, జనవరి 1: ఈ ఏడాది జరగనున్న సార్వత్రిక ఎన్నికలను ఎదుర్కోవడానికి జనసేన పార్టీ వందరోజుల కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకున్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ నేతృత్వంలో సుదీర్ఘ కసరత్తు అనంతరం ఈ ప్రణాళిక రూపొందినట్టు సమాచారం. కొత్త సంవత్సర వేడుకలను పురస్కరించుకుని జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ హైదరాబాద్ నుంచి రాష్ట్ర రాజధాని అమరావతికి మకాం మార్చేశారు. ఆయనతో ఉండే జనసైనికులను కూడా విజయవాడకు మకాం మార్చుకోవాలని ఆదేశాలు జారీచేసినట్టు సమాచారం. పవన్‌కళ్యాణ్ ఇక నుంచి నిత్యం పార్టీ కేడర్‌కు, ప్రజలకు అందుబాటులో ఉంటూ ఎన్నికల ప్రణాళికలను అమలు చేయనున్నారు. అన్నిటి కంటే ముందు పార్టీ ఎన్నికల గుర్తు అయిన



'గాజు గ్లాసు'ను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి పార్టీ శ్రేణులు కృషి చేయనున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా నియోజకవర్గాల వారీగా సమీక్షలను జనసేన పార్టీ ప్రారంభించింది. ఈ నియోజకవర్గ సమీక్షల్లో తొమ్మిది ముఖ్యమైన అంశాలను ఆశావహులు తెరమీదకు - మిగతా 6వ పేజీలో

సంపద సృష్టి.. పేదరిక నిర్మూలనే లక్ష్యం

- తలసరి ఆదాయం పెంచుతాం
- అవసరమైతే ప్రతి ఇంటికీ మొబైల్
- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- ఆర్థికాభివృద్ధిపై శ్వేతపత్రం విడుదల



3



కేక్ కట్ చేసి నూతన సంవత్సర వేడుకలు నిర్వహిస్తున్న వైసీపీ అధినేత జగన్

వైఎస్ ఆశయ సాధనకు కృషి చేద్దాం

★ వైసీపీ అధినేత పిలుపు

★ ఒంకులూరు సమీపంలో జగన్ నూతన సంవత్సర వేడుకలు

వజ్రపుకొత్తూరు, జనవరి 1: ప్రజా సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసి వైఎస్ ఆశయ సాధనకు కృషి చేద్దామని వైసీపీ అధినేత జగన్ పిలుపు ఇచ్చారు. ప్రజా సంకల్ప యాత్రలో భాగంగా మంగళవారం ఒంకులూరు సమీపంలో రాత్రి బస చేసిన వేదిక వద్ద 2019 నూతన సంవత్సర వేడుకలను అభిమానులు, కార్యకర్తల మధ్య నిర్వహించారు. ప్రజాసంకల్ప పాదయాత్ర పొడవుప్రజలు చూపిస్తున్న ఆదరాభిమానాలు మరువలేనివి అన్నారు. పాదయాత్రలో భాగంగా అనకాపల్లిలో తిత్లీ, కిడ్నీ బాధితులతో మాట్లాడారు. టీడీపీ మద్దతుదారులే తిత్లీ పరిహారాలు అందుకున్నారని దారి పొడవునా బాధితులు చెబుతున్నారని అన్నారు. కిడ్నీ బాధితుల కోసం ప్రత్యేకంగా పరిశోధనా కేంద్రం ఏర్పాటుతో పాటు, రూ.10 వేల పింఛను అందిస్తామన్నారు. చిన్నారులకు అక్షరభ్యాసాలు చేసి ఆశీర్వదించారు. అనంతరం మందస మండలంలోకి పాదయాత్ర ప్రవేశించింది. పార్టీ నేతలు దువ్వాడ శ్రీనివాస్, డాక్టర్ సీదిరి అప్పలరాజు, నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ముఖ్యమంత్రికి ఎన్‌జీవో నేతల శుభాకాంక్షలు

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 1: అభివృద్ధిలో నవ్యాంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అగ్రగామిగా నిలుపుతూ మెరుగైన పాలనను పారదర్శకతతో అందిస్తున్న నారా చంద్రబాబునాయుడి సేవలు రాష్ట్ర ప్రజలకు భవిష్యత్తులో కూడా అందించాలని కోరుతూ ఏపీఎన్‌జీవో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు పీ అశోక్‌బాబు, ప్రధాన కార్యదర్శి ఎన్ చంద్రశేఖర్‌రెడ్డి మంగళవారం ముఖ్యమంత్రికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ఉండవల్లిలోని ముఖ్యమంత్రి నివాసం వద్ద ఏపీఎన్‌జీవో నేతలు ముఖ్యమంత్రిని కలసి పుష్పగుచ్ఛం అందజేశారు. ముఖ్యమంత్రికి శుభాకాంక్షలు తెలిపిన వారిలో పలువురు ఎన్జీవో నేతలు ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ ఫైల్‌పై

కొత్త ఏడాది సీఎం తొలి సంతకం

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 1: నూతన సంవత్సరంలో చీఫ్ మినిస్టర్ రిలీఫ్ ఫండ్ (సీఎంఆర్‌ఎఫ్) ఫైల్‌పై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తొలి సంతకం చేశారు. వైద్య చికిత్సల సాయం కోసం దరఖాస్తులు 7386 వచ్చాయి. వీటిలో రీయింబర్స్‌మెంట్ ఇస్తున్న కేసులు 6207. ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఇప్పటి వరకూ రీయింబర్స్ చేసిన సొమ్ము 34.5 కోట్ల రూపాయలు. ఎల్వోసీలకు 1179 దరఖాస్తులు రాగా, 19.13 కోట్ల రూపాయలు విడుదల చేశారు. 2014 నుంచి ఇప్పటి వరకూ సీఎంఆర్ఎఫ్ కింద 1249 కోట్ల రూపాయలను విడుదల చేశారు.

చలి తీవ్రతకు ముగ్గురు వృద్ధుల మృతి

కోటవుటర్ల, జనవరి 1: చలి తీవ్రతకు తాళలేక విశాఖ జిల్లా కోటవురట్ల మండలంలో సోమవారం రాత్రి ముగ్గురు వృద్ధులు మృతి చెందారు. కోటవురట్ల రజకవీధికి చెందిన టేకు అచ్చన్న(65), చినలింగాపురం జంక్షన్‌లో కల్లూరి రామయ్యమ్మ(70), రాట్నాలపాలెంలో వారా రాములమ్మ(68) మృతి చెందారు. గతంలో ఎన్నడూ లేని విధంగా చలి గజగజలాడిస్తోంది. ఉష్ణోగ్రతలు దారుణంగా పడిపోతున్నాయి. ఉదయం 11 గంటల వరకు ప్రజలు ఇళ్ళ నుంచి బయటకు రాలేక పోతున్నారు. అలాగే మధ్యాహ్నం మూడు గంటలు కాగానే చలి తీవ్రత పెరుగుతోంది. మరో నాలుగు రోజుల పాటు చలి గాలులు కొనసాగుతాయన్న వార్తలు రావడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

దృష్టి లోపం ఉద్యోగులకు

బయోమెట్రిక్ నుండి మినహాయింపు

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 1: రాష్ట్రంలో వివిధ ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న దృష్టిలోపం గల ఉద్యోగులకు బయోమెట్రిక్ హాజరు నుండి మినహాయింపు ఇస్తున్నట్లు ప్రభుత్వ కార్యదర్శి హెచ్ అరుణ్‌కుమార్ మంగళవారం మెమో నెం 14/103/2017 ద్వారా ఆదేశాలు జారీ చేశారు. వీరికి మానవీయ కోణంలో పాత పద్ధతిలోనే హాజరును అమలు చేయాలని ఆదేశాలలో పేర్కొన్నారు.

పెన్నా అహోబిలం కుడి కాలువ కింద

చెరువులకు నీటిని విడుదల చేయాలి

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 1: గత సంవత్సరం మాదిరిగా పెన్నా అహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ కుడి కాలువ కింద చెరువులకు 2.5 టీఎంసీల నీటిని విడుదల చేసి చెరువులన్నింటినీ నింపేందుకు చర్యలు చేపట్టాలని కోరుతూ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ మంగళవారం సీఎం చంద్రబాబుకు లేఖ రాశారు. ఈ ఏడాది మరింత దారుణంగా కరవు పరిస్థితులు నెలకొన్నాయన్నారు. అనంతపురం జిల్లాలో లక్షలాది ఎకరాల్లో పంటలు వేయలేదని, వేసిన అరకొర పంటలు కూడా నీరులేక ఎండిపోయాయని రామకృష్ణ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది కుడి కాలువ కింద చెరువులకు నీరు ఇవ్వనందు వల్ల గత కొన్ని రోజులుగా రైతులు ఆందోళన బాట పట్టారన్నారు.

కొత్త సంవత్సరం తొలిరోజు

ఉత్సాహంగా అమరావతి సందర్శన

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 1: అమరావతి రాజధాని నగర సందర్శన యాత్రకు కొత్త సంవత్సరం తొలి రోజు మంగళవారం రాష్ట్ర నలుమూలల నుంచి 800 మంది ప్రజలు 17 బస్సుల్లో తరలివచ్చారు. శ్రీకాకుళం జిల్లా రాజాం, విజయనగరం జిల్లా గరుగుబిల్లి, విశాఖపట్నం జిల్లా ఎస్ రాయవరం, తూర్పు గోదావరి జిల్లా రాజమండ్రి అర్బన్, రూరల్, కృష్ణా జిల్లా నూజివీడు, గుంటూరు జిల్లా ఫిరంగిపురం, మేడికొండూరు, ప్రకాశం జిల్లా అద్దంకి, తాళ్లూరు, కర్నూలు జిల్లా నంద్యాల, అనంతపురం జిల్లా హిందూపురం, లేపాక్షి, చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం, యాదమరి, కడప జిల్లా ప్రొద్దుటూరు, రాజుపాలెం మండలాల నుంచి అమరావతి సందర్శన యాత్రకు ప్రజలు తరలివచ్చారు. ఉద్దండరాయునిపాలెంలోని ఎక్స్‌పీరియన్స్ సెంటర్ త్రీడీ మోడల్ ఆసక్తిగా తిలకించారు. రాజధాని విశేషాలు అధికారుల ద్వారా తెలుసుకున్నారు. శంకుస్థాపన ప్రదేశం చూశారు. సీడ్ యాక్సిస్ రోడ్డు, ఇతర రోడ్లు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఐఏఎస్ అధికారుల నివాసాలు, ఎన్జీవో, గెజిటెడ్, గ్రూప్ డి ఉద్యోగుల నివాసాల పనులను పరిశీలించారు. జ్యుడీషియల్ కాంప్లెక్స్ దగ్గర సందర్శకులు ఫొటో సెషన్‌లో పాల్గొన్నారు. వెలగపూడి సెక్రటేరియట్‌ను సందర్శించారు. కమిషనర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్, అదనపు కమిషనర్ సగిలి షణ్మోహన్ అమరావతి సందర్శన యాత్రకు సంబంధించిన అన్న ఏర్పాట్లను ప్రత్యేక అధికారుల ద్వారా చేయించారు. ప్రజలకు ఉద్దండరాయునిపాలెం దగ్గర ఏపీసీఆర్‌డీఏ ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసి భోజనాలు, ఇతర ఏర్పాట్లు చేశారు.

మత్స్యకారుల విడుదలకు చర్యలు తీసుకోండి

కేంద్రానికి ముఖ్యమంత్రి లేఖ

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 1: పాకిస్థాన్ చేతుల్లో బందీలుగా ఉన్న శ్రీకాకుళం మత్స్యకారుల విడుదలకు చర్యలు తీసుకోవాలని కేంద్రానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మరోసారి లేఖ రాశారు. గత ఏడాది నవంబర్ 29న గుజరాత్ దగ్గర సముద్రంలో వేటకు వెళ్లి పాకిస్థాన్ బలగాల చేతుల్లో బందీలైన శ్రీకాకుళం మత్స్యకారుల విడుదలకు చర్యలు తీసుకోవాలని కేంద్ర హోం శాఖ మంత్రి రాజనాథ్ సింగ్‌కు, విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి సుష్మాస్వరాజ్‌కు విడివిడిగా మంగళవారం ముఖ్యమంత్రి లేఖలు రాశారు. పొట్టకూటి కోసం గుజరాత్ వెళ్లి పాకిస్థాన్ చెరలో చిక్కుకున్నారని, వారిపై దయ చూపాలని ఆ లేఖల్లో కోరారు. మత్స్యకార కుటుంబాలు అనాథలయ్యాయని, ఇప్పటికే 22 మత్స్యకారులకు చెందిన 11 కుటుంబాలకు 2 లక్షల రూపాయల చొప్పున సాయం చేసినట్లు తెలిపారు.

దేశంలోనే అత్యుత్తమ న్యాయస్థానంగా తీర్చిదిద్దాలి

ఏపీ హైకోర్టును ప్రారంభించిన సుప్రీం కోర్టు జస్టిస్ ఎన్‌వీ రమణ

విజయవాడ (క్రైం), జనవరి 1: ఆంధ్రప్రదేశ్ హైకోర్టును దేశంలోనే అత్యుత్తమ న్యాయస్థానంగా తీర్చిదిద్దాలని సుప్రీంకోర్టు న్యాయమూర్తి నూతలపాటి వెంకట రమణ అన్నారు. విజయవాడలో ఏర్పాటు చేసిన తాత్కాలిక హైకోర్టు భవనాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. హైకోర్టు చీఫ్ జస్టిస్‌తోపాటు 13మంది జడ్జిల ప్రమాణ స్వీకారం ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో పూర్తయిన తర్వాత ముఖ్యమంత్రితో సహా అందరూ తాత్కాలిక హైకోర్టు ఏర్పాటు చేయనున్న ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయానికి చేరుకున్నారు. ఇక్కడ ప్రారంభ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సుప్రీం కోర్టు న్యాయమూర్తి ఎన్‌వి రమణ, ముఖ్యమంత్రి చంద్రబాబు, హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి సి ప్రవీణ్‌కుమార్‌తో కలిసి హైకోర్టు భవన సముదాయాన్ని ప్రారంభించారు. భవనంలోని మొదటి అంతస్తులో చీఫ్ జస్టిస్ ఛాంబర్‌తోపాటు లాంజ్‌ను ప్రారంభించారు. అనంతరం ఇక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జస్టిస్ రమణ మాట్లాడుతూ కోర్టులను ఆదర్శవంతమైన సంస్థగా రూపుదిద్దడంలో న్యాయమూర్తులు, న్యాయవాదులు, ప్రజలు సహకరించి వ్యవహరించినప్పుడే అది సాధ్యమవుతుందన్నారు. హైకోర్టు నిర్వహించాల్సిన విధులు క్లిష్టతరంగా, అదే సమయంలో సున్నితంగా ఉంటాయన్నారు.

వ్యక్తికి వ్యక్తికి, వ్యక్తికి-ప్రభుత్వానికి వచ్చే వ్యాజ్యాలు విచారించి న్యాయాన్ని నిర్ధారించాల్సిన బాధ్యత మనపై ఉందని గుర్తు చేశారు. ఈ కర్తవ్యాన్ని నిష్కర్షగా నిర్వహించాల్సి ఉందని, ప్రజల ప్రాథమిక హక్కులను కాపాడటమే కాకుండా రాజ్యాంగంలోని అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలని, తీర్పులు వెల్లడించే సమయంలో న్యాయమూర్తులు స్వతంత్రంగా వ్యవహరించాలన్నారు. న్యాయవ్యవస్థ పట్ల ప్రజలకు గౌరవభావం ఉండేవిధంగా పనితీరు మెరుగుపరుచుకోవాలని సూచించారు. న్యాయసేవాసంస్థల ప్రతిష్టను పెంపొందించేలా ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలన్నారు.

ఇది చారిత్రక ఘట్టం: ముఖ్యమంత్రి చంద్రబాబు

ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మాట్లాడుతూ నవ్యాంధ్రప్రదేశ్ తొలి ముఖ్యమంత్రిగా తాను, తొలి గవర్నర్‌గా ఈఎస్ఎల్ నరసింహన్, బాధ్యతలు చేపట్టామని, జనవరి 1వ తేదీన రాష్ట్ర నూతన హైకోర్టు ఏర్పడటం, దానికి తొలి ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సి ప్రవీణ్‌కుమార్ వ్యవహరించడం చారిత్రాత్మక ఘట్టమన్నారు. ప్రజల వద్దకే న్యాయవ్యవస్థ చేరాలన్నారు. రాష్ట్ర విభజన తర్వాత హైకోర్టు పూర్తి స్థాయిలో విభజన జరిగిందని భావిస్తున్నట్లు చెప్పారు. ఇక నుంచి స్వంత గడ్డ మీద నుంచే న్యాయపాలన జరుగుతుందని అన్నారు. ఇందుకోసం ప్రభుత్వపరంగా పూర్తి సహాయ సహకారాలు అందించేందుకు కట్టుబడి ఉన్నామన్నారు. అమరావతిలో హైకోర్టు భవన నిర్మాణాలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నామని త్వరలో పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్‌సి ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ నవ్యాంధ్రప్రదేశ్‌లో హైకోర్టు ఏర్పాటుకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్‌వి రమణ సూచనలను పరిగణనలోకి తీసుకోవడం ప్రశంసనీయమంటూ అందుకు కృతజ్ఞతలు తెలియచేశారు. ఆంధ్రప్రదేశ్‌లో తొలి హైకోర్టు గుంటూరు కేంద్రంగా పని చేసిందని తదుపరి 1956లో హైదరాబాద్‌కు తరలించారన్నారు. నవ్యాంధ్రప్రదేశ్ ఏర్పాటు చేశాక తిరిగి అమరావతి రాజధాని ప్రాంతంలో హైకోర్టు కార్యకలాపాలకు శ్రీకారం చుడుతున్నామన్నారు. 62 ఏళ్ళ తర్వాత తిరిగి విజయవాడలో అమరావతి రాజధాని కేంద్రంగా న్యాయపాలన ప్రారంభం కావడం చారిత్రాత్మక ఘట్టమన్నారు. అనంతరం సుప్రీం కోర్టు జస్టిస్ ఎన్‌వి రమణ, హైకోర్టు చీఫ్ జస్టిస్ ప్రవీణ్‌కుమార్‌ను ముఖ్యమంత్రి శాలువాతో సత్కరించారు. తర్వాత చీఫ్ జస్టిస్ ప్రవీణ్‌కుమార్.. ఎన్‌వి రమణను సత్కరించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కొల్లు రవీంద్ర, దేవినేని ఉమామహేశ్వరరావు, చీఫ్ సెక్రటరీ అనిల్ చంద్ర పునీతా, హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ సిహెచ్ మానవేంద్రనాథ్ రాయ్, నూతనంగా ప్రమాణ స్వీకారం చేసిన హైకోర్టు న్యాయమూర్తులు, ఉన్నతాధికారులు, జడ్జిలు పాల్గొన్నారు.

న్యాయవ్యవస్థలో అతిపిన్న వయస్సు హైకోర్టు

: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగోయ్ సందేశాన్ని వినిపించిన జస్టిస్ ఎన్‌వీ రమణ

ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఈరోజు దేశంలోని న్యాయవ్యవస్థలో అతి పిన్న వయస్సుతో ఉందని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగోయ్ అన్నారు. నూతన హైకోర్టు ప్రారంభం సందర్భంగా సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ తన సందేశాన్ని పంపారు. హైకోర్టును ప్రారంభించిన సుప్రీంకోర్టు జస్టిస్ ఎన్‌వి రమణ ఈ సందర్భంగా సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ రంజన్ గొగోయ్ సందేశాన్ని చదివి వినిపించారు. ఈనెల 21వ తేదీన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి రంజన్ గొగోయ్ చేతులమీదుగా అమరావతి రాజధానిలో హైకోర్టు భవనాలను ప్రారంభించి పూర్తి స్థాయిలో న్యాయ కార్యకలాపాలు నిర్వహిస్తామన్నారు.

హైకోర్టు ప్రారంభానికి సుప్రీం చీఫ్ జస్టిస్ వచ్చేందుకు సంసిద్ధంగా ఉన్నారన్నారు. జస్టిస్ ఎన్‌వి రమణ తన ప్రసంగాన్ని ప్రారంభించే ముందు సుప్రీం చీఫ్ జస్టిస్ సందేశాన్ని వినిపించారు. ఈరోజు ఏపీ రాష్ట్ర హైకోర్టు పిన్న వయస్సు కలిగిందన్నారు. మన న్యాయవ్యవస్థ నిస్సందేహంగా గర్వించదగినదిగా ఉండలన్నారు. ఉన్నతంగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత మనపై ఉందని ఆనందంతో మన విధుల్లో భాగస్వాములు కావాలని సందేశంలో తెలియచేశారు. న్యాయ వ్యవస్థలో న్యాయవాదులు జవాబుదారీగా వ్యవహరించాల్సిన అవశ్యకత ఉందన్నారు. నూతన హైకోర్టు ప్రారంభం సందర్భంగా రంజన్ గగోయ్ తన సందేశంలో శుభాకాంక్షలు తెలిపారు.





విజయవాడలోని సీఎం క్యాంపు కార్యాలయంలో తాత్కాలికంగా ఏపీ హైకోర్టును ప్రారంభిస్తున్న జస్టిస్ ఎన్‌వీ రమణ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, జస్టిస్ ప్రవీణ్‌కుమార్

ప్రతిష్టాత్మకంగా జన్మభూమి

★ నేడు కుప్పంలో ముఖ్యమంత్రి చంద్రబాబు గ్రామసభ

★ 11 తరువాత జిల్లాల అభివృద్ధిపై డాక్యుమెంట్లు

★ నెలాఖరుకు రాష్ట్రస్థాయి కార్యాచరణ ప్రణాళిక

ఆంధ్రభూమి బ్యూరో

అమరావతి, జనవరి 1: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జన్మభూమి- మావూరు కార్యక్రమం బుధవారం నుంచి ప్రారంభం కానుంది. రాష్ట్రంలో గత నాలుగున్నరేళ్లకు పైగా జరిగిన అభివృద్ధి, విభజన అనంతరం రాష్ట్ర పరిస్థితి భవిష్యత్ ప్రణాళికలను నిర్దేశిస్తూ గత పదిరోజులుగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విడుదల చేస్తున్న శ్వేతపత్రాలతో పాటు గ్రామసభల ద్వారా ఆయా గ్రామాల్లో ఇప్పటి వరకు జరిగిన అభివృద్ధిని అంచనావేస్తూ భవిష్యత్‌లో చేపట్టాల్సిన కార్యక్రమాలపై కార్యాచరణ రూపొందించటమే ఈ జన్మభూమి ప్రధాన అజెండా. ఎన్నికల ముందు జరుగుతున్న ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది.

కార్యక్రమానికి విధిగా హాజరు కావాలని ఇప్పటికే మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీశ్రేణులను ముఖ్యమంత్రి ఆదేశించారు.

మరోవైపు అధికారులు రోజూ గ్రామసభలు నిర్వహించి సమస్యలు ఉత్పన్నమైతే ప్రభుత్వానికి నివేదించాలని ఆదేశించారు. పదిరోజులు పది అంశాలపై జన్మభూమి గ్రామసభలు నిర్వహిస్తారు. గ్రామసభల అనంతరం ఈనెల 11 తరువాత జిల్లాల వారీగా విజన్ డాక్యుమెంట్ రూపొందిస్తారు.

నెలాఖరుకు రాష్ట్ర స్థాయి లక్ష్యాలను నిర్దేశించుకుని గ్రామాలు, పట్టణాల్లో అవసరమైన మౌలిక వసతుల కల్పన, ఆర్థిక పరిపుష్టికి అవసరమైన కార్యాచరణ రూపొందిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వివరించారు. జన్మభూమి కార్యక్రమం ద్వారా ప్రజలతో మమేకం కావాలని ఎమ్మెల్యేలను ఆదేశించారు.

జన్మభూమి- మావూరు కార్యక్రమం పదిరోజులు 10 అంశాలతో ప్రభుత్వం నిర్దేశించింది. తొలిరోజు రాష్ట్ర పునర్విభజన చట్టంపై గ్రామసభల్లో చర్చ జరుగుతుంది. రెండోరోజు రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు- అభివృద్ధి, 3వ రోజు సంక్షేమం- సామాజిక సాధికారత, 4వ రోజు రైతాంగ సంక్షేమం- ఆహారభద్రత, ప్రకృతి సేద్యం, 5వ రోజు సహజవనరులు, జలసంరక్షణ, గ్రీన్‌విజన్, క్వాలిటీ ఆఫ్ లైఫ్, 6వ రోజు మానవ వనరుల అభివృద్ధి, వైద్యం, ఆరోగ్యం, విద్యపై చర్చిస్తారు. 8వ రోజు ఇంధనరంగం, ముఖ్య మౌలిక వసతులు, 9వ రోజు పరిశ్రమలు- ఉపాధి- నైపుణ్యాభివృద్ధి, 10వరోజు సుపరిపాలన, ఈ-ప్రగతి, శాంతిభద్రతల అంశాలపై గ్రామసభలు నిర్వహిస్తారు.

ఇది నా పుస్తకం అదృష్టం!

30వ పుస్తక మహోత్సవ ప్రారంభ సభలో ఆచార్య రాజమోహన్ గాంధీ

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 1: తాను రచించిన పుస్తకాన్ని విజయవాడలోని ప్రముఖుల మధ్య ఆవిష్కరించినందుకు చాలా ఆనందంగా ఉందని ప్రముఖ చరిత్రకారుడు, మహాత్మా గాంధీ మనవడు ఆచార్య రాజమోహన్ గాంధీ అన్నారు. నవభారత ప్రకాశరావు ప్రాంగణంలో యద్దనపూడి సులోచనారాణి సాహిత్య వేదికపై ఎన్టీఆర్ ట్రస్ట్, సాంస్కృతిక శాఖ, విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ సంయుక్తంగా నిర్వహించిన 30వ పుస్తక మహోత్సవాన్ని మంగళవారం రాత్రి ఘనంగా ప్రారంభించారు. ఈసందర్భంగా ముఖ్యఅతిథిగా ఆచార్య రాజమోహన్ గాంధీ మాట్లాడుతూ గాంధీజీ గురించి తనను చాలా మంది అడుగుతూ ఉంటారని, గాంధీజీ స్వాతంత్ర్య సమరయోధులే కాదు, జర్నలిస్ట్ కూడా అని తాను చెబుతుంటానన్నారు. 1904లో దక్షిణాఫ్రికాలో ఇండియన్ ఒపీనియన్ అనే పత్రికను స్థాపించారని, దేశానికి తిరిగి వచ్చి యంగ్ ఇండియన్, హరిజన్ అనే పత్రికలు స్థాపించారని చెప్పారు. ఈసందర్భంగా రాజమోహన్ గాంధీ రచించిన 'మోడ్రన్ సౌత్ ఇండియన్' పుస్తకాన్ని శాసనసభ ఉప సభాపతి మండలి బుద్ధప్రసాద్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో పుస్తక ప్రచురణకర్తలకు అత్యధిక ప్రాధాన్యత ఉండేదన్నారు. ఈ పుస్తక మహోత్సవం పాఠకాభిరుచికి మరింత దోహద పడుతుందన్నారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆర్పీ సిసోడియా మాట్లాడుతూ సాహిత్యానికి సాంస్కృతిక రాజధానిగా ఉన్న ఆంధ్రప్రదేశ్ పుస్తక ప్రచురణలో ప్రముఖ పాత్రను పోషిస్తోందన్నారు. 30 సంవత్సరాలుగా పుస్తక మహోత్సవాలను నిర్వహిస్తున్న కమిటీ సభ్యులను అభినందించారు. జిల్లా కలెక్టర్ బీ లక్ష్మీకాంతం మాట్లాడుతూ కలంతో రాసే వాక్యం హృదయాన్ని కదిలిస్తుందన్నారు. విజ్ఞానంతో కూడిన సొసైటీ రావాలని ఆకాంక్షించారు. నగర మేయర్ కోనేరు శ్రీధర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇంటర్నెట్ వచ్చిన తరువాత ఇబ్బందులు, సౌకర్యాలు ఉన్నాయని, హీరోలకు ఇచ్చే ప్రాముఖ్యత దేశ నాయకులకు ఇవ్వడంలేదని వాపోయారు. జాతీయ నేతల ప్లెక్సీలు ఎక్కడా కన్పించవని, అయితే సినీ యాక్టర్ల ప్లెక్సీలు ఎడాపెడా కన్పిస్తుంటాయన్నారు. వీటికి పిల్లల వద్ద అంతటి డబ్బు ఎలా ఉంటోందో, తల్లిదండ్రులు ఇస్తున్నారా? లేక ఎక్కడైనా కాజేస్తున్నారా? అంతుబట్టటం లేదన్నారు. జూదంలా రాజకీయం కూడా ఓ వ్యసనమన్నారు. తానెక్కడయినా లంచం తీసుకున్నానని నిరూపిస్తే యావదాస్తిని రాసిస్తానని సవాల్ చేశారు. ఎమెస్కో అధినేత విజయ్‌కుమార్ స్వాగతోపన్యాసం చేశారు.


ప్రముఖ రచయిత కొలకలూరి ఇనాక్ జ్యోతి ప్రజ్వలన చేశారు. కార్యక్రమంలో రాజమోహన్ గాంధీ సతీమణి ఉషాగాంధీ, విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ అధ్యక్షుడు వెంకటనారాయణ, గౌరవాధ్యక్షుడు బాబ్జీ, ప్లానింగ్ కమిషన్ పెద్ది రామరావు, రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు దీర్ఘాసి విజయ్‌భాస్కర్, కవి గౌరీ శంకర్, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు రాయితీల్లో రాజీ పడం

జేఏసీ అమరావతి నేతలతో సీఎం

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 1: ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులకు కల్పించాల్సిన రాయితీల విషయంలో ప్రభుత్వం ఎక్కడా రాజీపడే ప్రశక్తే లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. ఇది ఉద్యోగుల ప్రభుత్వమని, అయితే ఉద్యోగులంతా మరింత బాధ్యతగా పని చేస్తూ స్వర్ణాంధ్ర సాధనకు తోడ్పాటు అందించాలని కోరారు. ఏపీ జేఏసీ అమరావతి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు నేతృత్వంలో 32 ఉద్యోగ సంఘాల ప్రతినిధుల బృందం మంగళవారం సీఎం చంద్రబాబును కలిసి నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా ఆయా సంఘాల క్యాలెండర్లు, డైరీలను బాబు ఆవిష్కరించారు. బొప్పరాజు మాట్లాడుతూ సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, 70ఏళ్లు నిండిన విశ్రాంత ఉద్యోగులకు 15శాతం అదనపు పెన్షన్ తక్షణం మంజూరు చేయాలని, ఎన్ఎంఆర్, రోజువారీ వేతన కూలీలు, ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగుల సర్వీసులను క్రమబద్ధీకరించాలని, పీఆర్‌సీ నివేదిక వెల్లడిలో జాప్యం జరుగుతోందని, తక్షణం ఇంటీరియం రిలీఫ్ ప్రకటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జేఏసీ సెక్రటరీ జనరల్ టీవీ ఫణిపేర్రాజు, కోశాధికారి మురళీకృష్ణ నాయుడు, కోఛైర్మన్‌లు ఆల్ఫ్రెడ్, నారాయణరెడ్డి, ఆయా సంఘాల రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.





విజయవాడలో మంగళవారం పుస్తక మహోత్సవాన్ని ప్రారంభిస్తున్న రాజమోహన్ గాంధీ తదితర ప్రముఖులు, రాజమోహన్ గాంధీ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మండలి బుద్ధప్రసాద్, తదితరులు



తల్లిదండ్రులకు చిన్నారిని అప్పగిస్తున్న తిరుమల పోలీసులు

చిన్నారి కిడ్నాప్ కథ సుఖాంతం

తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు

ఆంధ్రభూమి బ్యూరో

తిరుపతి, జనవరి 1: తిరుమలలో ఐదు రోజుల కిందట శుక్రవారం కిడ్నాప్‌కు గురైన మహారాష్ట్ర లాతూర్ జిల్లాకు చెందిన వీరేశ్ (18నెలలు)ను మంగళవారం తిరుపతి అర్బన్ ఎస్పీ కార్యాలయంలో బాలుడి తల్లిదండ్రులు ప్రశాంత్ జీ యాదవ్, స్నేహలకు ఎస్పీ అన్బురాజన్ అందించారు. దాదాపు 100 గంటల తరువాత బిడ్డ సురక్షితంగా చేరడంతో తల్లిదండ్రుల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. నాలుగు రోజుల తరువాత తల్లిదండ్రులను చూసిన బాలుడు కూడా తల్లి ఒడిలో చేరి గట్టిగా కౌగిలించుకోవడం చూపరులను కంట తడిపెట్టించింది. వాస్తవానికి డిసెంబర్ 30న కిడ్నాపర్ విశ్వంభర్‌ను, బాలుడిని మహారాష్ట్రలోని నాందేడు జిల్లా మాహూర్ టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నాందేడులోని రేణుకాదేవి ఆలయం వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తుండటం, సోషల్ మీడియాలో కిడ్నాపర్, బాలుడి ఫొటోలను గమనించిన ఓ వ్యక్తి మాహూర్ టౌన్ పోలీసులకు సమాచారం అందించాడు. పోలీసులు వెంటనే స్పందించి విశ్వంభర్‌ను, బాలుడిని అదుపులోకి తీసుకుని తిరుపతి అర్బన్ పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే అర్బన్ ఎస్పీ అన్బురాజన్ సీఐ రామకృష్ణతో కూడిన బృందాన్ని మహారాష్ట్రకు పంపించారు. మహారాష్ట్రలో బాలుడిని, నిందితుడిని అదుపులోకి తీసుకున్నా న్యాయపరమైన అంశాలకు సంబంధించి కొంత జాప్యం జరిగి చివరకు వీరేశ్‌ను తల్లిదండ్రుల ఒడికి చేర్చిన అర్బన్ పోలీసులను పలువురు అభినందించారు. ఈసందర్భంగా ఎస్పీ అన్బురాజన్ మాట్లాడుతూ 27వ తేదీన ప్రశాంత్ జీ యాదవ్ కుటుంబ సమేతంగా తిరుమలకు వచ్చినప్పటి నుంచి కిడ్నాప్ జరిగిన సంఘటన నుంచి కథ సుఖాంతం అయినంత వరకు జరిగిన సంఘటనలను వివరించారు. కిడ్నాప్ సమాచారం తెలిసిన వెంటనే ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియాతో పాటు సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం చేయడంతో కిడ్నాపర్ సులభంగా దొరికాడన్నారు. సోమవారం నిందితుడిని, బాలుడిని తీసుకువచ్చేందుకు ట్రాన్సిట్ వారెంట్‌తో కోర్టు ముందు హాజరుపరిచామన్నారు. టీటీడీ ఈఓ ఏకే సింఘాల్, జేఈఓ శ్రీనివాసరాజు, సీవీఎస్వో గోపీనాథ రెడ్డిలు ఈ కేసు ఛేదనలో ఎంతో సహకరించారని, వారందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కేసును ఛేదించడంలో కృషి చేసిన పోలీస్ సిబ్బందికి రివార్డులు ఇవ్వనున్నట్లు, పాత్రికేయులకు ధన్యవాదాలు తెలిపారు.

ఇదిలావుండగా కిడ్నాపర్ ఐ.విశ్వంభర్ తెలంగాణ రాష్ట్రం నిజామాబాద్ వాసి. ఈయన పోలీసుల విచారణలో ఆసక్తికరమైన విషయాలను చెప్పాడు. ముందుగా వీరేశ్ తన బిడ్డేనని చెప్పుకున్నా, తాను మేస్త్రీపని చేసుకుని జీవనం సాగిస్తున్నానని, తనకు 43 సంవత్సరాలని అవివాహితుడని అన్నారు. తరచూ తిరుమలకు వస్తుంటానని అవకాశం దొరికినప్పుడల్లా దొంగతనాలు చేస్తుంటానని చెప్పారు. ఒక చిన్న బిడ్డను పెంచుకుంటే వృద్ధాప్యంలో తనకు ఆసరాగా ఉంటాడనే ఉద్దేశ్యంతోనే వీరేశంను కిడ్నాప్ చేసినట్లు వివరించాడు.

దళారుల ప్రమేయం లేకుండా లబ్ధిదారులకే స్త్రీనిధి ఫలాలు

చంద్రబాబుతోనే మహిళా సాధికారత ★ మంత్రి పరిటాల సునీత

గుంటూరు, జనవరి 1: దళారుల ప్రమేయం లేకుండా నేరుగా లబ్ధిదారులకే స్త్రీ నిధి పథకం ఫలాలు అందేలా తెలుగుదేశం ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి పరిటాల సునీత తెలిపారు. గుంటూరులోని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ పేద మహిళల అభ్యున్నతి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న స్త్రీ నిధి పథకం సత్ఫలితాలను ఇస్తోందన్నారు. మహిళలు స్వయంశక్తితో ఎదిగి ఆర్థిక పరిపుష్టి సాధించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. రెండు దశాబ్దాల క్రితమే మహిళల ఆర్థిక స్వాతంత్ర్యం కోసం చంద్రబాబు ఏర్పాటు చేసిన డ్వాక్రా సంఘాలు నేడు సత్ఫలితాలు ఇస్తున్నాయన్నారు. డ్వాక్రా మహిళలకు ఆర్థిక సహకారం అందించి వారి కుటుంబాలకు నెలకు 10 వేల రూపాయల ఆదాయం కల్పించే విధంగా స్త్రీ నిధి పథకం దోహద పడుతుందన్నారు. ఈ పథకం కింద దరఖాస్తు చేసుకున్న మహిళలకు 48 గంటల్లోనే బీమాతో కూడిన రుణాలను ప్రభుత్వం అందిస్తుందని చెప్పారు. నూతన ఏడాదిలో కూడా అదే స్ఫూర్తిని కొనసాగించి రాష్ట్రాభివృద్ధికి మహిళలను కీలకశక్తిగా మార్చనున్నామన్నారు. ఈ పథకం గ్రామాలు, పట్టణాల్లోని ఎన్నో కుటుంబాల్లో నూతన వెలుగులు నింపిందన్నారు. ఉపాధితో పాటు కులవృత్తులు, పాడిపరిశ్రమ, చిరువ్యాపారులు రుణాలు పొంది, వాటిని సద్వినియోగం చేసుకుంటున్నారన్నారు. గత ప్రభుత్వ హయాంలో 5.69 లక్షల మంది డ్వాక్రా మహిళలకు స్త్రీనిధి ద్వారా కేవలం రూ. 975 కోట్లు మాత్రమే అప్పుగా ఇవ్వగా, గడిచిన నాలుగున్నరేళ్ల కాలంలో 16.77 లక్షల మందికి రూ. 4,313 కోట్లు వడ్డీ లేని రుణాలుగా అందించడం జరిగిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో కేవలం రూ. 58 కోట్ల మేర వడ్డీ రాయితీ ఇవ్వగా, టీడీపీ ప్రభుత్వం రూ. 238 కోట్ల మేర వడ్డీ రాయితీ ఇచ్చి ఆదుకుందన్నారు.

చిరు వ్యాపారుల జీవనోపాధి నిమిత్తం 2017 నుండి ప్రభుత్వం డ్వాక్రా మహిళలకు లక్ష వరకు స్త్రీనిధి నుండి జీవనోపాధి రుణాలు అందజేస్తోందని వివరించారు. వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలకు గాను 1,52,498 మంది మహిళలకు రూ. 179 కోట్ల రుణాలు ఇచ్చామన్నారు. స్త్రీ నిధి రుణ సేవలతో పాటు రుణ సేకరణ, పొదుపు సేవల కోసం అప్పు, బీమా సేవలు, బిజినెస్ కరస్పాండెంట్ సేవలు అందిస్తూ, ఎస్సీ, ఎస్టీ జీవనోపాధికై రుణాలు అందిస్తున్నామని మంత్రి పేర్కొన్నారు.

అపెక్స్ కమిటీ చేతిలో జీసీసీ

★ గందరగోళంగా పంపకాల ప్రక్రియ
★ ఐదేళ్ళు పూర్తవుతున్నా తీరని సమస్య

ఆంధ్రభూమి బ్యూరో

విశాఖపట్నం, జనవరి 1: విభజన జరిగి నాలుగేళ్లయినా తెలంగాణా, ఆంధ్ర రాష్ట్రాలకు సంబంధించిన జీసీసీ ఆస్తుల పంపకాలు మాత్రం ఇప్పటికీ జరగలేదు. 58:42 నిష్పత్తిలో రెండు రాష్ట్రాల ఆస్తులు పంచాల్సి ఉన్నా దీనికి సంబంధించి కమిటీలు వేయడం, ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపడం, రెండు రాష్ట్రాలకు చెందిన అధికారులు అనేకసార్లు సమావేశాలు కావడం, దీనిపై పరిశీలన చేసి మరీ ఓ నివేదికను తయారు చేయడం వంటివి జరుగుతూనే ఉన్నాయి.

అయితే ఆస్తుల పంపకాలు మాత్రం ఓ కొలిక్కి రావడంలేదు. దీనికి మరికొంత సమయం పట్టే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఉద్యోగుల విభజన రెండేళ్ళ కిందటే జరిగిపోయింది. ఆంధ్ర రాష్ట్రంలో కేవలం ఇద్దరు మాత్రం తెలంగాణా ఉద్యోగులు పనిచేస్తున్నారు. వీరి అంగీకారం మీదే విశాఖలో ఉన్న జీసీసీ ప్రధాన కార్యాలయంలో పనిచేస్తుండగా అదే తెలంగాణాలో మాత్రం అధికార, ఉద్యోగ వర్గాల్లో ఏ ఒక్కరూ ఏపీకి చెందిన వారు లేకపోవడం విశేషం. క్షేత్ర స్థాయి నుంచి అధికారుల వరకు ప్రతిఒక్కరూ సంబంధిత రాష్ట్రాల్లో ఉండగా, జీసీసీకి సంబంధించి ఆస్తుల పంపకాలు జరిగితే ఏపీకి రూ.50కోట్లకు పైగానే రావాల్సి ఉంటుంది. అయితే ఇందులో తెలంగాణాకు ఇవ్వాల్సింది పెద్దగా ఉండదని, పేరుకే పంపకాలు తప్పితే ఆర్థికపరమైన లావాదేవీలు నిర్వహించాల్సిన పనే లేదంటూ జీసీసీ యాజమాన్యం కచ్చితంగా చెబుతోంది. విడిపోయిన తరువాత కూడా జీతభత్యాలు, అటవీ ఉత్పత్తులు, జీసీసీ స్టాళ్ళు, కార్యాలయాలు, డిపోల నిర్వహణ, వ్యాపారానికి సంబంధించి కోట్లాది రూపాయల మేర తెలంగాణా ప్రభుత్వం వద్దనే ఉండిపోయినందున తిరిగి ఇవ్వాల్సిన అవసరం ఉండకపోవచ్చని జీసీసీ ఉన్నతాధికారి ఒకరు స్పష్టం చేశారు. అయితే వాటాలో ఒక్క పైసా తమకు రావాల్సి ఉన్నా వదులుకునేది లేదంటూ తెలంగాణా నుంచి జీసీసీ యాజమాన్యంపై వత్తిడి పెరుగుతోంది. ఆస్తుల పంపకాలు అంటూ జరిగితే కళ్ళెదుట కనిపించేది విశాఖలో ఉన్న జీసీసీ ప్రధాన కార్యాలయే. సమైక్యాంధ్రాగా ఉన్నపుడు హైదరాబాద్ వెల్ఫేర్ భవన్ మొత్తంలో జీసీసీ రీజనల్ కార్యాలయమే నడిచేది. అది కూడా చిన్నపాటి అద్దె భవనంలో. నాటి నుంచి ఇప్పటి వరకు జీసీసీ ప్రధాన కార్యాలయం విశాఖలోనే ఉన్నందున ఇపుడు తెలంగాణా కళ్ళు దీనిపై పడుతున్నాయి. ఇక వ్యాపారపరంగా గత నాలుగేళ్ళుగా చూస్తే రూ.150 కోట్ల నుంచి క్రమేపీ పెరుగుతూ ఇపుడు దాదాపు రూ.400 కోట్లకు వార్షికాదాయం చేరుకుంది. 13 జిల్లాలతో కూడిన ఏపీలో జీసీసీ వ్యాపారపరంగా వార్షికాదాయం రూ.400 కోట్లు ఉండగా ఇపుడు దీనిని ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేలోపు రూ.500 కోట్లపైగానే పెంచుకోవాలని యాజమాన్యం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ విధంగా సమైక్యాంధ్రాగా ఉన్నపుడు కంటే విడిపోయిన తరువాత గత నాలుగున్నరేళ్ళుగా చూస్తే వ్యాపార లక్ష్యాలు సాధించడం, జీసీసీ సొంత భవనాల్లో పూర్తిస్థాయిలో ఆధునీకరించుకోవడం ద్వారా ఆర్థికంగా మరింతగా బలపడుతోంది. అయితే ఆస్తుల పంపకాలు కొలిక్కి వస్తే ఇకపై తెలంగాణాతో పూర్తిస్థాయిలా తెగతెంపులు చేసుకున్నట్టు అవుతుందని జీసీసీ యాజమాన్యం భావిస్తోంది. కాగా ఏపీలో జీసీసీ డిపోలే దాదాపు వెయ్యి వరకు ఉండగా, పలుచోట్ల శీతలగిడ్డంగులున్నాయి. ప్రస్తుతం మార్కెటింగ్, పరిపాలన, ఫైనాన్స్ తదితర విభాగాలతోపాటు జీసీసీ డిపోలు వెయ్యి వరకు నిర్వహించగలుగుతున్నారు. దాదాపు 1200 మంది ఉద్యోగులు సేవలందిస్తున్నారు.

ఏపీకి రైల్వేశాఖ ప్రాధాన్యత

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 1: ఆంధ్రప్రదేశ్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని రైల్వే శాఖ గడిచిన నాలుగేళ్లలో ప్రాధాన్యత ఇచ్చింది. అనేక కొత్త రైళ్ల ప్రారంభం, అదనంగా హాల్ట్‌లు ఇవ్వడం వంటి చర్యల ద్వారా ఏపీ ప్రజలకు అదనపు సౌకర్యాలు అందుబాటులోకి తీసుకువచ్చినట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. 2014-2018 సంవత్సరాల మధ్య కొత్తగా విశాఖ-న్యూఢిల్లీ- విశాఖ, సెక్రటేరియట్ ఉద్యోగుల కోసం విజయవాడ - సికిందరాబాద్‌ల మధ్య ప్రత్యేక సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, విజయవాడ-ధర్మవరం మధ్య ట్రైవీక్లీ ఎక్స్‌ప్రెస్, తిరుపతి-విశాఖ మధ్య ట్రైవీక్లీ ఎక్స్‌ప్రెస్‌ను ప్రారంభించారు. తిరుపతి-జమ్మూతావి మధ్య ఒక రైలును, కాకినాడ-రాయచూర్, కాకినాడ-కర్నూల్ మధ్య బై వీక్లీ రైళ్లను ప్రారంభించారు. గోదావరి పుష్కరాల సందర్భంగా వివిధ రైళ్లకు 1300 అదనపు బోగీలను ఏర్పాటు చేశారు. కృష్ణా పుష్కరాల సందర్భంగా 458 ప్రత్యేక రైళ్లను, 3000 అదనపు కోచ్‌లను ఏర్పాటు చేశారు. కర్నూల్‌లో జరిగిన మస్లింల సదస్సుకు 15 ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేశారు.

11 కొత్త రైళ్లను ప్రారంభించగా, మరో 18 రైళ్లు ఏపీ మీదుగా రాకపోకలు సాగిస్తున్నాయి. వివిధ రైళ్లకు రాష్ట్రంలో 60 స్టేషన్లలో కొత్తగా హాల్ట్‌లు ఇచ్చారు. ఏపీ నుంచి, ఏపీ మీదుగా వెళ్తున్న 16 రైళ్లను వివిధ ప్రాంతాలకు పొడిగించారు.

హామీలు నెరవేర్చాకే ఏపీకి రండి

★ ప్రధానికి పీసీసీ అధ్యక్షుడు రఘువీరా సూచన

మడకశిర, జనవరి 1: విభజన హామీలు అమలు చేయకుండా రాష్ట్రంలో పర్యటించే హక్కును ప్రధాని నరేంద్ర మోదీ కోల్పోయారని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎన్.రఘువీరారెడ్డి పేర్కొన్నారు. హామీలు నెరవేర్చాకే ప్రధాని రాష్ట్ర పర్యటనకు రావాలన్నారు. అనంతపురం జిల్లా మడకశిరలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ ప్రధాని మోదీ తన రాష్ట్ర పర్యటనను ఎందుకు వాయిదా వేసుకున్నారో అర్థం కావడం లేదన్నారు. నాలుగున్నర సంవత్సరాల క్రితం ఎన్నికల సమయంలో రాష్ట్రానికి పదేళ్లు ప్రత్యేక హోదా కల్పిస్తామని, నూతన రాజధాని నిర్మాణానికి అవసరమైన నిధులు అందచేస్తామని చెప్పిన నరేంద్ర మోదీ వాటిని అమలు చేయకుండా రాష్ట్రంపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. గతంలో పార్లమెంటులో విభజన చట్టం హామీలు అమలు చేస్తామని చెప్పి దాన్ని అమలు చేయకుండా కుంటిసాకులు చెబుతున్నారన్నారు. విభజన హామీలు అమలు చేయకుండా ప్రధాని ఏపీలో పర్యటించడం మంచిది కాదన్నారు. హామీలపై స్పష్టమైన ప్రకటన చేసిన తరువాతే పర్యటనకు రావాలన్నారు. లేనిపక్షంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన తెలుపుతామన్నారు. కేంద్ర ప్రభుత్వం దేశంలోని రైతులను ఏ మాత్రం పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. అయితే మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రాల్లో కాంగ్రెస్ అధికారం చేపట్టిన వెంటనే రైతులకు రుణమాఫీ ప్రకటించడంతో ప్రధానికి భయం పట్టుకుందన్నారు. గత నాలుగేళ్లలో ఒక్క ఏడాది కూడా రైతులకు వడ్డీమాఫీ చేయలేదన్నారు. ప్రస్తుతం సార్వత్రిక ఎన్నికలు దగ్గర పడుతుండటంతో రైతులకు వడ్డీమాఫీ చేస్తామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. పెట్రోలు, డీజిల్, గ్యాస్ ధరలు సైతం ఇష్టారాజ్యంగా పెంచిన ప్రధాని మోదీ ఇప్పుడు అంగుళం తగ్గించి ధరలు తగ్గిస్తున్నామని చెప్పడం భావ్యం కాదన్నారు. జీఎస్‌టీని సరళీకృతం చేయాల్సి ఉందన్నారు. 2019లో కాంగ్రెస్ పార్టీని ప్రజలు అధికారంలోకి తీసుకురావాలని ఎదురుచూస్తున్నారన్నారు. చట్టసభల్లో మహిళలు, బీసీ, మైనార్టీలకు చట్టబద్ధమైన బడ్జెట్ కల్పించి ఆయా వర్గాలకు నిధులు కేటాయించాల్సి ఉందన్నారు.



విలేఖరుల సమావేశంలో మాట్లాడుతున్న పీసీసీ అధ్యక్షుడు ఎన్.రఘువీరారెడ్డి

ఈనెల 3వ తేదీన రాష్ట్రంలో ఎన్నికల వ్యవహారంపై చర్చించేందుకు రాహుల్ గాంధీ, ఏఐసీసీ కార్యదర్శి ఊమెన్‌చాందీ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారని, అప్పుడు పొత్తులపై చర్చించే అవకాశం ఉందని రఘువీరా చెప్పారు. గత నాలుగున్నరేళ్లలో అన్ని రాష్ట్రాలను సమానంగా చూడాల్సిన ప్రధానమంత్రి పక్షపాత వైఖరి ప్రదర్శిస్తున్నారని దుయ్యబట్టారు. దీంతో ఆయా రాష్ట్రాల్లో పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ భారీ మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందన్నారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందన్నారు. ఇందులో ఎలాంటి సందేహం లేదన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే సుధాకర్ పాల్గొన్నారు.

హ్యాపీ న్యూ ఇయర్

ముఖ్యమంత్రికి పలువురు శుభాకాంక్షలు

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 1: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి పలువురు ప్రముఖులు, ఉన్నతాధికారులు శుభాకాంక్షలు తెలిపారు. తిరుమల తిరుపతి దేవస్థానం, విజయవాడ కనకదుర్గ దేవస్థానం పండితులు ఆశీర్వదించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అనిల్ చంద్ర పునేఠా, డీజీపీ ఠాకూర్, ముఖ్యమంత్రి కార్యదర్శులు సతీష్ చంద్ర, ఏవీ రాజమౌళి, గిరిజా శంకర్, సాయి ప్రసాద్, పలువురు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు శుభాకాంక్షలు తెలిపారు.

టీడీపీ ముఖ్య నేతలు వివివి చౌదరి, టీడీ జనార్ధన్, విజయవాడ మేయర్ శ్రీధర్ తదితరులు కూడా శుభాకాంక్షలు తెలిపారు. విజయవాడ నున్నలోని మానసిక వికలాంగుల సంఘంలో ఆశ్రయం పొందుతున్న మానసిక వికలాంగులు కూడా ముఖ్యమంత్రికి కొత్త సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

మానసిక వికలాంగులను చూసిన వెంటనే ముఖ్యమంత్రి వారి వద్దకు వెళ్లి అప్యాయంగా పలకరించి, వారి శుభాకాంక్షలను అందుకున్నారు. వారి యోగ క్షేమాల గురించి నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు.

సంపద సృష్టి, పేదరిక నిర్మూలనే లక్ష్యాలు

★ తలసరి ఆదాయం పెంచుతాం ★ అవసరమైతే ప్రతి ఇంటికీ మొబైల్
★ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ★ ఆర్థికాభివృద్ధిపై శ్వేతపత్రం విడుదల

ఆంధ్రభూమి బ్యూరో

అమరావతి, జనవరి 1: సవాళ్లను అధిగమించి నూతన అధ్యాయానికి నాంది పలికామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉద్ఘాటించారు. విభజన చట్టం ప్రకారం హైకోర్టు కూడా రాష్ట్రానికి తీసుకొచ్చి పాలనను కేంద్రీకృతం చేశామన్నారు. రాష్ట్ర భవిష్యత్ కోసం కసి, పట్టుదలతో శ్రమించామన్నారు. విభజన అనంతరం నష్టపోయిన రాష్ట్రాన్ని ఆదుకోవాల్సిన బాధ్యత కేంద్రంపై ఉందని, అయితే కేంద్రం అడుగడుగునా అవరోధాలు సృష్టించిందన్నారు. విభజన హామీలు నెరవేర్చలేదని, ఆర్థికంగా జరిగిన నష్టాన్ని పూడ్చలేదన్నారు. ప్రత్యేక హోదా అమలు చేయలేదన్నారు. మంగళవారం ఆర్థికాభివృద్ధిపై శ్వేతపత్రం విడుదల చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. షెడ్యూల్డ్ ఆస్తులను బదలాయించినా ఆర్థికంగా కొంతవరకు నిలదొక్కుకునే వాళ్లమనీ, కానీ కేంద్రం అదీ చేయలేదన్నారు. ఇరు రాష్ట్రాలకు ఆమోదయోగ్యమైన పరిష్కారం చూపలేదనీ ఆరోపించారు. అడుగడుగునా అణగదొక్కి అన్యాయం చేశారని ధ్వజమెత్తారు. కడప ఉక్కు ప్లాంట్ అడిగితే కాదన్నారని గుర్తుచేశారు. ఈ పరిస్థితుల్లో విభజన నష్టాన్ని పూడ్చుకునేందుకు సంపద సృష్టించే దిశగా ప్రణాళిక సిద్ధం చేసుకుని లక్ష్యాలతో ముందుకు సాగామన్నారు. నిరంతరం రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని బేరీజు వేసుకుంటూ స్వల్ప, దీర్ఘకాలిక లక్ష్యాలను నిర్దేశించుకుని వడ్డీల భారం పడితే మనుగడకే ముప్పు వస్తుందనే ఉద్దేశ్యంతో సంపద సృష్టించటం ద్వారా సంక్షేమ, అభివృద్ధి, పేదరిక నిర్మూలన కార్యక్రమాలు చేపట్టామన్నారు. ప్రజల అవసరాలు తీర్చుతూ ఖర్చుకు జవాబుదారీగా ఉంటూ సమతుల్యత పాటించామని చంద్రబాబు చెప్పారు. ఆస్తులు ప్రాంతాల ప్రాతిపదికన, అప్పులు జనాభా ప్రాతిపదికన విడగొట్టటంతో రాష్ట్రానికి రూ. 3800 కోట్ల నష్టం జరిగిందని గుర్తుచేశారు. పట్టణీకరణ ద్వారా సేవల రంగం వృద్ధి చెందుతుందని, అందువల్లే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆదాయ వనరుగా తీర్చిదిద్దామన్నారు. మానవవనరుల వినియోగంతో పాటు సేవలు, పర్యాటక రంగాల ద్వారా గణనీయమైన ఆదాయం వస్తుందన్నారు. అయితే రాష్ట్రంలో పట్టణీకరణ శాతం తక్కువగా ఉన్నందున ఆదాయాన్ని పెంచుకునే మార్గాలను అన్వేషించి అందుకు తగ్గ నిర్ణయాలు తీసుకున్నామని తెలిపారు. వ్యవసాయాధారితంగా ఉన్నప్పటికీ అతివృష్టి, అనావృష్టి కారణంగా ఆదాయం వచ్చే పరిస్థితులు లేవన్నారు. సేవల రంగంలో ఏపీ 43.5 శాతం ఉంటే హైదరాబాద్‌లోనే 65శాతం ఉందన్నారు. సైబరాబాద్, అవుటర్ రింగ్‌రోడ్డు, షంషాబాద్ విమానాశ్రయాలను ఏర్పాటు చేయటం ద్వారా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఐటీ ఎగుమతులు గణనీయంగా పెరిగాయన్నారు. ప్రస్తుతం అక్కడ 96వేల కోట్లు ఉంటే ఏపీలో 2వేల కోట్లు మాత్రమే ఉందన్నారు. విభజన సమయంలో 89వేల రూపాయలు ఉన్న తలసరి ఆదాయాన్ని 2018 నాటికి లక్షా 37వేలకు చేర్చామని, జాతీయ స్థాయిలో మరో 38వేలు పెంచగలిగితే అభివృద్ధిలో నెంబర్ వన్‌గా ఏపీ ముందుంటుందని వివరించారు. వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు తేవటం ద్వారా 11శాతం వృద్ధిరేటు సాధించామన్నారు. నాలుగున్నరేళ్లుగా ప్రభుత్వం చేపట్టిన సంస్కరణల ఫలితంగా 11శాతానికి చేరిందన్నారు. రాష్ట్ర ఆర్థికాభివృద్ధి 2013-14 నుంచి ఏటా 3.4 లక్షల కోట్లకు పెంచగలిగామన్నారు. 2013-14లో 4.64 లక్షల కోట్లు ఉంటే 2017-18కి 8.04 లక్షల కోట్లకు చేరిందన్నారు. వ్యవసాయంలోనే అత్యధిక ఆదాయం వచ్చిందన్నారు. వ్యవసాయ ఆదాయాన్ని రెట్టింపు చేయగలిగామన్నారు. తలసరి ఆదాయంలో లక్షా 89వేలతో కృష్ణా జిల్లా ముందుందని తెలిపారు. ఇంక్లూజివ్ గ్రోత్‌రేట్ పెంచడంతో పాటు ఆర్థిక అసమానతలు తగ్గించటం ప్రధాన లక్ష్యంగా కార్యాచరణ రూపొందించామన్నారు. జిల్లాలవారీ ప్రణాళికలు రూపొందించి విజన్ డాక్యుమెంట్ ద్వారా వినూత్న కాకార్యక్రమాలు చేపట్టామన్నారు. ఏటా రూ. 573కోట్ల అప్పుల భారాన్ని తగ్గించుకుంటూ సంపద సృష్టికి సేవల రంగాన్ని విస్తృతం చేయటంతో పాటు మౌలిక వసతుల కల్పన, ఆర్థికాభివృద్ధికి శ్రీకారం చుట్టామన్నారు. ప్రజల ఆర్థిక అవసరాలను గుర్తిస్తూ ఖర్చులు తగ్గించేందుకు బృహత్తర కార్యక్రమాలు అమలు చేస్తున్నామని తెలిపారు. ఉద్యోగులకు జీతబత్యాల పెంపుదల, పింఛన్లు, నిరుద్యోగ భృతి, ప్రతి కుటుంబానికి ఇళ్ల నిర్మాణం, చంద్రన్న కానుకలు, బీమా, ఎన్టీఆర్ వైద్యసేవలతో పాటు ఉచిత విద్యుత్‌ను అందించటంతో పాటు ప్రతి కుటుంబానికి రూ.10వేల ఆదాయాన్ని అందించటం ద్వారా పేదరిక నిర్మూలన దిశగా అడుగులు వేస్తున్నట్లు చెప్పారు. సంపద సృష్టించటం, పేదరిక నిర్మూలన కార్యక్రమాలను నిరంతరం చేపడతామని వెల్లడించారు. ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే కార్యక్రమాల్లో భాగంగా రానున్న కాలంలో అవసరమైతే ప్రతి ఇంటికీ మొబైల్ ఫోన్ అందించనున్నట్లు ప్రకటించారు.



రాష్ట్ర ఆర్థికాభివృద్ధిపై శ్వేతపత్రం విడుదల చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తదితరులు

'మీ కళ్ల ముందే అభివృద్ధి కనిపిస్తోంది. ఏ కష్టం వచ్చినా ఆదుకుంటున్నాం. ఇకపై 2019-24కు అవసరమైన విజన్‌కు కూడా సన్నాహాలు జరుగుతున్నాయి. మరిన్ని సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో రాష్ట్రం దేశంలోని మూడు ప్రధాన రాష్ట్రాల్లో ఒకటిగా నిలిపే ప్రయత్నాలు జరుగుతున్నాయి' అని ముఖ్యమంత్రి చంద్రబాబు వివరించారు. తెలంగాణ సంపన్న రాష్ట్రం అయినప్పటికీ వృద్ధి రేటు -2గా ఉందని ఆయన పేర్కొన్నారు.

ఆంధ్రభూమి

జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ

బుధవారం, 2 జనవరి 2019

చైనా గాలిపటం..

మకర సంక్రాంతికి మరో పేరు 'పతంగ్'ల- గాలిపటాల- పండుగ.. మకర సంక్రాంతి పండుగకూ గాలిపటాలకు అవినాభావ సంబంధం ఉండడం తరతరాల కథ. మన దేశంలోని ఆకాశంలో ఎగురుతున్న గాలిపటాలలో అత్యధిక శాతం చైనాతో ముడివడి ఉండడం నడుస్తున్న వ్యథ.. చైనా గాలి పటాలకున్న దారం- మాంజా- స్వదేశంలో తయారైన గాలి పటాలను కోస్తోంది, తెగిన మన గాలిపటాలు కూలిపోతున్నాయి. ఈ 'పతంగ్'లను, దారాన్ని తయారుచేస్తున్న కుటీర పరిశ్రమలు దేశవ్యాప్తంగా మూతపడి పోతున్నాయి! చైనాలో తయారవుతున్న గాలిపటాలు- పతంగ్‌లు-, వాటిని ఎగుర వేయడానికి అవసరమైన చైనా 'దారం'- మాంజా- మన దేశానికి దిగుమతి కాకుండా మన ప్రభుత్వం నిషేధించక పోవడం ఈ స్వదేశీయ వైపరీత్యానికి మూల కారణం! 'దిగుమతి'ని పూర్తిగా నిషేధించకుండా 'వాడకాన్ని' మాత్రం నిషేధించడం వల్ల చైనా గాలిపటాలు, చైనా 'మాంజా' మన దేశపువిపణి వీధుల నుంచి తొలగిపోవడం లేదు. ఫలితంగా వందల ఏళ్లుగా 'పతంగ్'లను తయారుచేస్తున్న భారతీయులు, చిట్టిపొట్టి ఉత్పత్తిదారులు, గృహపరిశ్రమల వారు తమ దుకాణాలను మూసివేస్తున్నారు. ఇలా మూసివేస్తున్న ఉదంతాలు నాలుగైదు ఏళ్లుగా ప్రచారం అవుతున్నప్పటికీ ప్రభుత్వాలు నిరోధక చర్యలను చేపట్టిన జాడ లేదు. 'భారత్‌లో నిర్మించండి'- మేక్ ఇన్ ఇండియా- అన్న కార్యక్రమాన్ని నాలుగేళ్లుగా అమలుజరుపుతున్న కేంద్ర ప్రభుత్వం ఈ గృహ పరిశ్రమలవారు తమ గాలిపటాలను, దారాన్ని తయారుచేయడానికి వీలుగా నిర్నిరోధ వ్యవస్థను మాత్రం తయారుచేయలేకపోతోంది! పదిహేను ఏళ్లకు పైగా చైనానుంచి వందల వేల రకాల అనవసరమైన వస్తువులు మన దేశాన్ని ముంచెత్తుతున్నాయి. ఫలితంగా మనం చైనాతో చేస్తున్న వ్యాపారంలో మనకు సాలుసరి 'లోటు' నిరంతరం పెరిగిపోతోంది. నాలుగేళ్ల క్రితం ఈ 'లోటు' విలువ రెండున్నర లక్షల కోట్ల రూపాయలు. ప్రస్తుతం ఈ 'లోటు' మూడున్నర లక్షల కోట్ల రూపాయలకు చేరినట్టు ప్రచారమౌతోంది. తమ వాణిజ్యపు లోటును తగ్గించుకొనడానికై అమెరికా, ఐరోపా సమాఖ్య దేశాలు చైనా వస్తువులపై దిగుమతి సుంకాలను పెంచుతున్నాయి, కొన్ని వస్తువుల దిగుమతిని నిషేధించాయి కూడ! కానీ మన ప్రభుత్వం మాత్రం ఈ 'లోటు' తగ్గించుకొనడానికి వీలైన పటిష్ఠ చర్యలను చేపట్టడంలో 'మీనమేషాల'ను లెక్కిస్తూ నిమ్మకు నీరెత్తినట్టు ఉండడం పదిహేను ఏళ్ల వైపరీత్యం. ఫలితంగా 'లోటు'పెరిగి మన విదేశీయ వినిమయ ద్రవ్యం- ఫారిన్ ఎక్స్‌ఛేంజ్ కరెన్సీ- భారీగా చైనాకు తరలిపోతోంది. మన వార్షిక రక్షణ వ్యయం కంటె, మన భద్రతకు ప్రమాదకరంగా పరిణమించిన శత్రు దేశమైన చైనాకు మన దేశం నుంచి తరలిపోతున్న విదేశీయ వినిమయ ద్రవ్యం విలువ ఎక్కువ. మన ప్రభుత్వాల వలె 'జాతీయ ఆత్మహత్యా సదృశమైన' వ్యాపారాన్ని ప్రపంచంలో మరే దేశంలోను చేయడం లేదు. ఇజ్రాయిల్ ప్రభుత్వం తమ దేశంలో పెట్టుబడులను పెట్టడానికి సిరియా, ఇరాన్, లెబనాన్, సౌదీ అరేబియా వంటి శత్రుదేశాలను అనుమతించడం లేదు! ఎందుకంటె ఈ దేశాల ప్రభుత్వాలు ఇజ్రాయిల్‌ను బద్దలుకొట్టడానికై బీభత్సకాండను ప్రోత్సహిస్తున్నాయి. జపాన్ వస్తువులను చైనావారు కొనడం లేదు, జపాన్ ప్రజలు 'ఎగబడి' చైనాబజార్‌లలో కొనుగోళ్లు చేయడం లేదు. చైనా భోజనాల- చైనీస్ ఫుడ్-ను ఆరగించడం లేదు. రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో చైనా, జపాన్‌లు పరస్పరం శత్రువులు. 'శంకాకు' అన్న ద్వీప సముదాయం యాజమాన్యం విషయంలో ఉభయ దేశాలకు మధ్య ఇప్పటికీ వివాదం సాగుతోంది!

చైనాను చూసి మనం నేర్చుకోవాలన్నది అక్కడికి వెళ్లి వస్తున్న మంత్రులు, ముఖ్యమంత్రులు మనకు చెబుతున్న పాఠం..కానీ ఏమి నేర్చుకుంటున్నాము? తమ జాతీయ ప్రయోజనాలను దెబ్బతీస్తోందన్న 'సాకు'తో జపాన్‌పై చైనా పగసాధిస్తూనే ఉంది! మన జాతీయ ప్రయోజనాలను భంగపరుస్తున్న దేశాల పట్ల మనం కూడ వ్యతిరేకతను చూపాలన్నది చైనానుంచి మనం నేర్చుకోవలసిన పాఠం. కానీ మన దేశంలోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను నిర్వహిస్తున్న వారు మాత్రం ఈ పాఠం నేర్చుకున్న, నేర్చుకుంటున్న దాఖలాలు లేవు. చైనా సంస్థలకు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు ఇతర రాష్ట్రాల ప్రభుత్వాలు 'తలుపులు బార్లా తెరచి ఉంచాయి'.. చైనా సంస్థల పట్టు మన ఆర్థిక వ్యవస్థపై పెరగడానికి మన ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయి. 'తెలిసిన' ప్రభుత్వ నిర్వాహకులు ఇలా చైనా ఆర్థిక వాణిజ్య దురాక్రమణను ప్రోత్సహిస్తున్నప్పుడు 'తెలియని' యువజనులు, సామాన్యులు 'చైనీస్ ఫుడ్'ను 'చొంగలు కార్చుకుంటూ' 'ముక్కులను ఊరించుకుంటూ' ఆరగించడంలో ఆశ్చర్యం ఏముంది? మనం కొంటున్న, తింటున్న, ఇళ్లలో వాడుతున్న అనేకానేక వస్తువులు శత్రుదేశమైన చైనానుంచి వచ్చిపడుతున్నాయి. చైనా 1962లో మన ప్రభుత్వాన్ని వెన్నుపోటు పొడిచింది, భౌతికంగా దురాక్రమించింది. ఇప్పటికీ దాదాపు యాబయి వేల చదరపు కిలోమీటర్ల మన భూమి చైనావారి అక్రమ అధీనంలో అలమటిస్తోంది. అందువల్ల చైనా మనకు శత్రుదేశం. చైనా వస్తువులను కొనడం తినడం వాడడం మన జాతికి హానికరం, మన దేశానికి ద్రోహం. కానీ ఏవి చైనా వస్తువులు? ఏవి కావు? అని సామాన్య జనానికి తెలీదు.. ఎవరు తెలియచెప్పాలి?? 2050 నాటికి భారత ప్రజాస్వామ్య రాజ్యాంగ వ్యవస్థను కూల్చివేయడానికి కుట్ర చేస్తున్న మావోయిస్టులను, నక్సలైట్లను చైనా ఉసిగొల్పుతోంది. అందువల్ల చైనా మనకు శత్రుదేశం! చైనావారి 'గాలిపటాల'ను, చైనానుంచి వస్తున్న దారాన్ని కొంటున్న పిల్లలకు ఈ వాస్తవం తెలీదు, కొనిస్తున్న తల్లితండ్రులకు ఈ వైపరీత్య ధ్యాస లేదు. 'ధ్యాస ఉన్న'ప్రభుత్వం చైనా దిగుమతులను ఎందుకు నిషేధించరాదు? ఎందుకు కనీసం నియంత్రించరాదు..??

చైనానుంచి వస్తున్న ప్లాస్టిక్ దారం పక్షుల గొంతులను పావురాల గొంతులను కోస్తోందని 2013నుంచి వార్తలు ప్రచారం అవుతూనే ఉన్నాయి. ఈ దారం తగిలి గాయపడిన బాలబాలికలకు నెలల తరబడి ఆ పుండ్లు మానడం లేదని కూడ ప్రచారమైంది. ఈ దారం- మాంజా- గాలిపటాల- పతంగ్‌ల-ను ఎగురవేయడానికై ఉపయోగపడుతోంది. ఈ దారం ఉపయోగించినట్టయితే గాలిపటాలు ఆకాశంలోకి బాగా దూసుకొనిపోతాయన్న భ్రమ వ్యాపించి ఉంది! అందువల్ల మన దేశంలో తరతరాలుగా తయారవుతున్న 'పత్తిదారాన్ని' వద్దని, చైనానుంచి వస్తున్న ప్లాస్టిక్ దారాన్ని జనం ఎగబడి కొంటున్నారు. ఈ ప్లాస్టిక్ చైనా 'దారం'లో గాజుముక్కలను ఇతర రసాయన విషాలను కలుపుతున్నారట! అందువల్ల ఈ 'దారం' కత్తిలాగా మారుతోందట. 'పతంగ్'లను ఎగురవేసేవారు తమ 'పతంగ్' మిగిలినవారి గాలి పటాలకంటె ఎత్తున ఎగరాలని భావించడం సహజం! అంతవరకు బాగుంది. కానీ తమ గాలిపటంతో పోటీపడి పైకి లేచే ఇతరుల గాలిపటాలను కూల్చివేయడం 'ఆట'లో భాగమైపోయింది. అందువల్ల తమ గాలిపటానికున్న 'దారం'తో ఇతరుల గాలిపటాలను ఎగిరించే దారాలను కోసివేయాలి, అప్పుడు ప్రత్యర్థుల గాలిపటం కూలిపోతుంది. ఈ పోటీ ఆట 'ధర్మయుద్ధం'వలె నూలు దారంతో మాత్రమే జరగడం తరతరాల క్రీడా చరిత్ర. స్వదేశీయ గృహపరిశ్రమలవారు 'నూలు'తో మాత్రమే గాలిపటాల దారాన్ని తయారుచేశారు. వృక్ష నిర్యాసాలతోను ఇతరమైన అటవీ ఉత్పత్తులతోను మాత్రమే దారానికి పదనుపెట్టారు, పెడుతున్నారు. గాలిపటాలను సైతం కాగితాలతోను అటవీ ఉత్పత్తులతోను మాత్రమే స్వదేశీయులు రూపొందిస్తున్నారు. మన దేశంలోని కుటీర పరిశ్రమలవారు తయారుచేసిన, చేస్తున్న 'పతంగ్'లవల్ల, 'దారం'వల్ల పర్యావరణం పాడుకాలేదు, పావురాలు పక్షులు గాయపడలేదు. ప్రకృతిని పరిపోషించడం, పెంపొందించడం భారతీయుల జీవన విధానం. కానీ చైనానుంచి వస్తున్న గాజుపెంకులతోను ప్లాస్టిక్‌తోను రసాయన విషాలతోను నిండిన దారాలు, గాలిపటాలు ప్రకృతిని గాయపరుస్తున్నాయి. ఈ 'ప్లాస్టిక్' విషాల దారంతో ప్రత్యర్థుల గాలిపటాలను సులభంగా కూల్చవచ్చునన్న భ్రమతోను, తమ గాలిపటాన్ని పైపైకి ఎగిరించవచ్చునన్న అత్యాశతోను మన జనాలు చైనా దారాన్ని, చైనా గాలిపటాలను కొనేస్తున్నారట! ఇద్దరు వీరులు కత్తులతో పోరాడడం యుద్ధ క్రీడ! ఒకడు తన ప్రత్యర్థిపై విషం పూసిన కత్తిని ప్రయోగించడం వంచన క్రీడ! భారతీయుల 'పతంగ్'ల క్రీడలో చైనావారి వంచన చొరబడిపోయింది.. చైనా గాలిపటాలు, దారాలు విషం పూసిన కత్తులు..

మకర సంక్రాంతి ముందురోజున, 2016 జనవరిలో తెలంగాణ ప్రభుత్వం చైనా మాంజా వాడకాన్ని, అమ్మకాన్ని, నిలువ ఉంచడాన్ని నిషేధించింది. ఈ దారం వల్ల పక్షులు, పావురాలు బలికావడం, బాలబాలికలు గాయపడడం ఆ నిషేధానికి నేపథ్యం. ఆ తరువాత అనేక రాష్ట్రాల ప్రభుత్వాలు కూడ ఈ దారాన్ని నిషేధించాయి. 2017 జూలైలో 'జాతీయ హరిత న్యాయ మండలి'-నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్- ఎన్‌జిటి-వారు దేశవ్యాప్తంగా చైనా 'మాంజా'ను నిషేధించారు. కానీ గత ఏడాది మకర సంక్రాంతికి ముందు 'మాంజా'తోపాటు గాలిపటాలు కూడ చైనానుండి వెల్లువెత్తాయి! దేశంలో తయారవుతున్న 'దారం'ఉండ ఇరవై రూపాయలకే లభిస్తోంది. కానీ ఎనబయి రూపాయలకు 'ఉండ'- బండిల్- చొప్పున చైనా దారాన్ని మనం కొంటున్నాము. హైదరాబాద్‌లోను ఇతర చోట్ల తరతరాలుగా గాలిపటాలు రూపొందించిన స్వదేశీయ ఉత్పత్తిదారులు దుకాణాలు మూసి వేస్తున్నారు.. ప్రత్యామ్నాయ ఉపాధిని వెతుక్కుంటున్నారు! నిరోధించడం పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు శ్రద్ధ ఉందా?

భళా.. గుడ్ గవర్నెన్స్..!

'ఎవరి పాలనలో అయితే పాలకుల ప్రమేయం లేకుండా పాలితులు తమ దినవారీ జీవితాలను నిశ్చింతగా గడపగలుగుతారో ఆ ప్రభుత్వం ఉత్తమ ప్రభుత్వం'-అని రాజనీతి శాస్త్రం చెబుతోంది. ఇప్పటి ప్రభుత్వాలు పాలితులకు అలాంటి పాలన ఇవ్వగలుతున్నాయని చెప్పగలిగిన పరిస్థితి ఉందా? అంటే సందేహమే..!

సబ్సిడీ బియ్యం కావాలంటే రేషన్ కార్డు కావాలి. రేషన్ కార్డు కావాలంటే ఎవరో ఒక ప్రభుత్వాధికారి సంతకం కావాలి. అతగాడికి ఇదొక్కటే పనికాదు కదా! అంచేత, దానికోసం చెప్పులరిగేలా తిరగాలి. ఎవరైనా పుణ్యాత్ముడు దొరికి సంతకం పెట్టినా, మరో అధికారి ఆదాయం సర్టిఫికెట్ ఏదీ? అంటాడు. అది ఇచ్చే ఆయన అడ్రస్ ప్రూఫ్ పత్రా.. అంటాడు. అది ఇచ్చేవాడు ఆ అడ్రస్‌లో ఉంటున్నది నువ్వేనని దాఖలా చూపమంటాడు. ఇవన్నీ లేకపోయినా తెలివున్నవాడు కావాల్సిన సర్టిఫికెట్లు కావాల్సిన విధంగా ఒక్క రోజులో తెచ్చుకుంటాడు. తెచ్చుకోలేని వాడు తన అసమర్ధతని ఒక పక్క, ప్రభుత్వాన్ని మరోపక్క ఆడిపోసుకుంటూ ఉంటాడు. ఇలానే అనేకం.. అది ఆసుపత్రిలో వైద్యం కావచ్చు, బళ్ళో ప్రవేశం కావచ్చు, గుళ్ళో దర్శనం కావచ్చు.. దేన్నికైనా ప్రభుత్వం మీద ఆధార పడాల్సిందే. అధికారుల చుట్టూ ప్రదక్షిణాలు చేయాల్సిందే. చిన్న చిన్న విషయాల్లో కూడా పాలకులు ఇంత చెడ్డ పేరు తెచ్చుకోవడం అవసరమా?

'దుర్భలస్య బలం రాజ' అంటాడు కౌటిల్యుడు తాను సూత్రీకరించిన 'మత్స్య న్యాయం'లో. చిన్న చేపలను పెద్ద చేపలు తినడం అందరూ ఎరిగిందే. బలహీనులను బలవంతులు దోచుకోకుండా రాజులు కాపాడాలన్నది కౌటిల్యుడు బోధించిన సూక్తి. కానీ, నేటి సమాజంలో పాలకులు ఆ విధంగా బలహీనుల కాపు కాస్తున్నారా? అంటే ఔనని చప్పున చెప్పడం కష్టం. కాకపొతే దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న దరిద్ర నారాయణుల సంక్షేమం కోసం కొన్ని కొన్ని పథకాలు ప్రవేశపెడుతుంటారు. ప్రచార ఆర్భాటం తప్పిస్తే అవి అర్హులకు అందుతున్నాయని, దుర్వినియోగం కావడం లేదని గుండె మీద



చేయి వేసుకుని చెప్పలేని పరిస్థితి..! కాకపొతే, ఈ సంక్షేమ పథకాల పుణ్యమాని కొందరు దళారులు కోటికి పడగలెత్తుతున్నారనేది కాదనలేని వాస్తవం. పూటకో పథకం తెచ్చామని నేతలు ప్రకటించుకోగానే పాలన బాగున్నట్టు కాదు. అమలు కాని పథకాల వల్ల లాభపడేది కేవలం ప్రకటన కర్తలు మాత్రమే. రోజుకో కొత్త చొక్కా తొడుక్కున్నంత మాత్రాన పండగ కాదు కదా!

సమాజంలో ప్రజలందరూ తినాకుడవా సమృద్ధిగా ఉన్నట్టు పైకి కనబడాలంటే కొందరు అవి లేనివాళ్లు కూడా ఉండాలని వాదించే వాళ్లు లేకపోలేదు. రైలు బోగీల్లో రెండో తరగతి ఉన్నప్పుడే మొదటి తరగతికి ఆ హోదా, ఆ భోగం అన్నది వాళ్ళ థియరీ.

రాజులు ఎలా పాలించాలనే విషయంలో శుక్రుడు, విదురుడు, చాణక్యుడు మొదలైన వారు ప్రవచించినవి రాజనీతి శాస్త్రాలుగా ప్రసిద్ధి పొందాయి. భర్తృహరి **'నృప నీతి అనేక రీతి'** అంటూ సూత్రీకరించాడు. ప్రజల పట్ల రాజులు ఎలా వ్యవహరించాలన్నదే ఈ శాస్త్రాలన్నింటిలో కీలకాంశం.

శ్రీకృష్ణ దేవరాయలు ఓ చెంప రాజ్య పాలన చేస్తూనే, మరో వంక సాహితీ సేద్యం చేసేవారట. అలా ఆయన సాహిత్య క్షేత్రంలో పుట్టుకొచ్చినదే 'ఆముక్తమాల్యద' కావ్యం. అందులో యమునాచార్యుల చేత రాయలవారే తన మనసులోని మాట చెప్పిస్తారు. **'రాజ్యాంతే నరకం ధృవం'** అని. రాజు తన పాలనలో తెలిసో తెలియకో కొన్ని తప్పులు చేస్తాడు. కారణాలు అనేకం ఉండొచ్చు కానీ తప్పనిసరై కొన్ని హింసలకు పాల్పడతాడు. మరిక నరక ప్రాప్తి తప్పదు కదా! ఈ పాపపరిహార్థం రాజులు యాగాలు, యజ్ఞాలూ చేసేవాళ్లు. మరి వాళ్లకు పుణ్యలోకాలు సిద్ధించాయో, నరకలోకమే ప్రాప్తించిందో వెంటబోయి, వెనక్కి వచ్చి చెప్పినవారు ఎవరూ లేరు. కానీ వారి పరిపాలన వల్ల జనాలు సుఖపడ్డారా? లేక కష్టపడ్డారా? అన్నది ఒక్కటే మంచిచెడ్డల ఎంపికకు సరైన గీటురాయి.

ఒకసారి నాకు బాగా తెలిసిన పెద్ద మనిషికి ఒక పెద్ద పదవి దక్కింది. అంతా వెళ్లి శుభాకాంక్షలు చెబుతున్నారు. నేనూ వెళ్లి చెప్పాను. ఏమని..? ''మంచి అవకాశం లభించింది మీకు. అవసరంలో ఉన్నవారికి అడగకుండానే సాయం చేయండి' అని. ఆయనకు మరోలా అర్థమైనట్టుంది. అధికారంలో ఉన్నవాళ్ల అవసరం పడ్డ వాళ్లకు ఆయన బాగానే సాయపడ్డాడని ప్రతీతి.

సాక్షరా విపరీతాశ్చేత్- అని హితోపదేశం చెబుతోంది. అంటే అక్షరాస్యులు విపరీత మనస్కులైతే రాక్షసులవుతారని అర్థం. ఇప్పుడు సాక్షరులు అంటే మేధావులు, చదువుకున్న వాళ్లు, సాంఘిక మాధ్యమాల్లో వీరి విశృంఖల వీరవిహారాలు చూస్తుంటే, 'సాక్షరా తిరగేస్తే రాక్షసా అవుతుంద'ని కీర్తిశేషులు ఆర్వీయార్ చెప్పిన మాట గుర్తుకు వస్తుంది.

రాజకీయాల గురించి రాయడం పత్రికల ప్రధాన వ్యాపకం. ఈ నింద మోస్తూ కూడా అప్పుడప్పుడూ ప్రజాసమస్యలను వెలుగులోకి తెస్తుంటాయి. అవి రాసే ప్రతివార్తను రాజకీయ కోణంలో చూడకుండా పాలకులు దిద్దుబాటు చర్యలు తీసుకుంటే ప్రజలు సుఖపడతారు. వెనుకటి రోజుల్లో ప్రజల కష్టాలను స్వయంగా గమనించడానికి రాజులు మారువేషాల్లో తిరిగేవారు. లేదా వారి వేగులు ఈ పని చక్కబెట్టేవారు. ఇప్పుడూ ప్రభుత్వంలో ఈ పనులు చూడడానికి ఒక ప్రత్యేక నిఘా విభాగమే వుంది. ప్రతిపక్షాల మీద కన్నేసి ఉంచడంలోనే వారి పుణ్యకాలం గడిచిపోతోంది. ఇక ప్రజల ఇబ్బందులు ఎక్కడ పట్టించుకుంటారు? కావున, ఏలినవారికి నచ్చినా నచ్చకున్నా, ఈ పనికి కొంతలో కొంత పత్రికల మీద ఆధారపడడమే మేలు. జనాలకు ప్రభుత్వాలతో ప్రమేయం లేకుండా చేయండి. ఆ ప్రభుత్వాలను జనమే నెత్తిన పెట్టుకుంటారు.

ఉపశృతి:

గ్రామ రెవెన్యూ అధికారి దగ్గరికి వెళ్ళాడు తిరుపతయ్య చిన్న పని మీద. 'ఇదిగో ఇప్పుడే వస్తా! ఎమ్మార్వో గారు వెంటనే రమ్మనమని ఫోను... గంటలో తిరిగొస్తా, ఇక్కడే కూర్చో..' అంటూ వీఆర్వో మోటారు సైకిల్ ఎక్కి తుర్రుమన్నాడు. వీఆర్వో ఆగమేఘాల మీద వెళ్లేసరికి ఎమ్మార్వో అతడి కోసమే ఎదురుచూస్తున్నట్టు మొహం పెట్టి, 'వచ్చావా! మొన్న చెప్పాను చూడు..' అంటూ ఉండగానే ఆయన చేతిలో సెల్లు ఘల్లున మోగింది. కంగారుగా వింటూనే అంతకంటే కంగారుగా వెళ్ళిపోయాడు ఎమ్మార్వో జీపెక్కి. జేసీ గారి ఆఫీసుకు చేరి కనుక్కుంటే ఆయన పీఏ చావు కబురు చల్లగా చెప్పాడు. 'మిమ్మల్ని రమ్మనమని ఫోను చేసారా..? అలా రమ్మనమని కలెక్టరు దొరగారి ఫోను.. పని చూసుకుని వస్తారు కూర్చోండి' అన్నాడు తాపీగా.

అక్కడ జేసీ గారికి కలెక్టర్ ఆఫీసులో ఇదే సీను. 'మంత్రి గారు కబురు పెడితే వెళ్ళారు, వస్తారు కూర్చోండి' అంటూ క్యాంప్ క్లర్కు మర్యాద... కలెక్టర్ గారి కారు మంత్రి గారి బంగ్లాలో ప్రవేశిస్తూ ఉండగానే గేటు దగ్గరే ఎదురొచ్చింది మంత్రి గారి వాహనం. 'ఇదేమిటి? రమ్మనమనిచెప్పి ఆయన ఎటు వెడుతున్నట్టు..' అని అనుకుంటూ ఉండగానే సెల్లు మోగింది. అవతల మంత్రి గారు.. 'చూడండి కలెక్టర్ గారూ, అర్జెంటు పనిమీద మిమ్మల్ని రమ్మన్నాను. కానీ ఈలోగా సీఎం గారి నుంచి కబురు- వెంటనే రమ్మనమని. వెళ్లి వస్తా కాసేపు వెయిట్ చేయండి.. ఏమనుకోవద్దు..' మంత్రిగారు సీఎం ఇంటికి వెళ్లేసరికి ఆయన ఢిల్లీ ఫోనులో ఉన్నారు. అది తెమిలేసరికి రాత్రి ఎనిమిదైంది. మంత్రిగారిని చూస్తూనే సీఎం అన్నారు.. 'అయ్యో... ఇంతసేపు వెయిట్ చేస్తున్నారా? ఏదో చిన్న విషయం మీతో మాట్లాడదామనుకున్నాను. మళ్ళీ చూద్దాం లెండి...' అన్న భావం కళ్ళల్లో ప్రదర్శిస్తూ. అక్కడ వూళ్ళో వీఆర్వో గారింట్లో తిరుపతయ్య, ఎమ్మార్వో ఆఫీసులో వీఆర్వో, జేసీ కార్యాలయంలో ఎమ్మార్వో, కలెక్టర్ క్యాంప్ ఆఫీసులో జేసీ, మంత్రి బంగాళాలో కలెక్టర్, ముఖ్యమంత్రి నివాసంలో మంత్రిగారు - అందరూ ఉదయం నుంచి సాయంత్రం దాకా గడ్డాలు, మీసాలు పెంచుకుంటూ ఎదురుచూపులు....!

(సరదాకు రాసిందే.. అయినా- కొంత నిజం లేకపోలేదు.. ఔనా..!)

-భండారు శ్రీనివాసరావు 98491 30595

http://bhandarusrinivasarao.blogspot.com

వినియోగదారుల రక్షణకు దీక్షా కంకణం

కేంద్రంలో భాజపా ప్రభుత్వం ఎన్నో చట్టాలను, బిల్లులను తీసుకువచ్చినా- పటిష్టమైన బిల్లు ఏదైనా ఉందంటే అది వినియోగదారుల పరిరక్షణ బిల్లు మాత్రమే. స్పష్టమైన విధి విధానాలతో పాటు తీవ్ర శిక్షలతో వినియోగదారుల హక్కుల పరిరక్షణకు కేంద్రం పూనుకుంది. 1962 లోనే అమెరికా ప్రభుత్వం వినియోగదారుల హక్కుల రక్షణకు నడుం బిగించగా, భారత్ ఆ స్థాయిలో చట్టాలను తీసుకురావడానికి 56 ఏళ్లు పట్టింది. అమెరికాలో రాల్ఫ్ నాడర్‌ను వినియోగదారుల ఉద్యమానికి మూలపురుషుడిగా చెబుతారు. ఓ సంస్థ తయారుచేసిన కార్ల నాణ్యతాలోపంపై ఆయన ఉద్యమించాడు. ఆ తర్వాత వస్తువుల తయారీ, అమ్మకాల్లో వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యలపై పెద్ద ఎత్తున పోరాటం చేసి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందాడు. 1962 మార్చి 14న అప్పటి అమెరికా అధ్యక్షుడు జాన్ ఎఫ్ కెనడీ వినియోగదారుల హక్కుల బిల్లును అమెరికా అధ్యక్ష సభలో ప్రవేశపెట్టారు. మన దేశానికి వచ్చేసరికి 1949లో మద్రాస్‌లోని గాంధేయవాది ఆర్ ఆర్ దళవాయి వినియోగదారుల సంఘాన్ని ప్రారంభించడంతో వినియోగ ఉద్యమం మొదలైందని చెప్పవచ్చు.

భారత్‌లో వినియోగదారుల హక్కుల రక్షణకు అప్పటికే దాదాపు 46 చట్టాల్లో వేర్వేరు క్లాజులు కింద రక్షణ కల్పించారు. వాటన్నింటినీ క్రోడీకరించి 1986లో వినియోగదారుల హక్కుల రక్షణ చట్టాన్ని తీసుకువచ్చారు. దీనినే 'వినియోగదారుల హక్కుల పత్రం'గా ప్రచారంలోకి తీసుకువచ్చారు. గుర్తింపు, సమాచారం, ఇష్టం, ప్రాతినిధ్యం, సరిదిద్దడం, చైతన్యం వంటి అంశాలను ఇందులో చేర్చారు. వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కారానికి గరిష్టంగా 150 రోజుల వ్యవధిని ఇచ్చారు. టెక్నాలజీ మోసాలు, ఆన్‌లైన్ మోసాలు, ప్రచార మోసాలు అంతగా అప్పట్లో లేకపోవడంతో ఆ బిల్లు కొన్ని అంశాలకు మాత్రమే పరిమితమైంది. మౌలిక అవసరాలకు సంబంధించిన హక్కులను, ఆరోగ్యకరమైన పర్యావరణంలో సమస్యల పరిష్కారాన్ని ఆవిష్కరించడంలో ఆ చట్టం విఫలమైంది. ఎందుకంటే ఇది పేదలు, అట్టడుగు వర్గాల ప్రజల ఆకాంక్షలకు ప్రతీక కాకపోవడం, ధర చెల్లించని వ్యవహారాలకు ఈ చట్టం వర్తించకపోవడం ఒక పెద్ద లోపంగా మారింది. 1986లోనే 'వినియోగదారుల హక్కుల రక్షణ చట్టాన్ని' రూపొందించి శాసనరూపం ఇచ్చినా, ఈ చట్టం ముఖ్య ఉద్దేశమైన- 'తక్కువ ఖర్చులో,సులభ రీతిలో సత్వర న్యాయాన్ని అందించడమ'నే పరమార్థం నెరవేరలేదు. సరికదా.. తర్వాతర్వాత మోసాలు మిన్నంటడంతో 1991లో, 1993లో, 2002లో వినియోగదారుల రక్షణ చట్టానికి సవరణలు తీసుకువచ్చారు. డిజిటల్ యుగంలో ఎదురవుతున్న కొత్త సమస్యలను అధిగమించడానికి వినియోగదారుల హక్కుల పరిరక్షణకు సమగ్ర చట్టాన్ని రూపొందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. 2015 ఆగస్టులో బిల్లు ముసాయిదాను రూపొందించినా, దాన్ని పార్లమెంటరీ స్థాయీ సంఘానికి సిఫార్సు చేశారు. బిల్లులో పలు అంశాలపై స్థాయీ సంఘం తన అభ్యంతరాలను చెబుతూ సవరణలు చేసే సరికి అది మూలన పడింది. మరింత చర్చ అనంతరం 2017లో 'వినియోగదారుల హక్కుల పరిరక్షణ బిల్లు'ను రూపొందించారు. గత ఏడాది జనవరి 5న తొలుత ఈ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టారు. ఆ రోజున లోక్‌సభలో కార్యక్రమాలను నిర్వహించే పరిస్థితి లేకపోవడంతో అది కాస్తా అటకెక్కింది. దానిని స్వల్పంగా సవరించి డిసెంబర్ 20న లోక్‌సభలో మరో మారు ప్రవేశపెట్టి ఆమోదించారు. ఇక ఈ బిల్లు రాజ్యసభ ఆమోదం పొందాల్సి ఉంది.

కొత్త బిల్లులో అనేక మోసాల నుంచి వినియోగదారులకు రక్షణ కల్పించారు. ప్రధానంగా వినియోగదారులు గతంలో మాదిరి వస్తువు కొనుగోలు చేసిన ప్రాంతంలోనే ఫిర్యాదు చేయాలనే నిబంధనను తొలగించారు. ఈ-మెయిల్ ద్వారా ఎక్కడి నుండైనా అమ్మకం దారుడు, మధ్యవర్తి, ఉత్పత్తిదారుడు ముగ్గురిపైనా కేసులు వేయవచ్చు. ఆ ఉత్పత్తిని ఎవరైనా ప్రోత్సహిస్తూ ప్రచారం పాల్గొంటే అటువంటి ప్రముఖుడిపై కూడా కేసు నమోదు చేసే అస్త్రాన్ని వినియోగదారుల హస్తంలో పెడుతున్నారు. సేవల రంగంలో పారదర్శకతను, జవాబుదారీతనాన్ని చేర్చడంతో పాటు వినియోగదారులను జాగృత పరచడానికి, అవగాహన పెంచడానికీ , ఉత్పత్తిదారుల్లో అప్రమత్తతకు బిల్లు చట్టరూపం దాలిస్తే ఎంతో తోడ్పడుతుంది. కొత్త బిల్లును 8 చాప్టర్లతో 107 క్లాజులతో రూపొందించారు. కేంద్ర, రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో వినియోగదారుల రక్షణ మండళ్ల ఏర్పాటును చాప్టర్-2లో వివరించగా, వినియోగదారుల హక్కుల పరిరక్షణ కేంద్ర సంస్థ ఏర్పాటు గురించి చాప్టర్-3లో వివరించారు. విధి విధానాలు, నియామకాలు, పరిశోధన విభాగం, తనిఖీ, స్వాధీన అధికారం, ఉత్పత్తులను వెనక్కు తీసుకునేలా ఆదేశించే అధికారాలను ఈ అధ్యాయంలో పేర్కొన్నారు. 'వినియోగదారుల సమస్యల పరిష్కార కమిషన్' ఏర్పాటు గురించి అధ్యాయం-4 లో క్లాజు 28 నుండి 73 వరకూ వివరించారు. అత్యంత కీలకమైన వినియోగదారుల సమస్యల పరిష్కార మధ్యవర్తిత్వ కేంద్రాల ఏర్పాటు గురించి అధ్యాయం-5 పేర్కొంది. ఉత్పత్తుల లోపాలపై అధ్యాయం-6లోనూ, వివిధ పొరపాట్లు, తప్పులకు, తప్పుదారి పట్టించే ప్రయత్నాలకు అధ్యాయం-7లో శిక్షలను పేర్కొన్నారు. అధ్యాయం-8లో మిగిలిన ఇతర అంశాలను జోడించారు. ఆన్‌లైన్‌లో విక్రయించిన వస్తువులు సక్రమంగా లేకున్నా, ప్రచారకర్తలు తప్పుడు ఉత్పత్తులకు ప్రోత్సాహాన్ని అందించినా, టిక్కెట్లు, హోటల్ గదులు, బుకింగ్ పోర్టళ్లు సవ్యమైన రీతిలో వ్యవహరించకపోయినా చివరికి బిల్లు ఇవ్వకున్నా, రశీదు ఇవ్వకున్నా, వస్తు మార్పిడికి ఉన్న 30 రోజుల వ్యవధిలో వినియోగదారుడి డిమాండ్‌ను అంగీకరించకున్నా, వినియోగదారుడి వివరాలను అవసరం లేని చోట వెల్లడించినా ఆయా సంస్థలు ఇరుకున పడటం ఖాయం.

'కాంట్రాక్టు' అంటే ఏమిటో ఆరు పదాల్లో ఈ కొత్త బిల్లులో చేర్చారు. గతంలో లేని చాలా నిబంధనలను ఇందులో పొందుపరిచారు. వినియోగదారుల సమస్యలపై కోటి రూపాయల గరిష్ట మొత్తానికి సంబంధించిన కేసులను జిల్లా స్థాయిలోనే పరిష్కరించవచ్చు. 10 కోట్ల రూపాయల వరకూ రాష్ట్ర స్థాయిలోనూ, 10 కోట్లకు పైబడి జాతీయ స్థాయిలోనూ పరిష్కరించే వీలు కల్పించారు. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో వినియోగదారుల సంక్షేమ మండళ్ల నియామకాల్లోనూ స్వల్ప మార్పు చేశారు. ఈ-కామర్స్, ఆన్‌లైన్ కొనుగోళ్లనూ కొత్త బిల్లు పరిధిలోకి తీసుకురావడమే గాక, కోర్టుల ఆర్థిక పరిధిని ఐదు రెట్లు పెంచడం పెద్ద ఉపశమనం.

శరవేగంగా పెరుగుతున్న ఆన్‌లైన్ కొనుగోళ్లలో వినియోగదారుడు కొనుగోలు చేసింది ఒకటైతే, చేతికి ఇంకొకటేదో చేరే ఘటనలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. చివరికి సెల్ ఫోన్లు ఆర్డర్ ఇస్తే మట్టి రాళ్లు కవర్లలో వచ్చిన సంఘటనలు ఎన్నో చోటు చేసుకున్నాయి. వినియోగదారుడు ఈ-కామర్స్ పోర్టల్‌కు డబ్బు చెల్లించాక వస్తువును ఉత్పత్తి దారుడు వినియోగదారునికి చేరవేస్తాడు. ఈ క్రమంలో మొసపోతున్న వినియోగదారుడి ఆక్రందన వినే పరిస్థితి నేడు లేదు. తాజా బిల్లు ప్రకారం అమ్మకం దారుడు ఏ ప్రాంతం వారైనా వినియోగదారుడు మాత్రం ఎక్కడికీ వెళ్లనక్కర్లేదు. ఈ-మెయిల్‌లో ఫిర్యాదు చేస్తే సరిపోతుంది లేదా తాను ఎక్కడ ఉన్నాడో అదే ప్రాంతంలోని వినియోగదారుల కోర్టులో ఫిర్యాదు చేయవచ్చు. ఈ-కామర్స్ సంస్థలు తమ వ్యాపార వివరాలు, విక్రయసంస్థతో ఉన్న ఒప్పందాలను వినియోగదారుల వివరాలను ఎలా వినియోగించుకున్నారనేది వెల్లడించాల్సి ఉంటుంది.

ఇంతవరకూ ఈ-కామర్స్ సంస్థలు వినియోగదారుడికీ, విక్రయదారుడుకీ మధ్యలో వారధిగా మాత్రమే వ్యవహరించేవి. కొత్త బిల్లు అమలులోకి వచ్చిన తర్వాత ఇవి సేవలు అందించే సంస్థలుగా మారాల్సి ఉంటుంది. ఇంతవరకూ ఉత్పత్తులపై తయారీదారులకే మాత్రమే బాధ్యత ఉండేది. ఇకపై వాటి ప్రచారానికి పూనుకున్న వారు కూడా బాధ్యులవుతారు. ఎవరైనా తప్పు దారి పట్టించే ప్రకటనలు రూపొందిస్తే ప్రజా ప్రయోజనాలకు భంగం వాటిల్లినా లేదా వినియోగదారుడి ఆరోగ్యం దెబ్బతిన్నా, అటువంటి ప్రచారకర్తలకు రెండేళ్ల వరకూ జైలు శిక్ష, 10 లక్షల వరకూ జరిమానా ఉంటుంది. నేర తీవ్రత ఆధారంగా 10 ఏళ్ల వరకూ జైలు శిక్ష, 30 లక్షల వరకూ జరిమానా విధిస్తారు. అయితే, ప్రచారకర్తలు ఆయా ఉత్పత్తులను వినియోగించి రుజువు చేసుకున్నట్టయితే ఈ జైలు శిక్షల నుండి మినహాయింపు లభిస్తుంది. తయారీ సంస్థలు, సేవాసంస్థలు మార్కెట్‌లోకి తెచ్చిన ఉత్పత్తులతో ఇబ్బంది పడిన, నష్టపోయిన వినియోగదారులందరికీ ఉపశమనం కల్పించేందుకు కొత్తబిల్లు రక్షణ కల్పిస్తుంది. కాగా, కొత్త బిల్లులో కొన్ని లోపాలు లేకపోలేదు. వాటిని చట్ట రూపకల్పనలోనూ, శాసనంగా తెచ్చినపుడు ఇచ్చే నిబంధనల్లో సవరించుకునే వీలులేకపోలేదు.

-బీవీ ప్రసాద్ 98499 98090

మావోల ఉచ్చులో యువత!

హైదరాబాద్‌లోని మౌలాలీ ప్రాంతంలో ఇటీవల ముగ్గురు యువతులను విశాఖ పోలీసులు అరెస్టు చేశారు. మావోయిస్టు పార్టీ అనుబంధ సంఘాలలో వీరు క్రియాశీలకంగా పనిచేస్తున్నారు. ఆత్మకూరు భవానీ, అన్నపూర్ణ, అనూష అనే ఈ యువతులు చిన్నప్పటి నుంచే మావోయిస్టు భావజాలంతో ప్రభావితమై పనిచేస్తున్నారని వినికిడి. అనూష, అన్నపూర్ణలు గెరిల్లా దళ జీవితాన్ని సైతం గడిపారు. మావోయిస్టు ప్రముఖ నాయకుడు 'ఆర్కే'తో సంభాషించి, వీరు గెరిల్లా దళ జీవితంలోకి అడుగిడారని, తుపాకులు ధరించి ఫొటోలు సైతం దిగారని తెలుస్తోంది. మూడు పదుల లోపు వయసుగల ఈ అమ్మాయిలు అనంతరం అర్బన్ నక్సల్‌గా రూపాంతరం చెందారు. మావోల అనుబంధ సంస్థ చైతన్య మహిళా సంఘంలో ఇటు తెలంగాణ, అటు ఏపీలో వీరు చురుగ్గా పాల్గొంటూ, యువతను మావోయిస్టు పార్టీ పట్ల ఆకర్షితులయ్యేలా చేస్తున్నారు. ఆత్మకూరు సోదరీమణుల మాదిరి ఎంతో మంది ఈ రకమైన కార్యక్రమాల్లో నిమగ్నమయ్యారు.

ఇదే సమయంలో హైదరాబాద్‌లోని భూభౌతిక పరిశోధన సంస్థ సాంకేతిక అధికారి వెంకట్రావు ఛత్తీస్‌గఢ్‌లోని మావోలకు మందుగుండు సామాగ్రి, ఇతర వస్తువులను అందజేస్తుండగా అక్కడి పోలీసులు అరెస్టుచేశారు. దీంతో అర్బన్ నక్సల్స్ 'అక్టోపస్' అంతటా వ్యాపించారని తేలింది. ఇలా యువతను పెడదోవ పట్టించడం వల్ల అటు ఆ వ్యక్తులకు, ఇటు సమాజానికి ఎలాంటి మేలు చేకూరడం లేదు. మావోలు కలలు గంటున్న సమాజం నిజానికి ఎక్కడా కనిపించడం లేదు. ఆ ఛాయలే లేనపుడు యువతను అటువైపు ఆకర్షించడంలో అర్థమేమిటి?

అధునాతన కంప్యూటర్ పరిజ్ఞానంతో నేటి యువత కుస్తీపడుతోంది. తాజాగా 'పైథాన్' అనే కంప్యూటర్ లాంగ్వేజిని మరింత మెరుగుపరుస్తున్నారు. కృత్రిమ మేధకు మెరుగులు దిద్దుతున్నారు. వివిధ కంప్యూటర్ లాంగ్వేజీలను నేర్చుకుని నూతన ఆవిష్కరణల దిశగా యువత ప్రయాణిస్తున్న దృశ్యం స్పష్టంగా కనిపిస్తోంది. ఆత్మకూరు సోదరీమణులు అరెస్టయిన హైదరాబాద్‌లోనే 'పైథాన్' లాంగ్వేజిని బోధించేందుకు, శిక్షణ ఇచ్చేందుకు సాఫ్ట్‌వేర్ రంగ నిపుణులు సిద్ధమవుతున్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఈ లాంగ్వేజికి ఆదరణ పెరుగుతున్న నేపథ్యంలో భారతీయ యువతతోపాటు అభివృద్ధి చెందిన అమెరికా లాంటి దేశాల యువత సైతం అటువైపుచూస్తున్నారు. అనేక 'స్టార్టప్'లతో మమేకమై నూతన ఆవిష్కరణల కోసం శ్రమిస్తున్నారు. విద్యాసంస్థలు కూడా పరిశ్రమలకు అవసరమైన కోర్సులను ప్రవేశపెట్టి నూతన ఉత్పత్తులను మార్కెట్లో ప్రవేశపెట్టేందుకు ప్రయత్నిస్తున్నాయి.

మావోలు ఊహిస్తున్నట్టు విప్లవ సాహిత్యం, మార్క్స్-ఏంగిల్స్, లెనిన్-స్టాలిన్ తదితరుల పుస్తకాలను అధ్యయనం చేసేందుకు యువత ఇష్టపడటం లేదు. నేడు యువత సోషల్ మీడియా చుట్టూ తిరుగుతోంది. అన్నింటికీ సామాజిక మాధ్యమాలే వేదికలవుతున్నాయి. పల్లెలు-పట్నాలు అన్న తేడా లేకుండా అందరూ 'డిజిటల్ తెర'కు అధిక సమయం కేటాయిస్తున్నారు. ఇది అందరి ఎరుకలో ఉన్నదే! స్మార్ట్ ఫోన్‌తో ప్రపంచాన్ని చుట్టివచ్చే అవకాశం ఏర్పడటంతో అందరూ దానికి 'అంకిత'మవుతున్నారు. ఉదయం లేచిన దగ్గర నుంచి రాత్రి పడుకునే వరకు ఎదురయ్యే అన్నీ అవసరాలు డిజిటల్ మోడ్‌లోకి మళ్ళాయి. నాలెడ్జి కీలకం కావడంతో నాలెడ్జి ఎకానమీ వ్యాప్తి చెందుతోంది. సంపద ఇప్పుడు ఈ రకంగా సృష్టించబడుతోంది. సమాజమంతటా ఈ నాలెడ్జి ఎకానమీ పరివ్యాప్తమవుతున్న నేపథ్యంలో మావోయిస్టుల ''ప్రత్యామ్నాయ'' పద్ధతులు ఎలా పాదుకొంటాయి? వాటికి ఆక్సిజన్ ఎక్కడి నుంచి అందుతుంది? ఈ విషయమై స్పష్టత లేకుండా ఎంతమంది అమాయక యువతీ యువకులను వామపక్ష తీవ్రవాదమనే ఊబిలోకి దింపుతారు?

లోకం ఇప్పుడు 'ఆన్‌లైన్'పై నడుస్తోంది. ఆన్‌లైన్ పట్ల విశ్వాసం అపారంగా పెరిగింది. ఈ ఆన్‌లైన్ రోజుల్లో రాజకీయ విశ్వాసాలు రూపాంతరం చెందాయి. ఈ కీలక పరిణామాన్ని మావోలు పరిగణించక పోవడం విడ్డూరం. రోబోల యుగంలో కృత్రిమ మేధ సమాజంలో విస్తరిస్తోంది. వామపక్ష రాజకీయ సిద్ధాంతాలపై విశ్వాసం క్రమంగా సడలుతోంది. సమాజంలో డ్రైవర్ రహిత కార్లు రావడం, వ్యాధులను నిర్ధారించే సాఫ్ట్‌వేర్ రావడం, మనుషులకు సంబంధించిన నిర్ణయాలను ఆల్గొరిథమ్ ద్వారా తీసుకునే సందర్భం వచ్చేసింది. దీన్ని పట్టించుకుని పరిస్థితులను అంచనావేసి తదనుగుణంగా స్పందించడానికి బదులు కాలం చెల్లిన సిద్ధాంతాలను సజీవంగా నిలుపుతామని, అందుకు యువతరాన్ని బలి తీసుకుంటామంటే ఎలా భావ్యమనిపించుకుంటుంది?

వాణిజ్యం-వ్యాపారం ఈ-కామర్స్ ద్వారా కొనసాగుతున్న రోజులివి, కిరాణ సరుకులను సైతం 'ఆన్‌లైన్' ద్వారా తెప్పించుకుంటున్న సమయమిది. దిగ్గజ కంపెనీలు ఈ రంగంలోకి భారీ పెట్టుబడులు పెడుతూ వినియోగదారులను ఆకర్షిస్తున్నాయి. వీళ్ళందరూ ప్రజలే. ప్రజలు కాని వారెవరున్నారు? కాని వామపక్ష తీవ్రవాదులు మాత్రం ప్రపంచంలో రెండువర్గాలున్నాయని అంటున్నారు. కాని సమాజమంతటా ప్రజలే కనిపిస్తున్నారు. ద్వైతం కాదు అద్వైతమే అగుపిస్తోంది. ఈ అద్వైతం చుట్టూనే ప్రపంచం పరిభ్రమిస్తోంది. ఈ విషయం స్పష్టంగా అగుపిస్తోంది. దాన్ని తిలకించాలి కదా? అలా చూసేందుకు తిరస్కరిస్తూ బూజుపట్టిన సూత్రీకరణలకే వేలాడుతూ ఉంటే ప్రజలకు ఒరిగేది ఏమిటి? ఏ రాజకీయ పార్టీ అయినా ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు కృషి చేయాలి. అందుకు స్పష్టమైన విశ్లేషణతో కూడిన విధానం ఉండాలి.

మరి మావోల విశ్లేషణ ఎలా ఉందో అందరికీ తెలిసిందే! సమాజంలో రెండువర్గాలు (పెట్టుబడిదారులు-కార్మికులు) కొనసాగుతున్నాయి, వీటి మధ్యగల ఘర్షణను తొలగించి కార్మిక కర్షక సమాజం ఏర్పాటు చేస్తే, సర్వసమస్యలు సమసిపోతాయని భావించడం.. ఎంతటి అమాయకత్వమో ఎవరైనా ఇట్టే ఊహించవచ్చు. ఇంతటి రాశీభూతమైన అమాయకత్వం ఆధారంగా నిర్ణయాలు తీసుకుని, వంద కోట్లకు పైగా ప్రజల తరపున తామే 'సుమోటో'గా వకాల్తా పుచ్చుకుని దండకారణ్యంలో దండు నిర్మించడం, రక్తం ఏరులై పారేలా తుపాకులకు పని కల్పించడం దండగమారి పని తప్ప మరొకటి కాదు, దారుణమైన విధానం తప్ప మెరుగైనది కాదు.

ఆత్మకూరు సోదరీమణుల మాదిరి అసంఖ్యాక అమ్మాయిలు తమ జ్ఞానాన్ని సమాజం పరం చేస్తూ కార్యాలయాల్లో ఇతరచోట్ల సందడిగా సంపద సృష్టిస్తూ కనిపిస్తుంటే మావోయిస్టులు మాత్రం అలాంటి అమ్మాయిలను చైతన్య మహిళా సంఘాల పేర, ఇతర సంఘాల పేర, గెరిల్లా దళాల పేర వారి జ్ఞానాన్ని మట్టిపాలు జేస్తున్నారు. దుర్వినియోగ పరుస్తున్నారు. ఈ కార్యక్రమం వల్ల ప్రయోజనం లేదని చైనా ఏనాడో ప్రకటించింది. యువతను ఉత్పత్తిరంగంలోకి దింపి ఉత్పత్తిని పెంచి అనేక వస్తువులను చైనా ప్రపంచానికి అందిస్తోంది. అక్కడ కోట్లాది మంది ప్రజలను దారిద్ర్యం నుంచి బయటపడేశారు. సంతృప్తికరమైన జీవితాన్ని అందిస్తున్నారు. ఇదికదా.. ఈ కొత్త ఏడాదిలో అందరూ కోరుకోవలసింది?


-వుప్పల నరసింహం 99857 81799

విపక్షాలది వృథా ప్రయాసే!

❒ తెలంగాణ ఎన్నికలే అందుకు నిదర్శనం ❒ భిన్న ధృవాలున్న పార్టీలు జతకట్టడాన్ని ప్రజలు హర్షించరు

❒ రుణాల మాఫీతో ఆర్థిక వ్యవస్థ పతనం ఖాయం ❒ కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి



న్యూఢిల్లీ, జనవరి 1: లోక్‌సభ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీని ఓడించేందుకు ప్రతిపక్షం ఏర్పాటు చేస్తున్న మహాకూటమి విఫలం కాకతప్పదని ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ అభిప్రాయపడ్డారు. తెలంగాణ శాసనసభ ఎన్నికల్లో ఓడిపోయినట్లే లోక్‌సభ ఎన్నికల్లోనూ మహాకూటమి ఓడిపోతుందని ఆయన జోస్యం చెప్పారు. మంగళవారం ఒక జాతీయ ఇంగ్లీష్ దినపత్రిక ఏర్పాటు చేసిన చర్చా కార్యక్రమంలో అరుణ్ జైట్లీ పాల్గొన్నారు. గతంలోనూ మహాకూటమిని దేశ ప్రజలు తిరస్కరించారు. ఈసారి కూడా తిరస్కరిస్తారని ఆయన స్పష్టం చేశారు. నరేంద్ర మోదీ మరోసారి ప్రధాన మంత్రి కావాలా.. వద్దా.. అనే అంశంపైనే 2019 లోక్‌సభ ఎన్నికలు జరుగనున్నాయని జైట్లీ తెలిపారు. నరేంద్ర మోదీ లేదా నామరూపాలు లేని ప్రతిపక్షం నాయకుడు.. వీరిలో ఎవరిని ఎంపిక చేసుకోవాలన్నదే ఓటర్లు ముందున్న ప్రధాన అంశమని ఆయన ప్రకటించారు. లోక్‌సభ ఎన్నికలు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ మధ్య దేశాధ్యక్షుడి తరహా ఎన్నిక జరిగితే బాగుంటుంది.. తాము ఇలాంటి ఎన్నికలనే కోరుకుంటామని అరుణ్ జైట్లీ తెలిపారు. తెలంగాణ శాసనసభకు ఇటీవల జరిగిన ఎన్నికల గురించి ప్రస్తావిస్తూ టీఆర్ఎస్‌ను ఓడించేందుకు మహాకూటమి విఫలయత్నం చేసిందని అన్నారు. మహాకూటమి తెలంగాణ ప్రజలను గందరగోళంలో పడవేసింది.. అందుకే ఓడిపోయింది.. లోక్‌సభ ఎన్నికల్లోనూ ఇదే జరగబోతోందని ఆయన అభిప్రాయపడ్డారు. లోక్‌సభ ఎన్నికలకోసం భిన్న సిద్ధాంతాలను పాటించే పార్టీలు ఒక కూటమిగా ఏర్పడితే ప్రజలు హర్షించరని జైట్లీ అన్నారు. తెలుగుదేశం జాతీయ అధ్యక్షుడు, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీతో కలిసి మహాకూటమిని ఏర్పాటు చేసేందుకు కృషి చేయటం అందరికీ తెలిసిందే. అయితే తెలంగాణ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, బీఎస్పీ అధ్యక్షురాలు మాయావతి, ఎస్పీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్, ఇతర ప్రాంతీయ పార్టీలతో కలిసి ఫెడరల్ ఫ్రంట్‌ను ఏర్పాటు చేసేందుకు ప్రయత్నించటం తెలిసిందే. అరుణ్ జైట్లీ పరోక్షంగా ఈ ప్రయత్నాల గురించి ప్రస్తావిస్తూ.. మహాకూటమి ఇప్పటికే చీలిక దిశలో పయనిస్తోందని వ్యాఖ్యానించారు. ఎన్‌డీఏ హయాంలో దేశ ఆర్థిక వ్యవస్థ ఎంతో ప్రగతిని సాధించిందని, రైతు రుణాలను మాఫీ చేయటం వంటి జనరంజక కార్యక్రమాల మూలంగా దేశ ఆర్థిక వ్యవస్థపై భారం పెరుగుతుందని అన్నారు. ఇటీవల రైతుల రుణాలను మాఫీ చేసిన కొన్ని రాష్ట్రాల ఆర్థిక వ్యవస్థ అత్యంత దయనీయంగా మారిందని అరుణ్ జైట్లీ చెప్పారు. రైతుల ఆర్థిక స్థితిగతులను బాగుచేయాలంటే మధ్యప్రదేశ్‌లో బీజేపీ ప్రభుత్వం అమలు చేసిన మద్దతు ధరను పరిరక్షించే కార్యక్రమం, తెలంగాణలో టీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన నిర్ధారిత ఆర్థిక సహాయం వంటి పథకాలు మంచివని అరుణ్ జైట్లీ అభిప్రాయపడ్డారు. పారిశ్రామికవేత్తల వేలాది కోట్ల రుణాలను రద్దు చేసిన ప్రభుత్వం రైతుల రుణాలను మాఫీ చేయటం లేదంటూ కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ చేస్తున్న ఆరోపణలను జైట్లీ కొట్టివేశారు. ఈ పోలిక ఎంత మాత్రం సమర్థనీయం కాదని అన్నారు.



నూతన సంవత్సర ఆరంభ వేడుకల్లో భాగంగా మంగళవారం అహ్మదాబాద్‌లోని ఓ చర్చి వెలుపల బెలూన్‌లు ఎగురవేస్తూ సంబరాల్లో మునిగితేలుతున్న నగరవాసులు

ఆయుష్మాన్ స్పందన అద్భుతం

తొలి వంద రోజుల్లో 6.85 లక్షల పేదలకు వైద్య సహాయం: అరుణ్ జైట్లీ వెల్లడి

న్యూఢిల్లీ, జనవరి 1: దేశ వ్యాప్తంగా ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య బీమా పథకానికి విశేష స్పందన వస్తోందని, ఈ స్కీంను ప్రవేశపెట్టిన తొలి వంద రోజుల్లో 6.85 లక్షల పేద ప్రజలకు వైద్య సేవలు అందించినట్లు కేంద్ర ఆర్థికశాఖ మంత్రి అరుణ్ జైట్లీ అన్నారు. జాతీయ ఆరోగ్య విధానాల్లో విప్లవాత్మకమైన మార్పులు వచ్చినట్లు ఆయన చెప్పారు. ప్రతి రోజూ ఐదు వేల క్లైమ్స్‌ను పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. ఈ స్కీం గత ఏడాది సెప్టెంబర్ 23వ తేదీన ప్రవేశపెట్టామన్నారు. ఈ స్కీం గురించి ప్రజల్లో చైతన్యం పెరిగిన తర్వాత దాదాపు కోటి మంది వరకు వైద్య సదుపాయాలు పొందే అవకాశం ఉందన్నారు.

ప్రస్తుతం దేశ వ్యాప్తంగా 16వేల కుటుంబాలు ఈ స్కీం పరిధిలో ఉన్నాయన్నారు. మొదటి వంద రోజుల్లో 6.85 లక్షల రోగులకు 5.1 లక్షల క్లైమ్స్ ఇచ్చామన్నారు. దీని కింద ఆసుపత్రులకు సొమ్ము చెల్లించేసినట్లు చెప్పారు. ఈ స్కీం కింద సాలీనా ఒక కుటుంబానికి రూ.5 లక్షల కవరేజి ఉంటుందన్నారు. 10.74 కోట్ల పేద కుటుంబాలు, 50 కోట్ల మంది ప్రజలను ఈ స్కీం పరిధిలోకి తేవాలనే ఉద్దేశ్యంతో పనిచేస్తున్నట్లు ఆయన చెప్పారు. దేశంలో కేంద్ర, రాష్ట్రప్రభుత్వ ఉద్యోగులు, ఆర్మీ ఉద్యోగులకు బీమా సదుపాయం ఉందని, 62.58 శాతం జనాభాకు సరిగా వైద్యసదుపాయాలు అందడం లేదన్నారు.

ఖాదర్‌ఖాన్ కన్నుమూత



న్యూఢిల్లీ, జనవరి 1: ప్రముఖ బాలీవుడ్ నటుడు, మాటల రచయిత, స్క్రిప్ట్ రైటర్ ఖాదర్‌ఖాన్ (81) కెనడాలోని టొరంటోలో ఆసుపత్రిలో అనారోగ్యంతో చికిత్స పొందుతూ కన్నుమూసారు. సుదీర్ఘకాలం శ్వాసకోస సంబంధ వ్యాధితో బాధపడుతున్న ఆయన చికిత్సపొందుతూ కోమాలోకి వెళ్లిపోయారు. చికిత్స పొందుతూ ఆయన మృతి చెందినట్టు ఆయన కుమారుడు సర్ఫరాజ్ వెల్లడించారు. కుటుంబ సభ్యులందరూ అక్కడే ఉన్నందున కెనడాలోనే ఆయన అంత్యక్రియలు నిర్వహించనున్నట్టు చెప్పారు. నటుడిగా 300కు పైగా చిత్రాల్లో, రచయితగా 250 బాలీవుడ్ సినిమాలకు ఆయన పనిచేశారు. తండ్రిగా, విలన్‌గా, తాతయ్యగా, మామయ్యగా, అన్నయ్యగా ఇలా ఎన్నో విభిన్నపాత్రలకు ఆయన జీవం పోసారు. అఫ్గానిస్థాన్‌లోని కాబూల్‌లో జన్మించిన ఆయన సివిల్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్‌గా పనిచేశారు. ఖాదర్‌ఖాన్ తన కాలేజీ వార్షికోత్సవ వేడుకల్లో వేసిన నాటకానికి హాజరైన బాలీవుడ్ ప్రముఖనటుడు దిలీప్‌కుమార్ ఆయనలోని ప్రతిభను గుర్తించారు. ఖాదర్‌ఖాన్ తొలుత బాలీవుడ్‌లో రచయితగా అడుగుపెట్టారు. జయబాధురి-రణదీప్ కపూర్ రచించిన టీనేజ్ ప్రేమకథా చిత్రం 'జవాని దివాని'తో ఆయన రచయితగా అరంగేట్రం చేశారు. తర్వాత అమితాబ్ బచ్చన్ నటించిన పలు కమర్షియల్ చిత్రాలకు ఆయన రాసిన డైలాగ్‌లకు ప్రేక్షకులను విజిల్స్ వేయించేవి. ముఖ్యంగా అమర్ అక్బర్ ఆంథోని, షోలా ఔర్ షబ్నమ్‌లకు ఆయనకు మంచి పేరు వచ్చింది. సలీమ్-జావెద్‌లు రచయితలుగా పనిచేసిన షోలే జంజీర్ లాంటి చిత్రాలతో అమితాబ్‌బచ్చన్‌కు మాస్ ఇమేజ్ రాగా, తర్వాత 1982లో ఖాదర్‌ఖాన్ రచనలతో ఆయనకు భిన్నమైన ఇమేజ్‌ను ఏర్పరిచారు. షరాబీ, లావారిస్, ముఖద్దర్ కా సికిందర్, నసీబ్, అగ్నిపథ్ వంటి చిత్రాలతో అమితాబ్‌లోని భిన్నకోణాన్ని చూపించారు. అగ్నిపథ్ చిత్రానికి అమితాబ్‌బచ్చన్‌కు 1991లోజాతీయ అవార్డు సైతం లభించింది.

ఖాదర్‌ఖాన్ రచనలతో హీరో గోవిందా కెరీర్ కూడా ఊపందుకుంది. ఆయన పదునైన డైలాగ్‌లు, స్క్రీన్‌ప్లే వల్ల కూలీ నెంబర్ 1, రాజాబాబు, సాజన్ చలే సాసురల్ చిత్రాలు గోవిందాను కమర్షియల్ హీరోగా నిలబెట్టాయి. నిర్మాత డేవిడ్ ధావన్, హీరో గోవిందా, నటుడు, రచయిత ఖాదర్‌ఖాన్ కాంబినేషన్‌లో హీరోనెంబర్ 1, దుల్హేరాజా లాంటి హిట్ కామెడీ చిత్రాలు వచ్చాయి. ఆయన మన్మోహన్ దేశాయ్, ప్రకాష్ మెహ్రా లాంటి వారితో కూడా కలిసి పనిచేశారు. జవాని దివానికి రచయితగా పనిచేసిన తర్వాత 1973లో ఖాదర్‌ఖాన్ మొదటిసారి రంగేసుకుని రాజేష్‌ఖన్నా-షర్మిలాటాగూర్ హీరో హీరోయిన్లుగా చేసిన దాగ్ చిత్రానికి సహాయనటుడిగా అటార్నీ పాత్రలో నటించాడు. దిల్‌దివానా, ముఖద్దర్ కా సికిందర్, మిస్టర్ నట్వర్‌లాల్ చిత్రాల్లో నటించిన ఆయన కామెడీ టైమింగ్‌కు మంచి పేరొచ్చింది. తప్పిపోయిన కొడుకు కోసం తపించిపోయే తండ్రిగా, ఆఫీస్‌లో బాస్‌గా, అన్నయ్యగా, తండ్రిగా, అంధుడిగా, మూగవాడిగా ఇలా ఏ పాత్ర ఇచ్చినా అందులో పరకాయ ప్రవేశం చేసేవారు. మేరీ ఆవాజ్ సునో (1982), అంగార్ (1993) చిత్రాలకు ఉత్తమ మాటల రచయితగా రెండుసార్లు ఫిలింఫేర్ అవార్డును గెల్చుకున్నాడు. అలాగే బాప్ నెంబరీ బేటా దస్ నెంబరీ (1991) చిత్రానికి ఉత్తమ కమెడియన్ అవార్డు పొందారు. మస్తీనహీ శాస్తి (2015)లో ఆయన చివరిసారిగా నటించారు. ఆయన అధికారికంగా తన రిటైర్మెంట్‌ను ప్రకటించకపోయినప్పటికీ, అనంతరం అనారోగ్య కారణాల వల్ల తిరిగి చిత్రసీమలోకి రాలేకపోయారు. కెనడాలోని టొరంటోలో ఉన్న ఆయన కొద్దిరోజుల క్రితం శ్వాసకోస సమస్యలతో ఆసుపత్రులో చేరి చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారు. ఆయన అంత్యక్రియలు అక్కడే నిర్వహిస్తామని ఆయన బంధువులు తెలిపారు. ఖాదర్‌ఖాన్ మృతికి ప్రధాని మోదీ, నటుడు అమితాబ్‌బచ్చన్, పలువురు బాలీవుడ్ నటులు, రచయితలు, సాంకేతిక నిపుణులు తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేశారు. బాలీవుడ్ ఒక మంచి నటుడు, రచయితను కోల్పోయిందని వారు పేర్కొన్నారు.

మోదీ మాటలు అబద్ధాల పుట్ట

❒ ప్రధాని ఇంటర్వ్యూపై కాంగ్రెస్ తీవ్రస్థాయిలో ధ్వజం

న్యూఢిల్లీ, జనవరి 1: ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఇంటర్వ్యూ అబద్ధాల పుట్ట అని, మోదీ నిష్క్రమణకు కౌంట్ డౌన్ మొదలైందని కాంగ్రెస్ పార్టీ విమర్శించింది. మోదీ పాత విషయాలనే మళ్లీ నెమరువేశారని, సొంత డబ్బాకొట్టుకున్నారని కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి రణదీప్ సూర్జీవాలా చెప్పారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్న భావన మోదీలో కనపడలేదన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన పది హామీలను నెరవేర్చే విషయమై మోదీ ప్రస్తావించలేదన్నారు. ప్రతి బ్యాంకు అకౌంట్‌లో రూ.15 లక్షల సొమ్మును జమ చేస్తామని, 80 లక్షల కోట్ల నల్లధనాన్ని వెనక్కుతెస్తామని, సాలీనా రెండు కోట్ల మందికి ఉద్యోగాలు ఇస్తామని, రైతుల వ్యయ నియంత్రణ 50 శాతం తగ్గిస్తామని, జీఎస్‌టీ, పెద్ద నోట్ల రద్దు, స్కాంలు, జాతీయ భద్రత, రాఫెల్ అవినీతి, గంగానది ప్రక్షాళన గురించి మోదీ నోరుమెదడలేదన్నారు. ఈ ఇంటర్వ్యూలో ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబించే అంశాలను మోదీ చర్చించలేదన్నారు. అంకెలతో మసిబూసి మారేడు కాయ చేసినట్లుగా ఉందన్నారు. దేశ ఆర్థిక, సామాజిక వ్యవస్థను మోదీ భ్రష్టుపట్టించారన్నారు. రామమందిర నిర్మాణం అంశం సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉందని, తీర్పుకు అందరూ కట్టుబడి ఉండాలన్నారు. ఒకసారి తీర్పు వచ్చిన తర్వాత ఆర్డినెన్స్‌తో పనిలేదన్నారు. సుప్రీంకోర్టు అయోధ్య అంశాన్ని పరిష్కరిస్తుందన్నారు.

కాల్పుల విరమణ ఉల్లంఘన దారుణం

❒ భారత్‌కు పాకిస్తాన్ నిరసన

ఇస్లామాబాద్, జనవరి 1: కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించి భారత సైనిక దళాలు నియంత్రణ రేఖ వద్ద కాల్పులకు తెగబడి తమదేశానికి చెందిన ఒక మహిళ మరణానికి కారకులయ్యారని ఆరోపిస్తూ భారత డిప్యూటీ హై కమిషనర్‌కు పాకిస్తాన్ తీవ్ర నిరసన వ్యక్తం చేసింది. సౌత్ ఆసియా, సార్క్ డైరెక్టర్ జనరల్, పాక్ విదేశీ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి మహమ్మద్ ఫైజల్ ఈ మేరకు భారతీయ దౌత్యాధికారులకు తమ నిరసన తెలుపుతూ డిసెంబర్ 31న భారత దళాలు ఆధీన రేఖ, సరిహద్దు వద్ద పాక్‌పౌరులను లక్ష్యంగా చేసుకుని నిరవధికంగా భారీ ఆయుధాలను ప్రయోగించారని ఆరోపించారు. దీంతో ఒక మహిళ మృతి చెందగా, పలువురు గాయపడ్డారని చెప్పారు. కాల్పుల విరమణ ఒప్పందానికి విరుద్ధంగా భారత సైనికులు 2018లో 2350కు పైగా ఉల్లంఘనలకు పాల్పడి దాడులు చేయడంతో 36 మంది పౌరులు మృతి చెందగా, 142 మంది గాయపడ్డారని ఆయన ఒక ప్రకటనలో ఆరోపించారు. 2017 నుంచి భారత్ ఎన్నో ఉల్లంఘనలకు పాల్పడుతోందని ఆయన తెలిపారు. పౌరులను లక్ష్యంగా చేసుకుని కాల్పులకు పాల్పడటం అంతర్జాతీయ మానవహక్కులను ఉల్లంఘించడమేనని ఆయన పేర్కొన్నారు. దీనివల్ల ఇరుదేశాల మధ్య అశాంతి, అస్థిర వాతావరణం ఏర్పడుతోందని అన్నారు. 2003లో కుదుర్చుకున్న కాల్పుల విరమణ అమరికను భారత్ ఇకనైనా గౌరవించాలని ఆయన హితవు పలికారు.

తీరుమారకుంటే రూటు మారుస్తాం

❒ అమెరికాతో చర్చల వల్ల ఫలితాల్లేవ్

❒ ఆంక్షలు ఎత్తివేయకపోతే అణ్వస్త్ర పరీక్షలే

❒ ఉత్తర కొరియా అధినేత కిమ్ జాంగ్ హెచ్చరిక



సియోల్, జనవరి 1: అమెరికాతో సత్సంబంధాలు కోరుకుంటున్నామని, తమ దేశంపై విధించిన ఆంక్షలను ఎత్తివేయని పక్షంలో అణ్వస్త్ర పరీక్షలు, ప్రయోగాలపై తమ వైఖరి మారదని ఉత్తరకొరియా అధినేత కిమ్ జాంగ్ స్పష్టం చేశారు. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ఆయన సందేశం ఇస్తూ, గత ఏడాది అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో చర్చలు జరిపామని, కాని ఇంత వరకు ఆశించిన ప్రయోజనాలు కలగలేదన్నారు. ఈ చర్చల వల్ల ఎటువంటి ఫలితాలు సాధించలేదన్నారు. మా దేశ సార్వభౌమత్వాన్ని కాపాడుకునేందుకు అన్ని చర్యలు తీసుకునేందుకు తమ దేశం సిద్ధంగా ఉందన్నారు. భద్రత విషయంలో రాజీలేదన్నారు. ఆయుధ శక్తిని పెంపొందించుకుంటామన్నారు. అమెరికా రానున్న రోజుల్లో తమ దేశం పట్ల ప్రదర్శించే వైఖరిని బట్టి భవిష్యత్తు ఉంటుందన్నారు. తమ దేశంపై ఇంతవరకు ఆంక్షల విషయమై ఉపశమనం ఇచ్చే విధంగా అమెరికా చర్యలు తీసుకోలేదన్నారు. కిమ్ తన ప్రసంగంలో తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. అమెరికాతో చర్చించిన అనేక అంశాల్లో ఏ ఒక్కటి కూడా అమలు కాలేదన్నారు. ఆంక్షల విషయంలో ఉపశమనం కలిగించే చర్యలు తీసుకోకుండా, శాంతి సాధ్యం కాదని ఆయన చెప్పారు. కిమ్ తమదేశ సామ్యవాద ఆర్థిక వ్యవస్థను అభివృద్ధి చేయాలనే తాపత్రయంతో ఉన్నట్లు అమెరికా రక్షణ రంగ నిపుణులు అంకిత్ పండా చెప్పారు. ఉత్తర కొరియాపై ఆంక్షలు విధించినా, వాటికి తగ్గట్టుగా నడుచుకుంటుందనే నమ్మకం కలిగించాల్సి ఉంటుందన్నారు. గత ఏడాది సింగపూర్‌లో అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ఉత్తర కొరియా అధినేత కిమ్ జాంగ్ మధ్య చర్చలు జరిగిన విషయం విదితమే.

620 కిలోమీటర్ల మానవహారం

లింగసమానత్వం కోసం మహిళల చారిత్రక ప్రదర్శన

తిరువనంతపురం, జనవరి 1: లింగ సమానత్వాన్ని పాటించాలని, వివక్షను వీడనాడాలన్న సందేశంతో కేరళ రాష్ట్రంలో 35 లక్షల మంది మహిళలతో 620 కిలోమీటర్ల పొడవున మానవహారం నిర్వహించారు. ఉత్తర ప్రాంతంలోని కాసరగడ్ నుంచి దక్షిణ ప్రాంత సరిహద్దు వరకు మంగళవారం ఈ మానవహారాన్ని ఏర్పరిచారు. ఎన్నోఏళ్లుగా ఉన్న శబరిమల సంప్రదాయాలను కాపాడాలని కోరుతూ వేలాది మంది మహిళలు అయ్యప్ప జ్యోతులను చేతబట్టి కాసరగడ్‌లోని హోస్‌గండి నుంచి కన్యాకుమారి వరకు మంగళవారం మానవహారాన్ని ఏర్పాటు చేశారు. రచయితలు, క్రీడాకారులు, నటులు, రాజకీయవేత్తలు, టీచర్లు, ప్రభుత్వ ఉద్యోగులు, గృహిణులు ఇలా అన్నివర్గాల వారితో 14 జిల్లాల మీదుగా సాగే హైవే పక్కన వీరు మానవహారంగా ఏర్పడ్డారు. మహిళలకు మద్దతుగా వారికి సమాంతరంగా పురుషులు సైతం రెండో లైన్‌లో నుంచుని మానవహారాన్ని నిర్వహించారు. అన్ని వయసుల మహిళలకు శబరిమల అయ్యప్ప దర్శనానికి అనుమతిని ఇస్తూ సుప్రీం కోర్టు తీర్పునిచ్చిన నేపథ్యంలో దానిని అమలు చేయడానికి కేరళ రాష్ట్రంలోని సీపీఐ (ఎం) నేతృత్వంలోని ఎల్‌డీఎఫ్ ప్రభుత్వం కంకణం కట్టుకుంది. అయితే దీనిని కొన్నివర్గాలు వ్యతిరేకిస్తున్న నేపథ్యంలో లౌకిక భావాలను గౌరవించాలని, లింగ సమానత్వాన్ని పాటించాలని, సమాజాన్ని అంధకారంలోకి నెట్టేస్తున్న భావాలను విడనాడాలన్న సందేశంతో ఈ మానవహారం నిర్వహించినట్టు కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించిన కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ తెలిపారు. అంతకుముందు ఆయన సామాజిక సంస్కర్త అయ్యంకాళి విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. సీపీఐ పొలిట్‌బ్యూరో సభ్యురాలు బృందాకారత్, సీపీఐ నేత అన్ని రాజా తదితరులు పాల్గొన్న కార్యక్రమంలో, తమ అజ్ఞానంతో సమాజాన్ని అంధకారంలో నెట్టివేస్తున్న కొందరి వైఖరిని నిరసిస్తూ, కేరళను రక్షించాలని, లింగసమానత్వాన్ని పాటించాలన్న సందేశంతో తాము చేపట్టిన ఈ మానవహారంలో కులమతాలకు అతీతంగా అన్ని వర్గాలు పాల్గొంటాయన్న ఆశాభావాన్ని పినరయి విజయన్ వ్యక్తం చేశారు. అంతకుముందు సీపీఐ (ఎం) రాష్ట్ర కార్యదర్శి కొడియేరి బాలకృష్ణన్ మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో 50లక్షల మంది మహిళలు పాల్గొంటారని భావిస్తున్నట్టు చెప్పారు.

రాజకీయ కేసులను ఎత్తివేస్తాం

భోపాల్, జనవరి 1: బీజేపీ ప్రభుత్వం ప్రతిపక్ష పార్టీల నేతలు, కార్యకర్తలపై మోపిన రాజకీయ కేసులను ఎత్తివేయనున్నట్లు మధ్యప్రదేశ్‌లోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించింది. తమపై ఉన్న కేసులను ఎత్తివేయకుంటే మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల్లో కాంగ్రెస్ ప్రభుత్వాలకు మద్దతుపై పునరాలోచిస్తామని బీఎస్పీ అధ్యక్షురాలు మాయావతి అల్టిమేటం ఇచ్చిన మరుసటి రోజే ఎంపీ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం. సుప్రీం కోర్టు తీర్పుతో ఎస్సీ, ఎస్టీ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం నీరుగార్చేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపిస్తూ గత ఏడాది ఏప్రిల్ 2న దేశవ్యాప్తంగా ఉన్న దళిత సంస్థలు భారత్ బంద్‌కు పిలుపిచ్చాయి. ఈ బంద్‌కు బీఎస్పీ పూర్తిగా మద్దతు పలికింది. ఈ సందర్భంగా మధ్యప్రదేశ్‌లో జరిగిన ఘర్షణల్లో ఎనిమిది మంది దళితులు ప్రాణాలు కోల్పోయారు. ఈ సందర్భంగా బీఎస్పీ నేతలపై కేసులు నమోదయ్యాయి. అలాగే గత పదిహేను సంవత్సరాలుగా అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కాంగ్రెస్, ఎస్పీ, బీఎస్పీ, వామపక్షాలు, నర్మదా బచావో ఆందోళన్ కార్యకర్తలు, నేతలపై అనేక కేసులు నమోదు చేసింది. వీటన్నింటినీ రాజకీయ కేసులుగా పరిగణిస్తూ వాటిని ఉపసంహరించుకుంటామని మధ్యప్రదేశ్ న్యాయ, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పీసీ శర్మ మంగళవారం ఇక్కడ పీటీఐకి వివరించారు.

Gripper

చిన్నారి భారతం

• నూతన సంవత్సరం రోజున 69,944 మంది శిశువుల జననం

• ప్రపంచంలో అగ్రస్థానం మనదే



న్యూఢిల్లీ, జనవరి 1: భారత్‌లో నూతన సంవత్సరం తొలి రోజు 68,933 మంది శిశువులు జన్మించనున్నట్లు యూనిసెఫ్ ప్రకటించింది. ప్రపంచంలో ఎక్కువ మందికి జనవరి 1వ తేదీన జన్మనిచ్చిన దేశం భారత్ కావడం విశేషమని యూనిసెఫ్ పేర్కొంది. చైనాలో 44940 మంది జన్మించనున్నారు. నైజీరియాలో 25,685 మంది ఉన్నారు. శిశువుల దత్తత, వారి హక్కులను ప్రవేశపెట్టి ఈ ఏడాదికి ముప్పై ఏళ్లు గడిచాయి. ప్రతి శిశువు ఆరోగ్యంగా జన్మించి, ఆనందంగా ఉండాలని, అదే సమయంలో వారి హక్కులను గడపాలని ఈ సంస్థ పేర్కొంది. యూనిసెఫ్ సంస్థ శిశువుకు సంబంధించిన అంశాలపై శ్రద్ధ తీసుకుని ప్రపంచ వ్యాప్తంగా వారి ఆరోగ్యం, హక్కులను పరిరక్షిస్తూ ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తోంది. స్థానిక ఆరోగ్య కార్యకర్తలకు సరైన శిక్షణ ఇస్తే, ఆరోగ్యమైన పౌరులను సమాజానికి, దేశానికి అందించవచ్చని యూనిసెఫ్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పెట్రీ గోర్నిజ్‌ఖా చెప్పారు. చాలా దేశాల్లో పుట్టిన శిశువులకు స్థానిక సెంటిమెంట్ ప్రకారం పేర్లు పెట్టుకుంటారన్నారు. సరైన ఆరోగ్య రక్షణ లేనందు వల్ల సగటున రోజుకు ఒక మిలియన్ మంది పిల్లలు మరణిస్తున్నారన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఒక అంచనా ప్రకారం జనవరి 1వ తేదీన 3,95,072 మంది శిశువులు జన్మిస్తారని యూనిసెఫ్ అంచనా. పాకిస్తాన్‌లో 15,112 మంది, బంగ్లాదేశ్‌లో 8428 మంది శిశువులు జన్మిస్తారు. ప్రపంచంలో పుట్టిన శిశువుల్లో 18 శాతం మంది భారత్‌కు చెందిన వారు ఉన్నారని యూనిసెఫ్ పేర్కొంది.

దేశవ్యాప్తంగా ఏక్ భారత్ శ్రేష్ఠా భారత్



ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 1: దేశవ్యాప్తంగా ఏక్ భారత్ శ్రేష్ఠాభారత్ పథకం కింద పాఠశాలల్లో జాతీయ సమైక్యతను పెంపొందించే చర్యలు చేపట్టాలని కేంద్ర మానవ వనరుల మంత్రిత్వశాఖ నిర్ణయించింది. రాష్ట్రాలను, కేంద్ర పాలిత ప్రాంతాలను ఇందులో భాగస్వామ్యులను చేయడంతో పాటు ఎన్‌జీవోలు, కేంద్ర మంత్రిత్వశాఖలు, విద్యాసంస్థలు సహకారం తీసుకుని విద్యాంశాల ద్వారా, మానసిక విచలనాలను కలిగించే సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా జాతీయ సమైక్యత పెంపుదలకు చర్యలు తీసుకుంటారు. ఇందుకోసం ప్రభుత్వం ఏక్ భారత్ డాట్ జీవోవీ డాట్ ఇన్ అనే వెబ్ పోర్టల్‌ను కూడా ప్రారంభించింది. ఆసక్తి ఉన్న రాష్ట్రాలు ఇప్పటికే ఈ కార్యక్రమాన్ని పాఠశాల స్థాయిలో ప్రారంభించారు. విద్యాత్మక అంశాలు, సాంస్కృతిక అంశాలు, భౌగోళిక అంశాలు, సామాజిక, పర్యాటక అంశాలు, క్రీడా రంగంలోనూ, యువజన సేవల రంగంలో అత్యుత్తమ చైతన్య కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా ఈ లక్ష్యాలను చేరుకోవాలని చూస్తున్నారు. ఇందుకోసం పాఠశాలలు మధ్య భాగస్వామ్య కార్యక్రమాలను కూడా నిర్వహిస్తారు. వివిధ సందర్భాలను పురస్కరించుకుని ఆహార ప్రదర్శనలు, జాతీయ సమైక్యతా దినోత్సవాన్ని నిర్వహించడం, సమైక్యతకు పరుగు కార్యక్రమాలు, దీపోత్సవం, గీతోత్సవం, భారత్ పర్వ్, ఆర్ట్స యాత్ర పేరుతో కార్యక్రమాలను నిర్వహిస్తారు. ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ పేరుతో 250 సీబీఎస్‌ఈ పాఠశాలలు, 100 జవహర్ నవోదయ పాఠశాలలు, 40 సైనిక పాఠశాలలు, కేంద్రీయ విద్యాలయాలు కలిపి దాదాపు వెయ్యి కార్యక్రమాలను ఇప్పటికే నిర్వహించాయి.

కళ్లు మిరుమిట్లు గొలిపే బాణాసంచా వెలుగులతో కోటి ఆశాకిరణాల ఆలంబనగా యావత్ ప్రపంచం కొత్త సంవత్సరానికి స్వాగతం పలికింది. న్యూఢిల్లీ నుంచి శాన్‌ప్రాన్సిస్‌కో వరకు అన్ని నగరాలు కొత్త సంవత్సర ఆరంభ వేడుకలను ఉత్సాహభరితంగా జరుపుకున్నాయి. ఇటు సంప్రదాయం.. అటు ఆధునికత మేళవించిన రీతిలో విశ్వశ్రేయస్సును శాంతిని కాంక్షిస్తూ భిన్న రీతుల్లో గగనతలం ఈ స్వాగత తోరణాలు కట్టుకుంది.


కొత్త సంవత్సరం తొలిరోజైన మంగళవారం నాడు వేలాదిగా అమృత్‌సర్‌లోని స్వర్ణాలయానికి వచ్చి ప్రార్థనలు జరిపిన భక్తులు


నూతన సంవత్సరం తొలిరోజున కన్నాట్ ప్లేస్‌లో గల హనుమాన్ మందిర్‌కు వేల సంఖ్యలో తరలివచ్చి ప్రార్థనలు చేసిన ఢిల్లీ వాసులు


అసోం: మట్టి ప్రమిదల్లో వెలిగించిన దీపాలతో కొత్త సంవత్సరానికి స్వాగతం


తొలి ఆశ.. తొలి అడుగు.. తొలికిరణం ఇవన్నీ శుభారంభాలే. 2018కి వీడ్కోలు పలికి, 2019 తొలి సూర్యోదయ కిరణాలతో స్వాగతం పలుకుతూ రెక్కలు విప్పి ఎగురుతున్న పక్షుల మధ్య యమునాతీరంలో ఓ ఢిల్లీ వాసి సుస్వాగతమిది.

1వ పేజీ తరువాయి

మోదీ, జైట్లీకి దేశ క్షేమం పట్టదు

ప్రభుత్వ తీరుపై విరుచుకుపడ్డారని, మోదీ పాలనలో ఏ ఒక్క వర్గం కూడా సంతృప్తిగా లేరని మంగళవారం ఆయన ఇక్కడ విలేఖరుల సమావేశంలో అన్నారు. కుటుంబ వ్యవస్థను విచ్ఛిన్నం చేయబూనటం దేశ సార్వభౌమాధికారానికే ప్రమాదకరమన్నారు. నిరంకుశ విధానాలతో మోదీ దేశాన్ని భయపెడుతున్నారని ధ్వజమెత్తారు. కేసీఆర్ మోదీని గాడు అన్నా, సన్నాసి అన్నా పడతారని, ఆంధ్ర రాష్ట్ర ప్రయోజనాల గురించి మేం ప్రశ్నిస్తే అణచివేతకు పాల్పడటం, పార్టీ నేతలను మానసిక క్షోభకు గురిచేయటం, సీబీఐ, ఐటీలను ఉసిగొల్పి దాడులు చేయిస్తున్నారని దుయ్యబట్టారు. ఆర్బీఐ సహా చివరకు సుప్రీం కోర్టును కూడా పక్కదారి పట్టించి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. దేశంలో రెండే రెండు కూటములని, అవి ఎన్డీఏ, యూపీఏ మాత్రమేనన్నారు. యూపీఏ కంటే ఎన్డీఏ సాధించిన అభివృద్ధి ఏమిటో తేల్చాలని సవాల్ విసిరారు. కేసీఆర్ ఫెడరల్ ఫ్రంట్‌కు మమతా బెనర్జీ మొగ్గుచూపుతున్నారని జైట్లీ చేస్తున్న ప్రచారం అవాస్తవమన్నారు. మమత పక్కా బీజేపీ వ్యతిరేకి అని, ఆమె బీజేపీయేతర కూటమికే మద్దతిస్తారని స్పష్టం చేశారు. మరోవైపు రాష్ట్రంలో ఎకానమీ అంటే తెలీని ప్రతిపక్ష నేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అలవికాని హామీలతో ప్రజలను మభ్యపెడుతున్నారని మండిపడ్డారు. ఈ కుట్రలన్నీ ప్రజలు నిశితంగా గమనిస్తున్నారని, త్వరలోనే తగిన బుద్ధి చెప్తారని చంద్రబాబు నాయుడు హెచ్చరించారు.

90 టీఎంసీలతో రబీ ప్రణాళిక

ఎపుడూ లేని విధంగా సీలేరు నుంచి 60 టీఎంసీల వరకు వినియోగించుకోవడానికి అవకాశం ఉంది. రబీ సీజన్ మొదలైన తర్వాత డిసెంబర్ 1 నుంచి డిసెంబర్ 31 వరకు పరిశీలిస్తే ఇప్పటికే 23 టీఎంసీల వరకు వినియోగం జరిగింది. మంగళవారం ధవళేశ్వరం కాటన్ బ్యారేజి వద్ద గోదావరి నీటి మట్టం 13.99 మీటర్లుగా నమోదైంది. తూర్పు డెల్టాకు 2700, మధ్యమ డెల్టాకు 2100, పశ్చిమ డెల్టాకు 5800 క్యూసెక్కులు వెరసి 10,600 క్యూసెక్కుల జలాలను కాలువలకు విడుదల చేశారు. గోదావరి డెల్టాలకు వినియోగించే 90 టీఎంసీలకు ఇప్పటివరకు 23 టీఎంసీలు వినియోగించడంతో ఇంకా 67 టీఎంసీలు మిగిలి వున్నాయి. అందులో 60 టీఎంసీల వరకు సీలేరు జలాలను వినియోగించుకుంటే, ఇంకా 7 టీఎంసీల వరకు గోదావరి సహజ నీటి లభ్యత ఉంటుందని అంచనావేశారు. ప్రస్తుతం రోజుకు గోదావరి నదికి సీలేరు నుంచి సుమారు 3వేల క్యూసెక్కుల వరకు జలాలు విడుదలవుతున్నాయి. ఈ జలాలను డెల్టాలకు అవసరం లేకపోయినప్పటికీ సీలేరులో పవర్ జనరేషన్ అయిన తర్వాత యథావిధిగా విడుదల చేసే జలాలు గోదావరి నదిలో కలుస్తున్నాయి. ధవళేశ్వరం బ్యారేజి నుంచి ప్రస్తుతం రబీ జలాల వినియోగం పోను రోజుకు 600 క్యూసెక్కుల వరకు మిగులు జలాలుగా సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. పోలవరం కాఫర్ డ్యామ్ నిర్మాణాల వల్ల గోదావరి నదిలో నీటి ప్రవాహానికి ఎటువంటి ఇబ్బంది లేకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. కాఫర్ డ్యామ్ పనులు జరుగుతున్న అంగుళూరు ప్రాంతం వద్ద భారీ తూరలు ఏర్పాటుచేసి గోదావరి సహజ నీటి ప్రవాహానికి ఎటువంటి ఆటంకం లేకుండా చేశారు. ఈ ఏడాది మార్చి నెలాఖరు వరకు రబీ కార్యాచరణ ఉంటుంది. అప్పటివరకు వివిధ దశల్లో సాగయ్యే రబీకి నీటి అవసరాలు వుంటాయి. ఆయా కీలకమైన దశల్లో రబీ నీటి అసరాలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఉంటే సరిపోతుంది. ఏప్రిల్ నెలలో కూడా గోదావరి జలాలను మంచినీటి అవసరాలకు వినియోగిస్తారు. ఆ తర్వాత 45 రోజులు కాల్వల్లో నీటి సరఫరా మూసివేస్తారు. మొత్తం రబీ అవసరాలకు గోదావరి నదిలో పుష్కలంగా జలాలు వుండటంతో గోదావరి డెల్టాల్లో రబీ జోరుగా సాగుతోంది.

కూటమికి ఓటమే!

ఏం చేస్తున్నాడనేది తనకు ఎలా తెలుస్తుందని మోదీ ఎదురు ప్రశ్నించారు. ఫెడరల్ ఫ్రంట్‌ను ఏర్పాటుచేసేందుకు చంద్రశేఖరరావు చేస్తున్న ప్రయత్నం గురించి తన వద్ద ఎలాంటి సమాచారం లేదని ఆయన దాటవేశారు. లోక్‌సభ ఎన్నికలు నరేంద్ర మోదీ, రాహుల్ గాంధీకి మధ్య జరుగుతాయనే అభిప్రాయంతో ఆయన ఏకీభవించలేదు. లోకసభ ఎన్నికలు ప్రజలు, మహాకూటమి మధ్య పోటీ అని ఆయన అన్నారు.రైతుల రుణమాఫీ గురించి అడిగిన ప్రశ్నకు బదులిస్తూ- రుణమాఫీ కేవలం ఎన్నికల స్టంట్ మాత్రమేనని, రైతులను ఆదుకునేందుకు ప్రత్యేక, పటిష్టమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రుణమాఫీకి అర్హులైన నిజమైన రైతులు బ్యాంకింగ్ వ్యవస్థలో లేరు.. చిన్న రైతులంతా వడ్డీ వ్యాపారుల వద్దే రుణాలు తీసుకుంటున్నారని ఆయన చెప్పారు. మాజీ ఉపప్రధాన మంత్రి దేవీలాల్ నుండి ప్రధాని మన్మోహన్ సింగ్ వరకు అనేకసార్లు రుణ మాఫీలు జరిగినా రైతుల పరిస్థితి బాగుపడలేదు.. ఎందుకిలా జరుగుతోందో ఆలోచించాల్సిన అవసరం ఉన్నదని నరేంద్ర మోదీ సూచించారు. విత్తనాల పంపిణీ నుండి పండించిన ఆహార దాన్యాలను మార్కెట్‌కు పంపించే వరకు సంస్కరణలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. రైతుల సంక్షేమాన్ని రాజకీయం చేయటం మంచిది కాదని ఆయన చెప్పారు. పెద్దనోట్ల రద్దు ఫలితాలు భవిష్యత్తులో కలుగుతాయని ప్రధాన మంత్రి చెప్పారు.

ఇది తొందరపాటు నిర్ణయం ఎంతమాత్రం కాదు.. తమవద్ద ఉన్న నల్లధనాన్ని ఇచ్చి వేయాలని మొదట సూచించాం.. దీనికోసం మార్గాలను ముందు పెట్టాం.. దాదాపు ఒక ఏడాదిపాటు ఇదంతా చేసిన తరువాతే కఠిన చర్య కింద పెద్దనోట్లను రద్దు చేశామని ఆయన వివరించారు. అన్ని పార్టీలు, రాష్ట్ర ప్రభుత్వాల ఆమోదంతోనే జీఎస్‌టీని అమలు చేస్తున్నాం.. కేవలం ఎన్‌డీఏ ప్రభుత్వం మాత్రమే జీఎస్‌టీకి బాధ్యత వహించాలనడం సమంజసం కాదని అన్నారు. జీఎస్‌టీ వలన ప్రజలపై పన్నుల భారం తగ్గింది.. రహస్య పన్నులు నిలిచిపోయాయని నరేంద్ర మోదీ చెప్పారు. ప్రజలపై జీఎస్‌టీ భారం పడకుండా చూసేందుకు ఎప్పటికప్పుడు వాటిని సవరిస్తూనే ఉన్నామని అన్నారు. దేశంలోని మధ్య తరగతి ప్రజల ప్రయోజనాల పరిరక్షణకు తమ ప్రభుత్వం పలుచర్యలు తీసుకుంటోందని ఆయన చెప్పారు. మూకదాడులు ఎక్కడ జరిగినా ఖండించవలసిందేనని ఆయన స్పష్టం చేశారు. ఎన్‌డీఏ అధికారంలోకి రాకముందు కూడా మూకదాడులు జరిగాయని ఆయన అన్నారు. సుప్రీం కోర్టులో కొనసాగుతున్న న్యాయ ప్రక్రియ ఒక కొలిక్కి వచ్చిన తరువాతనే అయోధ్యలో రామమందిర నిర్మాణంపై ఒక నిర్ణయం తీసుకుంటామని నరేంద్ర మోదీ తెలిపారు. ట్రిపుల్ తలాక్‌ను నిషేధించేందుకు ఆర్డినెన్స్ జారీ చేసినట్లే.. అయోధ్యలో రామమందిర నిర్మాణానికి ఆర్డినెన్స్ జారీ చేస్తారా అన్న ప్రశ్నకు- సుప్రీం కోర్టులో రామమందిర నిర్మాణం కేసుకు అడ్డుతగలకుండా తమ న్యాయవాదులకు సూచనలు జారీచేయాలని ఆయన కాంగ్రెస్ అధినాయకత్వానికి సూచించారు. అయోధ్య కేసు త్వరితగతిన పూర్తికాకుండా చూసేందుకు కాంగ్రెస్ ప్రోత్సాహిత న్యాయవాదులు అడ్డంకులు సృష్టిస్తున్నారని ఆయన ఆరోపించారు.

అయోధ్య వివాదానికి రాజ్యాంగ పరిధిలో పరిష్కారం లభిస్తుందనే ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. బెయిల్‌పై ఉన్న కాంగ్రెస్ అధినాయకత్వం తనపై ఆరోపణలు చేయటం ఏమిటని నరేంద్ర మోదీ ప్రశ్నించారు. దేశాన్ని నాలుగు తరాలపాటు పాలించిన కాంగ్రెస్ పలు కుంభకోణాల్లో కూరుకుపోయిందన్నారు. ఆర్‌బీఐ, సీబీఐ వంటి సంస్థలను తాను నిర్వీర్యం చేస్తున్నట్లు కాంగ్రెస్, ఇతర ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న ఆరోపణలను ఆయన తిప్పికొట్టారు. రిజర్వు బ్యాంకు గవర్నర్ ఉర్జిత్ పటేల్ వ్యక్తిగత కారుణాలతోనే తన పదవికి రాజీనామా చేశారని.. ఈ విషయాన్ని ఆయన తనకు ఏడు నెలల ముందే చెప్పారని అన్నారు. ఉర్జిత్ పటేల్ పని తీరును నరేంద్ర మోదీ ప్రశంసించారు.

హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా ప్రవీణ్ కుమార్ ప్రమాణ స్వీకారం

ముగిసినట్టు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అనిల్ చంద్ర పునేఠా ప్రకటించారు. అనంతరం చీఫ్ జస్టిస్‌తో సహా కొత్త న్యాయమూర్తులకు పలువురు ప్రముఖులు శుభాకాంక్షలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కొల్లు రవీంద్ర, దేవినేని ఉమామహేశ్వరరావు, నక్కా ఆనంద్‌బాబు, జిల్లా కలెక్టర్ బి లక్ష్మీకాంతం, పలువురు ప్రజాప్రతినిధులు, రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు, హైదరాబాద్ నుంచి తరలివచ్చిన న్యాయమూర్తులు, న్యాయవాదులు, ఆంధ్రప్రదేశ్ బార్ అసోసియేషన్ ప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

లోక్‌సభకు పోటీ చేస్తా

చేతిలో హత్యకు గురైన గౌరీ లంకేష్ అనే జర్నలిస్టుకు గట్టి మద్దతుదారులు. ఈ ఘటనపై విచారణ జరిపించి బాధ్యులను అరెస్టు చేయాలని ప్రకాశ్ రాజ్ అనేక వేదికల తర్వాత డిమాండ్ చేశారు. ప్రధాని నరేంద్రమోదీని విమర్శించినందుకు తనకు బాలీవుడ్ దర్శకులు పాత్రలు ఇవ్వడం మానివేశారని ఆయన ఆరోపించారు. ఇటీవల కాలంలో దక్షిణాదిన సినీ పరిశ్రమ నుంచి కమల్ హసన్, రజనీకాంత్‌లు రాజకీయాల్లో చేరిన విషయం విదితమే.

జనంలోకి గాజు గ్లాసు

తీసుకువస్తున్నారు. స్థానికంగా ఉండే సమస్యల చిట్టాలను సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే జనతరంగం పేరుతో ఇంటింటికీ వెళ్ళి జనసేన మేనిఫెస్టోను పరిచయం చేస్తూ వారు చేసే భవిష్యత్తు కార్యక్రమాల గురించి క్యాడర్ వివరిస్తోంది. మరోపక్క సభ్యత్వ నమోదు, నియోజకవర్గ స్థాయి నుంచి మండల, గ్రామ, వార్డు స్థాయి వరకు కమిటీలను వేగంగా ఏర్పాటు చేస్తున్నారు. నియోజకవర్గాల వారీగా సమీక్షలను త్వరగా పూర్తిచేసుకుని, జిల్లాల వారీగా సమీక్షలను నిర్వహించడానికి పార్టీ చకచకా సన్నాహాలు చేస్తోంది. జిల్లాల వారీగా సమీక్షలను ముందుగా పశ్చిమ గోదావరి జిల్లా నుంచే ప్రారంభిస్తారని పార్టీ నేతలు భావిస్తున్నారు. ఉత్తరాంధ్రాలోని మూడు జిల్లాలు, గోదావరి జిల్లాల పైనే ప్రత్యేక దృష్టిసారించిందని చెప్పవచ్చు. ఇక తెలుగుదేశం కార్యక్రమాలు, వైసీపీ జగన్ పాదయాత్రను ఎప్పటికప్పుడు నిశితంగా పరిశీస్తున్న జనసేన పార్టీ 100 రోజుల యాక్షన్ ప్లాన్‌ను సమర్థవంతంగా అమలుచేస్తే మంచి ఫలితాలు వస్తాయని ఆశిస్తోంది. ఇందులో భాగంగానే జనసేనకు ఎన్నికల సంఘం ఇచ్చిన గాజు గ్లాసు గుర్తును ఎక్కువగా ప్రమోట్ చేసుకుంటున్నారు. ఇక నియోజకవర్గ అభ్యర్థుల విషయంలో పార్టీ ఆచితూచి అడుగులు వేస్తోంది. ఫిబ్రవరిలో ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానుందని భావిస్తున్న తరుణంలో ఈ నెలాఖరులో పార్టీ అభ్యర్థులను ప్రకటించడానికి సన్నాహాలు చేస్తున్నట్టు సమాచారం. అయితే టీడీపీ, వైసీపీలు అభ్యర్థులను ప్రకటించిన తర్వాతే జంప్ జిలానీలను చూసుకుని, జనసేన అభ్యర్థులను ప్రకటిస్తుందని ప్రత్యర్థి రాజకీయ పార్టీల్లో చర్చ జరుగుతోంది.

ప్రతీకారంతోనే మెరుపు దాడులు

ఆయన స్పష్టం చేశారు. మెరుపుదాడి జరుగుతున్నంతసేపు తనకు సమాచారం వస్తూనే ఉన్నదని.. అయితే సూర్యోదయానికి గంట ముందు సమాచారం రావటం ఆగిపోయిందని.. ఇది తనను ఆందోళనకు గురిచేసిందని తెలిపారు. ఉరి దాడిలో ఉగ్రవాదులు పెట్టిన మంటల్లో కొందరు సైనికులు కాలిపోవటం తనను కలిచివేసిందని, అందుకే ఆ రోజు నుండి మెరుపుదాడికి ప్రయత్నాలు ప్రారంభించామని అన్నారు. రెండుసార్లు మెరుపుదాడి తేదీలను మార్చవలసి వచ్చిందని చెప్పారు. దీనిమూలంగా మన సైనికుల ధైర్యం, శౌర్యం, సాహసం, సత్తా ఏమిటనేది తెలిసివచ్చిందని అన్నారు. మెరుపుదాడి గురించి పాకిస్తాన్‌కు తెలియజేసిన తరువాతనే మీడియాకు చెప్పామన్నారు. సీమాంతర ఉగ్రవాదం ఇంకా కొనసాగుతున్నందున ఇకమీదట కూడా మెరుపుదాడులు కొనసాగుతాయా అన్న ప్రశ్నకు ఆయన స్పష్టమైన సమాధానం ఇవ్వకుండా దాటవేశారు. ఇలాంటి విషయాలను మీడియా ముందు చర్చించలేమని అన్నారు.

క్రీడాభూమి

ఐపీఎల్‌కు బుమ్రా దూరం?



న్యూఢిల్లీ, జనవరి 1: ప్రపంచ్ కప్‌ను దృష్టిలో ఉంచుకొని భారత్ ఫాస్ట్ బౌలర్లకు విశ్రాంతి కల్పించాలని టీమిండియా కెప్టెన్ విరాట్‌కోహ్లీ ఇటీవలే బీసీసీఐ పరిపాలక కమిటీ (సీఓఏ) ముందు తన అభిప్రాయాన్ని వెల్లడించాడు. కోహ్లీ సూచన ప్రకారం బోర్డు పెద్దలు కీలకమైన బౌలర్లకు ఐపీఎల్ నుంచి విశ్రాంతి కల్పించాలనే యోచనలో ఉన్నారు. రాబోయే సీజన్‌లో ముంబై ఇండియన్స్ జట్టు బుమ్రా సేవలను కోల్పోయే అవకాశం ఉందనే విషయాన్ని బీసీసీఐ ఉన్నతాధికారి ఒకరు సూత్రప్రాయంగా వెల్లడించారు. ఈ క్రమంలో ఇదే విషయాన్ని బీసీసీఐ ముంబై ఇండియన్స్ యాజమాన్యంతో మాట్లాడనున్నట్లు తెలుస్తోంది. ఒకవేళ బుమ్రా ఫిట్‌గా ఉంటే కేవలం కీలక మ్యాచ్‌లలో ఆడించి, మిగతా మ్యాచ్‌లలో విశ్రాంతి కల్పించే ఆలోచన చేస్తోంది. ఇదిలా ఉంటే ఆస్ట్రేలియా సైతం రానున్న ప్రపంచ కప్, కీలక సిరీస్‌లను దృష్టిలో ఉంచుకొని తమ ఆటగాళ్లకు విశ్రాంతి ఇచ్చిన విషయం తెలిసిందే.

మెల్‌బోర్న్ పిచ్‌కు యావరేజ్ రేటింగ్

మెల్‌బోర్న్, జనవరి 1: ఐసీసీ (ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్) మెల్‌బోర్న్ పిచ్‌కు మంగళవారం యావరేజ్ రేటింగ్ ఇచ్చింది. సిడ్నీ మార్నింగ్ హెరాల్డ్ నివేదిక ప్రకారం పెర్త్ టెస్టు తర్వాత మెల్‌బోర్న్ పిచ్‌కు యావరేజ్ రేటింగ్‌ను ఇవ్వడం విశేషం. మెల్‌బోర్న్‌లో జరిగిన బాక్సింగ్ డే టెస్ట్‌ను భారత్ 137 పరుగుల తేడాతో భారీ విజయాన్ని సాధించిన విషయం తెలిసిందే. గతేడాది యాషెస్ తర్వాత ఇక్కడి పిచ్‌కు 3 డీమెరిట్ పాయింట్లు ఇచ్చింది. గతంతో పోలిస్తే మెల్‌బోర్న్ పిచ్ మెరుగ్గా మారిందని ఐసీసీ పేర్కొంది.

టీ-20 వరల్డ్ కప్ సూపర్ 12లో
శ్రీలంక, బంగ్లాకు దక్కని చోటు

దుబాయ్, జనవరి 1: మాజీ చాంపియన్లు శ్రీలంక, బంగ్లాదేశ్ టీ-20 వరల్డ్ కప్ సూపర్ 12లో చోటు దక్కించుకోలేకపోయాయి. ఇటీవల కాలంలో జరిగిన వివిధ పోటీల్లో తక్కువ ర్యాంకింగ్‌తో నిలవడం వల్లే 2020లో జరిగే వరల్డ్ కప్‌లో స్థానం కోల్పోయాయి. అయితే, గ్రూప్ దశలో పోటీ పడే ఆరు జట్లతో ఆ రెండు జట్లు పోటీపడతాయి. ఈ విషయాన్ని అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) మంగళవారం ఇక్కడ వెల్లడించింది. సూపర్ 12లో చోటు దక్కించుకున్న టీమ్‌లలో భారత్, పాకిస్తాన్, ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్, వెస్టిండీస్, ఆఫ్గనిస్తాన్ అగ్రస్థానాల్లో కొనసాగుతున్నాయి. మాజీ చాంపియన్, మూడుసార్లు ఫైనల్‌లో చోటుదక్కించుకున్న శ్రీలంక, బంగ్లాదేశ్ టోర్నమెంట్‌లో జరిగే గ్రూపు స్టేజీల్లో తొలి నాలుగు స్థానాల కోసం పోటీపడతాయి. వరల్డ్ కప్ టీ-20 పోటీలు 2020 అక్టోబర్ 18 నుంచి నవంబర్ 15వరకు జరుగుతాయి. ఐసీసీ నిబంధనల ప్రకారం టాప్‌లో 8 జట్లు సూపర్ 12లో పోటీపడేందుకు అర్హత సాధించాయి. మిగిలిన జట్లు గ్రూప్ స్టేజీల్లో క్వాలిఫయర్ కోసం తలపడతాయి. గ్రూప్ స్టేజీల్లో మెరుగైన ప్రదర్శన సాధించే నాలుగు జట్లు సూపర్ 12లో చోటు దక్కించుకుంటాయి. ఇదిలా వుండగా, టీ-20 వరల్డ్ కప్ సూపర్ 12లో తమకు చోటు దక్కపోవడం పట్ల శ్రీలంక కెప్టెన్ మలింగ నిరాశ వ్యక్తం చేస్తూ గ్రూప్ స్టేజీల్లో జరిగే పోరులో రాణిస్తామన్నాడు. అదే విధంగా బంగ్లా కెప్టెన్ షాకీబ్ అల్ హసన్ సైతం టీ-20 వరల్డ్ చాంపియన్స్ వెస్టిండీస్‌ను టీ-20 వరల్డ్ కప్‌లో ఇటీవల ఓడించామని, ఇపుడు కూడా గ్రూప్ దశలో మెరుగైన ప్రదర్శనతో తొలి నాలుగు స్థానాల్లో చోటు దక్కించుకుంటామని ధీమా వ్యక్తం చేశాడు.



ఆస్ట్రేలియా ప్రధాని స్కాట్ మొర్రిసన్ అధికారిక నివాసంలో జరిగిన నూతన సంవత్సర వేడుకలకు హాజరైన భారత్, ఆస్ట్రేలియా జట్ల ఆటగాళ్లు

సీఏ కెప్టెన్‌గా కోహ్లీ!

• మరో ముగ్గురు భారత ఆటగాళ్లకు చోటు





మెల్‌బోర్న్, జనవరి 1: ప్రపంచ అత్యుత్తమ బ్యాట్స్‌మెన్లలో ఒక్కడైన కోహ్లీని క్రికెట్ ఆస్ట్రేలియా కెప్టెన్‌గా ప్రకటించింది. 2018 అత్యుత్తమ అంతర్జాతీయ వన్డే జట్టును ప్రకటించిన క్రికెట్ ఆస్ట్రేలియా జట్టులో ఆస్ట్రేలియా క్రికెటర్లు ఎవరికీ చోటు కల్పించకపోవడం గమనార్హం. కోహ్లీతో పాటు మరో ముగ్గురు భారత ఆటగాళ్లకు జట్టులో చోటు కల్పించింది. భారత్ నుంచి రోహిత్ శర్మతో పాటు జస్ప్రీత్ బుమ్రా, కుల్దీప్ యాదవ్‌కు స్థానం లభించింది.

సీఏ జట్టు: విరాట్ కోహ్లీ (కెప్టెన్, భారత్), రోహిత్ శర్మ (భారత్), బెయిర్ స్టో (ఇంగ్లాండ్), హెట్‌మెయిర్ (వెస్టిండీస్), జాస్ బట్లర్ (వికెట్ కీపర్, ఇంగ్లాండ్), తిషారా పెరీరా (శ్రీలంక), రషీద్ ఖాన్ (అఫ్గానిస్తాన్), కుల్దీప్ యాదవ్ (భారత్), ముస్తాఫిజుర్ రెహ్మాన్ (బంగ్లాదేశ్), జస్ప్రీత్ బుమ్రా (భారత్).

టిమ్ పైన్ పిల్లల్ని ఎత్తుకున్న పంత్!



మెల్‌బోర్న్, జనవరి 1: ఆసీస్ కెప్టెన్ టిమ్ పైన్ భార్య బోనీ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన ఓ పోస్ట్ ఇప్పుడు వైరల్ అయింది. పైన్ పిల్లలతో ఒకరిని రిషభ్ పంత్ ఎత్తుకున్న ఫొటోను బోని పోస్టు చేసింది. దానికి 'బెస్ట్ బేబీ సిట్టర్' అని క్యాప్షన్ తగిలించింది. ఆస్ట్రేలియా ప్రధాని స్కాట్ మొర్రిసన్ అధికారిక నివాసంలో ఈ ఫొటోను తీశారు. భారత్- ఆస్ట్రేలియా జట్టు సభ్యులు ఇక్కడే కొత్త సంవత్సరం వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా టిమ్-బోనీ దంపతుల పిల్లల్ని రిషభ్ ఎత్తుకొని ఆడించాడు. మూడో టెస్టు తర్వాత ఇది అందరినీ ఆశ్చర్య పరిచింది. మూడో టెస్టులో రిషభ్ బ్యాటింగ్ చేస్తున్న సమయంలో పైన్ 'నీకు పిల్లల్ని ఆడించడం వచ్చా? నా భార్యతో కలిసి సినిమాకు వెళ్తా.' అంటూ టీజ్ చేయగా, 'పైన్ తాత్కాలిక కెప్టెన్. అతడికి మాట్లాడటమే తెలుసు' అంటూ రిషభ్ బదులు తీర్చుకున్న విషయం తెలిసిందే. అయితే స్లెడ్జింగ్ అనేది మైదానం వరకే పరిమితమంటూ పైన్ పిల్లల్ని ఎత్తుకొని రిషభ్ నిరూపించాడు.

సిడ్నీలో ఆస్ట్రేలియా ప్రాక్టీస్

సిడ్నీ, జనవరి 1: భారత్‌తో మూడో టెస్టులో ఘోర పరాజయం చవిచూసిన ఆస్ట్రేలియా నాలుగో టెస్టులో గెలిచి సిరీస్ సమం చేసేందుకు తీవ్రంగా శ్రమిస్తోంది. జనవరి 3 నుంచి జరిగే టెస్టు కోసం కొత్త సంవత్సరం కూడా మైదానంలో ప్రాక్టీస్‌కు దిగింది. సిడ్నీ మైదానంలో మంగళవారం ఉదయమే కెప్టెన్ టిమ్ పైన్‌తో పాటు నాథన్ లియాన్, ఉస్మాన్ ఖాజా, ఆరోన్ ఫించ్, మార్కస్ హారిస్, పీటర్ హాండ్స్‌కాంబ్, మార్నస్ లాబుసా చాగ్నే ప్రాక్టీస్ సెషన్‌లో పాల్గొన్నారు. లెగ్ స్పిన్నర్ మార్నస్ లాబుసాచాగ్నేను ఈ టెస్ట్‌లో ఆడించాలని క్రికెట్ ఆస్ట్రేలియా భావిస్తోంది. ఓపెనర్ ఆరోన్ ఫించ్ స్థానంలో దింపాలని యోచిస్తోంది. లాబుసా చాగ్నే, ఉస్మాన్ ఖాజా క్వీన్స్‌లాండ్ తరపున ఆడారు. మరోవైపు ఆరోన్ ఫించ్ నెట్స్‌కు హాజరైన ప్రాక్టీస్ చేయలేదు.

ఏఎఫ్‌సీ ఆసియా కప్; భారత్‌కు 50-50 ఛాన్స్

• మాజీ కెప్టెన్ భూటియా

న్యూఢిల్లీ, జనవరి 1: యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)లో ఈనెల 5 నుంచి వచ్చే నెల 2వరకు జరిగే ఏఎఫ్‌సీ ఆసియా కప్ టోర్నమెంట్‌లో భారత్ విజయావకాశాలకు 50-50 ఛాన్స్ ఉందని మాజీ కెప్టెన్ భాయ్‌చుంగ్ భూటియా అభిప్రాయపడ్డాడు. ఖండాంతర టోర్నమెంట్‌లో 'థాయ్‌లాండ్, యూఏఈ, బెహ్రెయిన్‌తో జరిగే గ్రూప్ పోటీల్లో భారత కెప్టెన్ సునీల్ ఛెత్రి నాయకత్వంలో మెరుగైన ప్రదర్శన అందించగలదనే నమ్మకాన్ని వ్యక్తం చేశాడు. భారత్ రెండో రౌండ్‌లో చోటుదక్కించుకునేందుకు 50-50 అవకాశాలు ఉన్నాయని అన్నాడు. జట్టులోని యువకులంతా సమష్టి కృషితో గట్టి పోరాట పటిమను ప్రదర్శిస్తే విజయావకాశాలు దరిచేరవచ్చునని పేర్కొన్నాడు.

ప్రభుత్వ రంగ సంస్థల వాటాల విక్రయం ద్వారా
రికార్డు స్థాయి ఆదాయం

• గత యేడాది అనుభవాలతో వినూత్న పథకాలతో ముందుకు
• రూ. లక్ష కోట్ల మేజిక్ ఫిగర్ వైపు అడుగులు
• నిరర్థక ఆస్తుల విక్రయం ద్వారా నష్టాల్లో ఉన్న సంస్థలను పునరుద్ధరించే సమున్నత ప్రణాళిక
• ప్రధానంగా ఎయిర్ ఇండియా ఆర్థిక పరిపుష్టిపై కేంద్రం దృష్టి

న్యూఢిల్లీ, జనవరి 1: ప్రభుత్వ రంగ సంస్థల్లోని వాటాలను విక్రయించడం ద్వారా గడచిన యేడాది కేంద్ర ప్రభుత్వం 77.417 కోట్ల రూపాయల నిధులను సమీకరించింది. ఇదే రకమైన పెట్టుబడులను వెనక్కు తీసుకునే (డిసిన్వెస్ట్‌మెంట్) కార్యక్రమం కొత్త సంవత్సరంలోనూ కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. జాతీయ విమానయాన సంస్థ ఎయిర్ ఇండియాను ప్రణాళికాబద్ధంగా ప్రైవేటీకరించడం ద్వారా పెట్టుబడి డిసిన్వెస్ట్‌మెంట్ ప్రణాళికను ప్రభుత్వం కొనసాగిస్తుందని భావిస్తున్నారు. గతంలో పాలించిన బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం ఎన్నడూలేనంతగా అత్యధిక సంఖ్యలో ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించింది. అలాగే ప్రస్తుత ప్రభుత్వం సైతం ప్రభుత్వానికి భారంగా మారిన మరికొన్ని సంస్థలను ప్రైవేటుపరం చేసే ప్రణాళికలతో ముందుకెళుతోంది. ఐతే ఇందులోప్రస్తుత మోదీ ప్రభుత్వం ఈ విధానంలో సరికొత్త పంథాను అనుసరిస్తోంది. ఇందులోప్రధానమైంది కంపెనీలు లేదా సంస్థలను విలీనం చేయడం ద్వారా ఆదాయ లక్ష్యాలు సాధించడం. ఇందులో అతిపెద్ద పెట్టుబడులు కలిగిన ఓఎన్‌జీసీలో హెచ్‌పీసీఎల్‌కు భాగస్వామ్యం కల్పించడం, సీపీఎస్‌ఈ ఈటీఎఫ్, భారత్-22 ఈటీఎఫ్‌ల కలయిక, కోల్ ఇండియా వాటాల విక్రయంతోబాటు ఆరు పబ్లిక్ ఇనిషియల్ ఆఫరింగ్స్ (ఐపీఓ) ద్వారా 77,417 కోట్ల రూపాయల ఆదాయాన్ని గత యేడాది ప్రభుత్వం సమీకరించింది. అలాగే ఎయిర్ ఇండియాలోని 74 శాతం వాటాలను విక్రయించాలన్న అతిపెద్ద నిర్ణయాన్ని అమలు చేయడం ఆరంభించింది. ఈక్రమంలో ఎయిరిండియా వాటాల విక్రయానికి సరికొత్త ప్రణాళికను ప్రభుత్వం సిద్ధం చేసింది. ఇందులో భాగంగా ఆ సంస్థకు చెందిన ఎయిరిండియా ఎయిర్ ట్రాన్స్‌పోర్టు లిమిటెడ్ (ఏఐఏటీఎస్‌ఎల్), ఎయిరిండియా ఇంజనీరింగ్ సర్వీసెస్ లిమిటెడ్ (ఏఐఈఎస్‌ఎల్) వంటి అనుబంధ విభాగాలతోబాటు, ఎయిర్ ఇండియాకు చెందిన భూములు, ఇతర ఆస్తులను సైతం ప్రత్యేకంగా అమ్మకాలు జరపాలని నిర్ణయించింది. తద్వారా 29 వేల కోట్ల రూపాయల అప్పుల భారాన్ని ఎయిర్ ఇండియాకు తగ్గించాలన్న సదాశయంతోప్రభుత్వం ముందుకెళుతోంది. అప్పటి వరకు ప్రభుత్వం ఎయిరిండియాకు నిధులు సమకూరుస్తూ ఈ సంస్థ నిలదొక్కుకునేందుకు దోహదం చేయాలని నిర్ణయించింది. నిరర్థక ఆస్తులను విక్రయించి రాబాడికి అనువుగా ఉండే విభాగాల్లో పెట్టుబడులు పెట్టడం ద్వారా సంస్థ ఆర్థిక దృఢత్వానికి తోడ్పడవచ్చున్నది ప్రభుత్వ వ్యూహం. ఎయిర్ ఇండియా అనుబంధ ఆస్తులు, ఇతరత్రా భూములు, భవనాల విక్రయాల ద్వారా తొమ్మిది వేల కోట్లు సమకూరుతాయని ఆ సంస్థ అంచనావేస్తోంది. ఈక్రమంలో నూతన సంవత్సరంలో ఈ సంస్థకు చెందిన విక్రయ ప్రణాళికల్లో తొలుత ప్రభుత్వం 51 శాతం వాటాలు కలిగివున్న హెలికాప్టర్ సేవా విభాగం 'పవన్ హాన్స్' విక్రయ ప్రక్రియ ఆరంభమైంది. అలాగే ఓఎన్‌జీసీలో కూడా ప్రభుత్వం అధిక వాటాలు కలిగివుంది. పవన్ హాన్స్ విక్రయ ప్రక్రియ ఈ యేడాది మార్చి నాటికి పూర్తి చేయాల్సివుంది. అలాగే సుమారు 10 సీపీఎస్‌ఈల వాటాల బైబ్యాక్‌కు కూడా ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో ఓఎన్‌జీసీ, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, ఆయిల్ ఇండియా, ఎన్‌సీఎల్, బీహెచ్‌ఈఎల్, ఎన్‌ఎఎల్‌సీఓ ఉన్నాయి. ఈ బైబ్యాక్ ద్వారా సుమారు 12వేల కోట్ల రూపాయలు సమకూర్చుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. అలాగే సెంట్రల్ పబ్లిక్ సెక్టార్ ఎంటర్‌ప్రైజెస్ (సీపీఎస్‌ఈ) విలీనం, సమీకరణ కార్యక్రమాలు ఈ యేడాది ప్రాధాన్యతను సంతరించుకునే అవకాశాలున్నాయి. అలాగే పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ (పీఎఫ్‌సీ)లో సైతం ప్రభుత్వ వాటాలను రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్ నుంచి సుమారు 15 వేల కోట్ల మేర ఉపసంహరించుకోనుంది. అలాగే 'విలీనం, సమీకరణ' (ఎం అండ్ ఏ) కార్యక్రమం డీల్ సైతం ఎన్‌టీపీసీలో అమలు చేయాలని, ఎస్‌జేవీఎన్‌లోని ఆరు వేల కోట్ల వాటాలను తిరిగి కొనుగోలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ప్రణాళికలను గత యేడాది జనవరిలో జరిగిన ఓఎన్‌జీసీ-హెచ్‌పీసీఎల్ డీల్ తరహాలోనే అమలు చేసేందుకు ప్రభుత్వం పావులు కదుపుతోంది. హెచ్‌పీసీఎల్‌లోని మొత్తం 15.11 శాతం వాటాలు 36,915 కోట్లను ఓఎన్‌జీసీ అప్పట్లో కొనుగోలు చేసింది. ఈ క్రమంలో వచ్చే ఏప్రిల్ నుంచి ఆరంభం కానున్న ఆర్థిక సంవత్సరం నుంచి అమలు చేసే 'డిసిన్వెస్ట్‌మెంట్ ప్లాన్'కు సంబంధించిన బడ్జెట్ లక్ష్యాలను ప్రభుత్వం ఇప్పటికే ఖరారు చేసింది. 2017-18 ఆర్థిక సంవత్సరంలో జరిగిన ఓఎన్‌జీసీ-హెచ్‌పీఎల్ డీల్ అనుభవాలతో పెట్టులను వెనక్కు తీసుకునే ప్రణాళిక ద్వారా నిధుల సమీకరణల్లో లక్ష కోట్ల రూపాయల మ్యాజిక్ ఫిగర్ సాధించేందుకు మార్గం సుగమమైంది. ఇప్పటి వరకు ఇలా 72,500 కోట్ల రూపాయలు సమీకరించగా కొత్త సంవత్సరం 2019 మార్చి నాటికి ఈ మొత్తం 80 వేల కోట్లకు చేరాలన్న లక్ష్యాన్ని ప్రభుత్వం నిర్ధేశించుకుంది. రైల్వే శాఖలోని రెండు సీపీఎస్‌ఈలు ఆర్‌ఐటీఈఎస్, ఐఆర్‌సీఓఎన్ విభాగాల ఐపీఓల ద్వారా గడచిన యేడాది స్టాక్ మార్కెట్లోకి చేరగా, హిందూస్థాన్ ఏరోనాటిక్స్, భారత్ డైనమిక్స్, మిశ్రాధాతు నిగమ్, గార్డన్ రీచ్ షిప్ బిల్డర్స్ అండ్ ఇంజనీర్స్ సంస్థలు సైతం ఇప్పటికే స్టాక్ ఎక్చేంజీల్లోకి అడుగుపెట్టాయి. అయితే ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా నెలకొన్న రాజకీయ అనిశ్చితి నేపథ్యంలో మార్కెట్లకు అంత ఆశాజనకంగా లేదు.





సూచీల్లో నయాసాల్ జోష్

• లాభాలతో యేడాదిని ఆరంభించిన సెన్సెక్స్, నిఫ్టీ

ముంబయి, జనవరి 1: భారతీయ ఈక్విటీ మార్కెట్లు మంగళవారం ఆంగ్ల కొత్త సంవత్సరాదిని సానుకూల వాతావరణంలోనే ఆరంభించాయి. సెన్సెక్స్ బీఎస్సీ బెంచ్ మార్కును దాటి 186 పాయింట్లు లాభపడింది. బ్యాంకింగ్ రంగాన్ని పునరుద్ధరించేందుకు రిజర్వు బ్యాంకు చర్యలు చేపట్టిందన్న వార్తల నేపథ్యంలో బ్యాంకింగ్ స్టాక్స్ లాభాల బాట పట్టాయి. 30 షేర్ల బీఎస్‌ఈ సెన్సెక్స్ మంగళవారం 36,254.57 పాయింట్ల వద్ద ముగిసింది. అలాగే ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ సైతం 47.55 పాయింట్లు లాభపడి 0.44 లాభాలతో 10,910.10 పాయింట్ల ముగిసింది. ఈక్రమంలో ఆర్థిక, టెలికాం, ఐటీ, ఆటో, పార్మా రంగ షేర్లకు డిమాండ్ పెరిగింది. కాగా సెన్సెక్స్ చార్టులో భారతీ ఎయిర్‌టెల్ షేర్లు 2.76 శాతం లాభపడి అగ్రభాగాన నిలిచాయి. తర్వాతి స్థానాల్లో 2.01 లాభాలతో హెచ్‌డీఎఫ్‌సీ, 1.38 శాతం లాభాలతో యెస్ బ్యాంకు నిలిచాయి. అలాగే హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, ఎస్‌బీఐ, ఆక్సిస్, ఐసీఐసీఐ బ్యాంకులతోబాటు, ఇన్ఫోసిస్, హీరోమోటోకార్ప్, టాటా మోటార్స్, సన్‌పార్మా, బజాజ్ ఫైనాన్స్, టీసీఎస్, పవర్‌గ్రిడ్, ఐటీసీ, బజాజ్ ఆటో, మారుతీ, కోల్ ఇండియా, లార్సన్ అండ్ టర్బో, రిలయన్స్ ఇండియా లిమిటెడ్‌లు 1.3 శాతం మేర లాభాలను ఆర్జించాయి. కాగా నష్టాలను చవిచూసిన సంస్థలో మహీంద్రా అండ్ మహీంద్రా, టాటా స్టీల్, ఓఎన్‌జీసీ, హెచ్‌యూఎల్, ఇండస్ ఇండ్ బ్యాంకు, కోటక్ మహీంద్రా బ్యాంకు, ఎన్టీపీసీ, ఆసియన్ పెయింట్స్, వేదాంత, హెచ్‌సీఎల్ టెక్ ఉన్నాయి. దాదాపు 3.75 శాతంమేర ఈ సంస్థలు నష్టపోయాయి. కాగా బ్యాంకింగ్ రంగంలో నిరర్థక ఆస్తులను తగ్గించి నష్టాల బాటలో ఉన్న బ్యాంకుల ఆర్థిక స్థితిని పునరుద్ధరించనున్నామని ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ ప్రకటించడం బ్యాంకింగ్ రంగ షేర్లకు ఊతమిచ్చిందని ఆర్థిక రంగ నిపుణులు విశ్లేషిస్తున్నారు.

వాణిజ్యభూమి

జీఎస్టీ వసూళ్లు తగ్గాయ్

న్యూఢిల్లీ, జనవరి 1: వస్తు సేవల పన్ను (జీఎస్టీ) వసూళ్లు గత నెలలో తగ్గాయి. గడచిన యేడాది డిసెంబర్‌లో మొత్తం 94,726 కోట్ల రూపాయలు వసూలయ్యాయి. గడచిన యేడాది ఇదే కాలంలో రూ.97,637 కోట్లు వసూలైనట్టు అధికార వర్గాలు వెల్లడించాయి. కాగా జీఎస్‌టీఆర్-3బి ద్వారా మొత్తం 72.44 లక్షల సేల్స్ రిటర్న్ ఫైళ్లు గత నెలలో దాఖలయ్యాయి. నవంబర్‌లో దాఖలైన 69.6 లక్షల ఫైళ్ల కంటే ఇది అధికం. కాగా కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ గణాంకాల మేరకు గత నెలలో వసూలైన రూ. 94,726 కోట్లలో సెంట్రల్ జీఎస్టీ (సీజీఎస్‌టీ) ద్వారా 16,442 కోట్లు, స్టేట్ జీఎస్టీ (ఎస్‌జీఎస్‌టీ) ద్వారా 22,459 కోట్లు, ఇంటిగ్రేటెట్ జీఎస్టీ (ఐజీఎస్‌టీ) ద్వారా రూ.47.936 కోట్ల వంతున వసూలయ్యాయి. అలాగే సెస్ రూపేణా రూ.7,888 కోట్లు వసూలయ్యాయి. ప్రభుత్వ నిరంతర సెటిల్మెంట్లు విభాగం ఐజీఎస్‌టీ ద్వారా రూ.18,409 కోట్లమేర సీజీఎస్‌టీ, 14,793 కోట్లమేర ఎస్‌జీఎస్‌టీని కేంద్ర ప్రభుత్వం చెల్లించింది. అలాగే ఎస్‌జీఎస్‌టీగా రూ. 46.252 కోట్లు చెల్లించినట్టు సంబంధిత మంత్రిత్వ శాఖ మంగళవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో వివరించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో గడచిన ఏప్రిల్ నుంచి తొమ్మిది నెలల కాలానికి జీఎస్టీ ద్వారా నెలవారీ లక్ష్యం 1.12 కోట్లతో ప్రభుత్వం మొత్తం రూ.8.71 లక్షల కోట్లు ఆర్జించిందని మంత్రిత్వ శాఖ వివరించింది. కాగా 2018-19 బడ్జెట్‌లో మొత్తం రూ. 13.48 లక్షల కోట్ల జీఎస్టీ రూపేణా వసూలు చేయాలని అంచనా వేయడం జరిగిందని తెలిపింది. 2017 జూలై నుంచి మార్చి 2018 వరకు రూ. 89.885 కోట్లు వసూలయ్యాయని తెలిపింది.

కొనసాగనున్న తగ్గుదల

ఇలావుండగా 23 వస్తువులపై జీఎస్టీ పన్ను రేట్లను తగ్గిస్తూ జీఎస్టీ మండలి తీసుకున్న నిర్ణయం మేరకు కొత్త సంవత్సరం ఆరంభం నుంచే జీఎస్టీ వసూళ్లలో తగ్గుదల కొనసాగుతుందని ఆర్థిక నిపుణులు అంచనావేస్తున్నారు. ప్రస్తుతం 28 వస్తువులు మాత్రమే 28 శాతం అత్యున్నత పన్ను స్లాబ్ రేటు కింద మిగిలాయి. పన్ను సవరణతో ప్రతియేటా జీఎస్టీ వసూళ్ల మొత్తంలో రూ. 5,500 కోట్లు తగ్గుతుంది. అంటే ఈ యేడాది జనవరి నుంచి మార్చి వరకు జీఎస్టీ ఆదాయంలో రూ. 1,375 కోట్ల మేర తగ్గుతుందని ఆర్థిక మంత్రిత్వ శాఖ అంచనా వేసింది. వచ్చే మూడు నెలల కాలానికి జీఎస్టీ వసూళ్లు తగ్గవచ్చని, అలాగే ఎన్‌ఫోర్స్‌మెంట్ చట్టం, దర్యాప్తు కేసులు కూడా పెరుగుతాయని జాతీయ పరోక్ష టాక్స్ లీడర్ పీడబ్ల్యూసీకి చెందిన ప్రతీక్ జైన్ అంచనా వేశారు. ప్రభుత్వం కూడా దాపరికాల్లేని విధానాన్ని జీఎస్టీ విషయంలో వచ్చే యేడాది అనుసరించే అవకాశాలున్నాయని ఆయన అభిప్రాయడ్డారు. కాగా గడచిన యేడాది ఏప్రిల్‌లో రూ.1.03 లక్ష కోట్లు జీఎస్టీ వసూళ్లు జరిగాయి. అలాగే మేలో 94,016 కోట్లు, జూన్‌లో 95,610 కోట్లు, జూలైలో 96,483 కోట్లు, ఆగస్టులో 93,960 కోట్లు, సెప్టెంబర్‌లో 1,00,710 కోట్లు, అక్టోబర్‌లో 97,637 కోట్లు, నవంబర్‌లో 97,637 కోట్ల వంతున జీఎస్టీ వసూళ్లు జరిగినట్టు మంత్రిత్వ శాఖ వెల్లడించింది.

బులియన్

ముంబయిలో

బంగారం (22 క్యారెట్స్)	
1 గ్రాము:	రూ. 3,066.00
8 గ్రాములు:	రూ. 24,528.00
10 గ్రాములు:	రూ. 30,660.00
100 గ్రాములు:	రూ. 3,06,600.00
బంగారం (24 క్యారెట్స్)	
1 గ్రాము:	రూ. 3,279.144
8 గ్రాములు:	రూ. 26,233.152
10 గ్రాములు:	రూ. 32,791.440
100 గ్రాములు:	రూ. 3,27,914.40
వెండి	
8 గ్రాములు:	రూ. 332.20
10 గ్రాములు:	రూ. 415.00
100 గ్రాములు:	రూ. 4.150.00
ఒక కిలో:	రూ. 41,500.00

హైదరాబాద్‌లో

బంగారం (22 క్యారెట్స్)	
1 గ్రాము:	రూ. 3,017.00
8 గ్రాములు:	రూ. 24,136.00
10 గ్రాములు:	రూ. 30.170.00
100 గ్రాములు:	రూ. 3,01,700.00
బంగారం (24 క్యారెట్స్)	
1 గ్రాము:	రూ. 3,226.738
8 గ్రాములు:	రూ. 25,813.904
10 గ్రాములు:	రూ. 32,247.35
100 గ్రాములు:	రూ. 3,22,673.30
వెండి	
8 గ్రాములు:	రూ. 332.20
10 గ్రాములు:	రూ. 415.00
100 గ్రాములు:	రూ. 4.150.00
ఒక కిలో:	రూ. 41,500.00.

యాదాద్రిలో భక్తుల రద్దీ

- కనిపించిన నూతన సంవత్సర సందడి
- క్షేత్ర పాలకుడికి ఆకుపూజోత్సవం
- ఘనంగా శతఘటాభిషేకం.. లక్ష పుష్పార్చన..నిత్యకల్యాణోత్సవం



యాదాద్రి ఘాట్ రోడ్డు మీదుగా కొండపైకి వాహనాల్లో వెళ్తున్న భక్తులు

యాదగిరిగుట్ట, జనవరి 1: యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామివారి ఆలయంలో నూతన సంవత్సరం 2019పురస్కరించుకుని మంగళవారం స్వామివారి దర్శనానికి వచ్చిన భక్తుల రద్దీతో యాదాద్రి కొండ కిటకిటలాడింది. కొండపై వరకు భక్తుల వాహనాల బారులు, క్యూలైన్లలో భక్తుల రద్దీ నెలకొనగా గంటల తరబడిగా భక్తులు స్వామివారి దర్శనం కోసం నిరీక్షించారు. స్వామివారి నిత్యారాధానలు, ఆర్జిత సేవలు శాస్త్రయుక్తంగా సాగాయి. వేకువజామున స్వామివారిని సుప్రభాతంతో మేల్కోలిపి హారతి నివేధన చేశారు. బిందే తీర్థం, బాల భోగంతో ఆలయ నిత్య కైంకర్యాలు ప్రారంభమయ్యాయి. అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడైన ఏకశిఖరవాసుడు, స్తంభోద్భవుడు, పంఛానారసింహుల జన్మనక్షత్రమైన స్వాతి నక్షత్రం పురస్కరించుకుని 108కలశ తీర్థంతో స్వామి, అమ్మవార్లకు వేద మంత్రోచ్ఛరణల మధ్య అష్టోత్తర శతఘటాభిషేకం నిర్వహించారు. సుగంధద్రవ్యాలు, పుణ్యనది జలాలతో కూడిన 108కలశ పూజ అనంతరం స్వామిఅమ్మవార్లకు అష్టోత్తర శతఘటాభిషేకం నిర్వహించారు. తదుపరి ఏకాదశి పర్వదినం పురస్కరించుకుని స్వామి, అమ్మవార్లకు లక్ష పుష్పార్చనను రకరకాల రంగుల పరిమళాలతో కూడిన పుష్పాలతో కన్నుల పండువగా నిర్వహించారు. కల్యాణ మండపంలో స్వామిఅమ్మవార్ల నిత్య కల్యాణోత్సవాన్ని పాంఛరాత్రగమాశాస్రం అనుసారం ఘనంగా నిర్వహించారు. కల్యాణోత్సవానికి ముందు ఆలయంలో వేదమంత్రాలతో విశ్వక్సేనారాధన, పుణ్యాహావచనం, శ్రీ సుదర్శన నారసింహహోమాలను శాస్త్రయుక్తంగా నిర్వహించారు. అనంతరం లక్ష్మీనరసింహులకు గజవాహన సేవోత్సం నిర్వహించారు. బాల ఆలయంలో ఉదయం నుండి సాయంత్రం వరకు కొనసాగిన అష్టోత్తరం, సహస్రనామార్చనలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. సాయంత్రం ఆలయంలో స్వామి, అమ్మవార్లకు వెండి జోడి సేవోత్సవం నిర్వహించారు.



శతఘటాభిషేకంలో ఈవో గీత, ధర్మకర్తలు, అర్చకులు

Printed and Published from Vijayawada by **K.Sudhakar** on behalf of Deccan Chronicle Holdings Limited at Deccan Chronicle Holdings Press, No.C 3 & 4, Patamata, Industrial Estate, Vijayawada. Chief Editor **T.V.Ravi Reddy**, Phones:2555284,2555185,2555287 Regd. No.AP/VJA/41/51/2000. RNI Registration No.52743/90

గంటలోనే శ్రీవారి దర్శనం

తెల్లవారుజామున 2.50 గంటల నుంచే భక్తులకు సర్వ దర్శనం

- నిర్ణీత సమయం కంటే 1.40 గంటల ముందే ప్రారంభం
- గంటలోనే దర్శనంపై సంతృప్తి

తిరుపతి, జనవరి 1: తిరుమల శ్రీవారి ఆలయంలో జనవరి 1వ తేదీ మంగళవారం ఉదయం 2.50 గంటలకు భక్తులకు సర్వదర్శనం ప్రారంభమైంది. నిర్ణీత సమయం కంటే 1.40 గంటల ముందుగా దర్శనం ప్రారంభం కావడంతో భక్తులు సంతృప్తి వ్యక్తం చేశారు. టీటీడీలోని అన్ని విభాగాల అధికారులు సమన్వయం చేసుకుని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా దర్శనం, బస, అన్నప్రసాదాలు తదితర ఏర్పాట్లు చేపట్టారు. కాగా నూతన సంవత్సరం సందర్భంగా శ్రీవారి ఆలయంలో విశేషంగా పుష్పాలంకరణలు, విద్యుద్దీపాలంకరణలు చేపట్టారు. ధ్వజస్తంభం, మహాద్వారం ప్రాంతాల్లో రంగురంగుల పుష్పాలతో అలంకరించారు. తిరుమలలో ముఖ్య కూడళ్లలో పుష్పాలతో అలంకరణ చేశారు. గంటలో శ్రీవారి దర్శనం కావడంతో భక్తుల ఆనందంతో సంతోషం వ్యక్తం చేశారు.

తిరుమల నంబి చెంతకు శ్రీ మలయప్ప స్వామివారు

తిరుమల శ్రీవారి ఆలయంలో శ్రీదేవీ, భూదేవీ సమేత శ్రీ మలయప్ప స్వామివారు మంగళవారం సాయంత్రం సహస్రదీపాలంకార సేవ అనంతరం శ్రీ తిరుమలనంబి ఆలయం చెంతకు వేంచేపు చేశారు. ప్రతి ఏడాది తన్నీరముద ఉత్సవం మరుసటి రోజు ఈ కార్యక్రమం నిర్వహించడం ఆనవాయితీ. ఈ సందర్భంగా తిరుమలనండి వారికి మేల్ చాట్ శేషవస్త్రాన్ని సమర్పించారు. శ్రీ వైష్ణవ భక్తాగ్రేసరుడు, శ్రీ వేంకటేశ్వర స్వామివారి సేవలో తన జీవితాన్ని అర్పించిన మహనీయుడు శ్రీ తిరుమలనంబి. పౌరాణిక ప్రాశస్త్యం మేరకు శ్రీ తిరుమలనంబి క్రీ.శ.973వ సంవత్సరంలో పవిత్ర పురటాసి మాసంలో అనురాధ నక్షత్రంలో జన్మించారు. వీరు సాక్షాత్తు శ్రీ భగవత్ రామానుజాచార్యుల వారికి మేనమామ. ప్రతి రోజూ పాపవినాశతీర్థం నుంచి కుండలో నీరు తీసుకొచ్చి శ్రీవారి ఆలయంలో స్వామివారికి దైనందిన పాదపూజ నిర్వహించేవారు. ఒక రోజు తిరుమలనంబి యధాప్రకారం స్వామివారి సేవ కోసం పాపవినాశనం నుంచి జలాన్ని కుండలో మోసుకుని వస్తుండగా సాక్షాత్తు శ్రీవేంకటేశ్వర స్వామి వేటగాని రూపంలో వచ్చి నంబిని తాతా అని పిలుస్తూ దాహం తీర్చుకోవడానికి ఆ బిందెలోని నీటి కోరాడు. తిరుమలనంబి ఇవ్వకపోవడంతో బిందెకు రంధ్రం చేసి ఆ నీటిని తాగి సంతృప్తి చెందాడు. దీంతో ఆవేధనకు గురైన తిరుమల నంబిని ఓదార్చడానికి స్వామివారు కొండపై బాణం వేసి అందులో నుంచి తీయని పానీయం వచ్చేలాగా చేశాడు. నంబిని ఉద్దేశించి స్వామి మాట్లాడుతూ ఇకపై ఈ తీర్థ జలాన్నే నా సేవకు ఉపయోగించాలని పలికి అంతర్థానమయ్యారు. అప్పుడు తనకు ప్రత్యక్షమైన వ్యక్తి సాక్షాత్తు శ్రీ వేంకటేశ్వర స్వామివారేనని గుర్తించి తిరుమలనంబి ఆనందించాడు. అప్పటి నుంచి ఈ తీర్థానికి ఆకాశగంగ అనే పేరు వచ్చింది. ఇప్పటికీ ఆకాశగంగ తీర్థాన్నే శ్రీవారి సేవల కోసం వినియోగిస్తున్నారు.



తిరుమల సన్నిధిలో బారులు తీరిన భక్తులు

29శాతం వృద్ధి రేటు సాధించిన విశాఖ స్టీల్ ప్లాంట్

- రూ.14,687 కోట్లకు చేరిన టర్నోవర్
- గణాంకాలు వెల్లడించిన సీఎండీ రథ్



డైరీని ఆవిష్కరిస్తున్న స్టీల్‌ప్లాంట్ సీఎండీ పీకే రథ్

ఆంధ్రభూమి బ్యూరో

విశాఖపట్నం, జనవరి 1: విశాఖ ఉక్కు కార్మాగారం గణనీయమైన ప్రగతి దిశగా నడుస్తోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.14,687 కోట్ల టర్నోవర్ సాధించి 29 శాతం వృద్ధి రేటును నమోదు చేసుకుంది. గత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకూ ఉక్కు టర్నోవర్ రూ.11,395 కోట్లు. ఉక్కు విక్రయాల్లో కూడా కర్మాగారం ఇదే ప్రగతి కనబరచింది. గతేడాది వృద్ధి రేటుతో కంటే 8 శాతం మెరుగుపరచుకుందని సీఎండీ పీకే రథ్ పేర్కొన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా సంస్థ కార్పొరేట్ కమ్యూనికేషన్స్ విభాగంలో అన్ని విభాగాల ఉన్నతాధికారులతో మంగళవారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హాట్ మెటల్ ఉత్పత్తిలో 18 శాతం, ద్రవ ఉక్కు ఉత్పత్తిలో 16 శాతం, సేలబుల్ స్టీల్‌లో 15 శాతం వృద్ధి రేటు నమోదు చేసుకున్నట్టు ప్రకటించారు. ఉక్కు నిర్వహణలో కూడా గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 20శాతం వృద్ధి రేటు నమోదైందన్నారు. సరికొత్త సాంకేతిక పరిజ్ఞానం, సామర్థ్య పెంపుతో లక్ష్యాలు అందిపుచ్చుకుంటున్నట్టు తెలిపారు. విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం పెంపు, ముడి సరుకుల నిర్వహణలో సామర్థ్యాన్ని సమర్థవంతంగా వినియోగించుకుంటున్నామన్నారు. హాట్ మెటర్ ఉత్పత్తిలో బ్లాస్ట్ ఫర్నేస్‌లో ఉపయోగించే పల్వరైజ్డ్ కోల్ ఇంజక్షన్ (పీసీఐ)ను మెరుగుపరచుకోవడం ద్వారా వృధా వ్యయాన్ని గణనీయంగా నియంత్రించుకోగలిగామన్నారు. ఒక టన్ను ముడి సరుకుతో 100కిలోల ఉక్కు ఉత్పత్తి సాధించడం ద్వారా దాదాపు రూ.1,500 కోట్లు ఆదా చేయగలిగామన్నారు. నాలుగవ త్రైమాసికంలో మరింగా పనితీరు మెరుగుపరచుకుని బ్లాస్ట్ ఫర్నేస్, స్టీల్ మెల్టింగ్ షాప్ ద్వారా మంచి ఫలితాలు రాబడతారని ఆశాభావం వ్యక్తం చేశారు. సిబ్బంది, అధికారుల సామర్థ్యం, అంకిత భావంతోనే విశాఖ ఉక్కు అనేక సవాళ్లను ఎదుర్కొని మంచి ఫలితాలు సాధించారన్నారు. అంతకు ముందు కార్పొరేట్ కమ్యూనికేషన్స్ విభాగం ఆధ్వర్యంలో 2019 డైరీ ఆవిష్కరించారు. కార్యక్రమంలో డైరెక్టర్ (కమర్షియల్) రాయ్ చౌదురి, డైరెక్టర్ (పర్సనల్) కేసీ దాస్, డైరెక్టర్ (ఫైనాన్స్) వీవీ వేణుగోపాల్‌తో పాటు ఎగ్జిక్యూటివ్ అసోసియేట్స్, యూనియన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

CMYK

మాతృభూమి

పర స్త్రీలను తల్లులుగా
పర ధనమును మట్టివోలె భావించుటయే
పరమోన్నత సంస్కారము
సరళముగా పొందగల్గు సాయుజ్యమిదే

ఆంధ్రభూమి

బుధవారం, 2 జనవరి 2019

ఆరోగ్యమైన కళ్ల కోసం..

★ బేబీ ఆయిల్‌ని కళ్ల చుట్టూ సున్నితంగా మసాజ్ చేస్తే ఒత్తిడి తగ్గి రిలీఫ్ లభిస్తుంది.

★ కొబ్బరి నూనె చుక్కల్ని కళ్ల చుట్టూ వలయాకారంలో రాసి నెమ్మదిగా మసాజ్ చేస్తే కళ్ల కింద నలుపు తగ్గుముఖం పడుతుంది.

★ కనురెప్పలు దట్టంగా పెరగాలంటే క్రమం తప్పకుండా ప్రతిరోజూ రాత్రి పడుకునే ముందు కనురెప్పలకి ఆముదం రాయాలి.

★ టొమాటో రసాన్ని, నిమ్మరసాన్ని సమపాళ్లలో కలిపి కళ్లచుట్టూ పూయాలి. అరగంట తరువాత గోరువెచ్చని నీటితో కడిగేస్తే కళ్ల కింద నలుపు తగ్గడమే కాకుండా ఒత్తిడి నుంచి విముక్తి లభిస్తుంది. ఈ మిశ్రమం రోజు విడిచి రోజు పూస్తే మంచి ఫలితం ఉంటుంది.

★ కీరాను చక్రాల్లా కోసం ఐదు నిముషాలు కళ్లమీద ఉంచినా కళ్లు తాజాగా ఉంటాయి.

★ ప్రతిరోజూ ఏడు నుంచి ఎనిమిది గంటలు నిద్రపోవడం వల్ల కళ్లు అందంగా, ఆరోగ్యంగా ఉంటాయి.



పుడ్డింగ్‌ల ప్రత్యేకం

పిల్లలకు కానీ, పెద్దలకు కానీ కేకుల కంటే ఇష్టమైనవి ఏవైనా ఉన్నాయంటే అవి పుడ్డింగ్సే.. పండ్లు, వాటి ఎసెన్స్‌తో తయారుచేసే పుడ్డింగ్‌లు ఆరోగ్యానికి మంచివి.. వేడుకలకు కేవలం కేకులే కాకుండా పుడ్డింగులను కూడా ఇంట్లో ట్రై చేస్తే చాలా రుచిగా కుదురుతాయి. మరి ఒకసారి ప్రయత్నిద్దామా..

చాక్లెట్ ఆల్మండ్ పుడ్డింగ్



కావలసిన పదార్థాలు

క్యాస్టర్ షుగర్: 150 గ్రాములు
ఉప్పులేని వెన్న: 150 గ్రాములు
కోడిగుడ్లు: మూడు
బాదం పొడి: 100 గ్రాములు
మైదా: 70 గ్రాములు
చాక్లెట్ పొడి: 40 గ్రాములు
బేకింగ్ పొడి: 15 గ్రాములు
పాలు: 60 ఎం.ఎల్.
డార్క్ చాక్లెట్ చిప్స్: 70 గ్రాములు
బటర్ కాగితం: ఒకటి

తయారుచేసే విధానం

ఓవెన్‌ను నూట అరవై అయిదు డిగ్రీల ఉష్ణోగ్రతలో ముందుగా వేడిచేసి పెట్టుకోవాలి. మిశ్రమం ఉంచే పాత్ర లోపల బటర్ పేపర్‌ను రాయాలి. ఇప్పుడు మైదా, చాక్లెట్ పొడిని జల్లించి పెట్టుకోవాలి క్యాస్టర్ షుగర్, వెన్నను ఓ పాత్రలోకి తీసుకుని చెక్క చెంచాతో బాగా గిలక్కొట్టినట్లు చేయాలి.

ఇందులో కోడిగుడ్ల సొనను ఒకేసారి వేసేయాలి. మైదా, చాక్లెట్ చిప్స్, బేకింగ్ పొడి, చాక్లెట్ పొడి, బాదాం పొడి వేస్తూ ఉండలు కట్టకుండా కలపాలి. చివరగా పాలు చేర్చాలి. దీన్ని కేక్ టిన్‌లోకి తీసుకుని నీళ్లు పోసిన బేకింగ్ ట్రేలో ఉంచి నలభై నుంచి యాభై నిముషాల దాకా బేక్ చేయాల్సి ఉంటుంది. దీన్ని వెనిల్లా ఐస్‌క్రీంతో కలిపి తింటే సూపర్‌గా ఉంటుంది.

ఫ్లోర్‌లెస్ కేక్ పుడ్డింగ్



కావలసిన పదార్థాలు

చాక్లెట్ ముక్కలు: రెండున్నర కప్పులు
ఉప్పు కలపని వెన్న: ఒక కప్పు
గుడ్లు: ఐదు
పంచదార: కప్పు
వెనిల్లా ఎసెన్స్: రెండు స్పూన్లు
ఉప్పు: పావు చెంచా
చాక్లెట్ పొడి: అరకప్పు

తయారుచేసే విధానం

ముందుగా ఓవెన్‌ని 300 డిగ్రీల ఉష్ణోగ్రతలో వేడి చేసుకోవాలి. కేక్ పాన్ అడుగున కొద్దిగా వెన్న రాయాలి. దానిపై కొద్దిగా చాక్లెట్ పొడిని చల్లాలి. ఇప్పుడు చాక్లెట్ ముక్కలు, వెన్నను ఓ గిన్నెలో తీసుకుని ఓవెన్‌లో కాసేపు ఉంచి కరిగించాలి. తరువాత తీసేసి చల్లారనిచ్చి అందులో గుడ్లసొన, పంచదార, వెనిల్లా, ఉప్పు, రెండు టేబుల్ స్పూన్ల నీళ్లూ కలపాలి. ఇది మెత్తగా అయ్యేవరకు మిక్సీలో వేసి తిప్పాలి. ఇందులో చాక్లెట్‌పొడి కలిపి మరోసారి గిలక్కొట్టాలి. ఈ మిశ్రమాన్ని పాన్‌లో ఉంచి నలభై అయిదు నిముషాలసేపు బేక్ చేసి తీసేయాలి. తరువాత కూడా అరగంట సేపు పూర్తిగా చల్లారేవరకు బయట ఉంచి కేక్‌ను బయటకు తీసి ఫ్రిజ్‌లో ఉంచాలి. చల్లారిన తరువాత తినాలి.

మొకా ఫడ్జ్ పుడ్డింగ్



కావలసిన పదార్థాలు

చాక్లెట్ క్రీం బిస్కెట్లు: పది
క్రీం చీజ్: కప్పు
పంచదార: పావు కప్పు
పాలు: రెండు కప్పులు
ఇన్‌స్టంట్ కాఫీ పొడి: రెండు స్పూన్లు
చాక్లెట్ పుడ్డింగ్ మిక్స్: ఒక ప్యాకెట్

తయారుచేసే విధానం

చాక్లెట్ క్రీం బిస్కెట్లను మరీ మెత్తగా కాకుండా పొడి చేసుకోవాలి. క్రీం చీజ్‌ని బాగా గిలక్కొట్టి పంచదార వేసి కలపాలి. కాఫీపొడిని రెండు టేబుల్ స్పూన్ల పాలల్లో నానబెట్టుకోవాలి. మిగిలిన పాలలో పుడింగ్ మిశ్రమాన్ని వేసి బాగా కలిపి పదినిముషాలు ఫ్రిజ్‌లో ఉంచేయాలి. ఇప్పుడు బిస్కెట్ల పొడిని ఓ గ్లాసులో పావు వంతు వరకూ తీసుకోవాలి. దానిపై క్రీం చీజ్ వేయాలి. దానిపై కొద్దిగా పాలల్లో నానబెట్టిన కాఫీపొడి, పుడింగ్ మిశ్రమాన్ని వేయాలి. ఇలా మూడు వరుసల్లో వచ్చేలా ఒక్కో పదార్థాన్ని వేసుకుని ఫ్రిజ్‌లో ఉంచాలి. చల్లగా అయ్యాక తినాలి. పిల్లలు ఎంతగానో ఇష్టపడే మొకా ఫడ్జ్ పుడ్డింగ్ తయారు.



ఆపిల్ పుడ్డింగ్

కావలసిన పదార్థాలు

ఆపిల్స్: నాలుగు
పంచదార: అరకప్పు
గుడ్లు: నాలుగు
మైదా: రెండు టేబుల్ స్పూన్లు
కస్టర్డ్ పౌడర్: రెండు టేబుల్ స్పూన్లు
ఐసింగ్ షుగర్: కొద్దిగా

తయారుచేసే విధానం

ముందుగా ఓవెన్‌ని 180 డిగ్రీల ఉష్ణోగ్రతలో వేడిచేసుకుని పెట్టుకోవాలి. ఆపిల్ ముక్కలు, పావుకప్పు పంచదార, రెండు టేబుల్ స్పూన్ల చల్లని నీళ్లు ఓ గిన్నెలో తీసుకుని స్టవ్‌పైన ఉంచాలి. పంచదార కరిగి ఆపిల్ ముక్కలు మెత్తగా అయ్యాక దింపేయాలి. గుడ్లను గిలక్కొట్టి మిగిలిన పంచదారను వేసి మరోసారి కలపాలి. ఇందులో మైదా, కస్టర్డ్ పౌడర్ వేసి మరోసారి కలిపి ఆపిల్ మిశ్రమంపై వేసి ఇరవై నిముషాలు బేక్ చేసుకుని తీసుకోవాలి. దీనిపై ఐసింగ్ షుగర్ వేస్తే చాలు.. టేస్టీ టేస్టీ ఆపిల్ పుడ్డింగ్ రెడీ..

ఆరెంజ్ పుడ్డింగ్



కావలసిన పదార్థాలు

కమలా(ఆరెంజ్)తొక్కల పొడి: రెండు స్పూన్లు
వెన్న: 200 గ్రాములు
పంచదార పొడి: ఒకటిన్నర కప్పులు
గుడ్లు: మూడు
మైదా: ఒకటిన్నర కప్పులు
పాలు: అరకప్పు
ఆరెంజ్ జ్యూస్: పావు కప్పు
కమలాలు: రెండు

తయారుచేసే విధానం

ముందుగా కమలాలను తొనలను ఒలిచి పెట్టుకోవాలి. వెన్న, ఒక కప్పు పంచదార పొడి, కమలాతొక్కల పొడిని వేసి గిలక్కొట్టాలి. ఇందులో కోడిగుడ్లను వేసి బాగా గిలక్కొట్టాలి. అలాగే మైదాపిండిని కూడా వేసి బీట్ చేయాలి. తరువాత దీనిలో పాలు పోసి కలపాలి. పుడ్డింగ్ వండే గిన్నెలో అడుగున బేకింగ్ పేపర్ పరిచి, నెమ్మదిగా పుడ్డింగ్ మిశ్రమాన్ని పోసి వెడల్పాటి పాన్‌లో పెట్టి మూతపెట్టాలి. పుడ్డింగ్ గిన్నె సగం మునిగే వరకూ పాన్‌లో వేడినీళ్లు పోసి మూతపెట్టి స్టవ్‌పై పెట్టాలి. నీళ్లు మరిగాక సిమ్‌లో పెట్టి ఒకటిన్నర గంటల పాటు దీన్ని ఉడికించాలి. ఓ గిన్నెలో మిగిలిన పంచదార, ఆరెంజ్ జ్యూస్ వేసి రెండు, మూడు నిముషాల పాటు మరిగించి సిమ్‌లో ఐదునిముషాలు ఉంచి తీసి ఒలిచిన కమలా తొనలు వేయాలి. స్టవ్ ఆఫ్ చేశాక పది నిముషాలు చల్లారనిచ్చి పుడ్డింగ్ బయటకు తీసి ప్లేటులో పెట్టి ఆరెంజ్ జ్యూస్ మిశ్రమం దానిమీదుగా పోసి వడ్డించాలి.

ధనుర్మాస వైభవం



వేకువ జామునే ప్రతి ఇంటి ముంగిట కల్లాపి జిల్లి రంగు రంగుల రంగవల్లికలు దిద్ది ఆపై పేడతో రూపొందించిన గొబ్బెమ్మలు పెట్టి పసుపుపచ్చని తంగేడుపూలు అలంకరించి కన్నెపిల్లలు గొబ్బి పాటలతో, తప్పెటలతో చుట్టూ తిరుగుతూంటే ధనుర్మాసం ప్రవేశించిందని అర్థం. ఆ సమయంలో జియ్యరులు తలపై అక్షయపాత్రతో చిందులు వేస్తూ ప్రతి ఇంటి ముందర సందడిచెయ్యడం, జంగమయ్యలు గంటం తిప్పుతూ పాటలు పల్లవించడం ధనుర్మాసానికి స్వాగతించినట్లు సంకేతంగా నిలుస్తాయి.

ఈ దృశ్యాలు దశాబ్దలకుముందు పల్లెలలో, పట్టణాల్లో కనువిందు చేసే కమ్మని దృశ్యాలు. మన సంస్కృతికి నిలువుటద్దాలు. భారతీయ సంస్కృతిలో ఒకవైపు ఆధ్యాత్మిక జ్ఞాన సంపత్తి, మరొకవైపు భౌతిక జీవన మాధుర్యాన్ని అందించే అద్భుతాలు సమ్మిళితమై ఉంటాయి. అన్నివర్గాలవారి అభిరుచులు, ఆప్యాయతలు పెనవేసుకుని ఉల్లాస, ఉత్సాహాలకు వెల్లివిరుస్తాయి..

ఈ పర్వాలు, పండుగలు జ్యోతిష శాస్త్రపరంగా, తిథి, నక్షత్ర, ఋతువులను, గ్రహసంచారాన్ని ఆధారంచేసుకుని మన ప్రాచీన ఋషులు నిర్ణయించారు. ఏసమయంలో ఏఏ పర్వాలు, పండుగలు నిర్వహించాలో సవివరంగా చెప్పారు. అటువంటి పర్వాలలో 'ధనుర్మాసం' ముఖ్యమైనది.

ఆధునిక కాలంలో పట్టణాలు, నగరాలలోని ప్రజలు అపార్టుమెంట్ సంస్కృతికి, పాశ్చాత్య నాగరికతకు అలవడ్డం చేత ఈ చక్కని సమైక్య జీవన మాధుర్యాన్నిఅనుభవించలేని దుర్గతి ప్రాప్తమైంది. ఇప్పటికీ పల్లె ప్రాంతాల్లో ఈ సంస్కృతి సంప్రదాయాలు మసకబారిపోకుండా ఉండడం మన అదృష్టం. పండుగలు, వాటి వైభవాలు, వాటి వెనుక గల ఆధ్యాత్మిక విలువలు తెలుసుకోవాలన్న జిజ్ఞాస ఉంటే ఈ మాసంలో గ్రామాలను దర్శించాలి.

'మాసానాం మార్గశీర్షోహం' అన్నాడు గీతాచార్యుడు. శ్రీకృష్ణపరమాత్మ మార్గశీర్షమాసం స్వరూపాన్ని తానే అనడంలోనే ఎంతో విశేషముంది. ఈ మాసం ఎంతో పవిత్రమైనదని, ఎంతో మహిమాన్వితమైనదని ఆ మాటల్లో నిక్షిప్తమయ్యాయి. జ్యోతిషశాస్త్ర రీత్యా రవి సంచారంతో ఈ మాసం ముడిపడి ఉంది. రవి మేషాది ద్వాదశ రాశుల్లో ఒక్కొక్క మాసం ఒక్కొక్క రాశిలో నివాసం ఉంటాడు. రవి ధనుస్సురాశిలో ప్రవేశించినప్పటినుండి తిరిగి మకరరాశిలో (మకర సంక్రాంతి ముందురోజు భోగి పండుగ నాడు) ప్రవేశించేవరకు ధనుర్మాసంగా పరిగణనను పొందింది.

కార్తికమాసం ప్రధానంగా శివపరంగా ఖ్యాతినార్జించుకుంది. మార్గశిర పుష్యమాసాలలో ఉండే ధనుర్మాసం శ్రీమహావిష్ణువుకు, అతని అనపాయినియైన లక్ష్మీదేవికి ఎంతో ప్రియం. విష్ణు సంబంధిత పర్వాలన్నీ ధనుర్మాసంలో సంభవించడం విశేషం. మార్గశిర గురు (లక్ష్మీ) వారాలలో ముత్తైదువలు లక్ష్మీపూజలు చేస్తారు. విశాఖపట్నంలోని శ్రీ కనకమహాలక్ష్మికి మార్గశిర మాసోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తారు.

ఇవి ఒక ఎత్తైతే ధనుర్మాసం వైష్ణవ సంప్రదాయంలో ప్రత్యేకమైనది. ధనుర్మాసవ్రతం పలు వైష్ణవ కుటుంబాల్లో ఆచరిస్తారు. శ్రీమహావిష్ణువును 'మధుసూదనుడు' అను పేర నెల రోజులపాటు షోడశోపచారాలతో అర్చిస్తారు. ఈ వ్రతం ఆచరించడంవల్ల శ్రీమహావిష్ణువు అనుగ్రహం లభిస్తుందని భక్తుల నమ్మకం.

ధనుర్మాసంలోనే గోదాదేవి శ్రీరంగనాథుని భర్తగా పొందగోరి మార్గళి వ్రతాన్ని ఆచరించింది. స్నాన వ్రతమని, శ్రీవ్రతమని వ్యవహరించే ఈవ్రతాన్ని, ద్వాపరయుగంలో గోపికలు ఆచరించిన కాత్యాయినీ వ్రతంవలె వేకువనే లేచి తనను తాను గొల్లపడుచుగా భావించుకుని, తానున్న విల్లిపుత్తూరును వ్రేపల్లెగా, గొల్లకట్టుతో, గొల్లకొప్పుతో రంగనాథుని రోజుకొక పాశురము రచించి, దానిని మధురంగా గానం చేస్తూ, వాఙ్మయికగా శ్రీరంగనాథునికి అర్పించింది. మాసం పాటు ప్రతిరోజు పాడిన పాశురాలు తమిళ వాఙ్మయంలో అత్యంత ప్రసిద్ధి పొందడమేకాక, తమిళుల 'నాలాయిరం' గ్రంథంలో చోటుచేసుకున్నాయి. ఈ ముప్పది పాశురాల గ్రంథం 'తిరుప్పావై' అన్న పేరును సంతరించుకుంది. ఇది దివ్య ప్రబంధమని పండితులు పేర్కొంటారు. ధనుర్మాసం కడపటిరోజున (భోగినాడు) గోదా రంగనాథుల కల్యాణం వైష్ణవాలయాల్లో దివ్యంగా జరుగుతుంది.



అదేవిధంగా ధనుర్మాసంలో 'తిరుప్పావై' వలె, మాణిక్యవాచకులు పాడిన 'తిరువెంబావై' పాటలు పరమశివుని నాయకునిగా భావించి భక్తి శృంగారములు మేళవించినవి అని కంచి మహాస్వామి వారన్నారు.

'తిరుప్పావై' పాశురాలను వైష్ణవ దేవాలయాలలో సుప్రభాత సమయంలో గానం చేస్తే, 'తిరువెంబావై' పాటలను శివాలయాల్లో సుప్రభాత సమయంలో గానం చేయడం ధనుర్మాసంలోని ప్రత్యేకత.


శైవ, వైష్ణవ దేవాలయాల్లో 'తిరువెంబావై', 'తిరుప్పావై' పాటలను ఉషఃకాలంలో ధనుర్మాసమంతా అందరూ గానం చేయాలని కంచి మహాస్వామి వారు పలు సభల్లో ప్రజలకు విజ్ఞప్తి చేసేవారు.

ధనుర్మాసవ్రతమును ముత్తైదువులు 'మార్గళి'వ్రతాన్ని కన్నెపిల్లలు, తెలుగు ప్రాంతాల్లో మార్గశిర లక్ష్మీవారపు నోములు ఆచరిస్తూ ధన్యత పొందుతున్నారు. ఆరోగ్యరీత్యా వేకువన స్నానం చేయడం, ఆయా వ్రతాల్లో చెప్పినవిధంగా చేసిన నివేదనలు మంచి ఆరోగ్యాన్ని ప్రస్తావిస్తాయని ఆయుర్వేద శాస్త్రం అంటున్నది.

అత్యంత పవిత్రమైన, భక్తిదాయకమైన ధనుర్మాసంలో శివకేశవుల ఆరాధన శ్రేయోదాయకం, మోక్షదాయకం.

-ఏ. సీతారామారావు 89787 99864

రంగవల్లి



సరిచుక్కలు
22 చుక్కలు
2 వరుసలు
2 నిలువు

ఎం.శేషమ్మ,
ఇందుకూరుపేట
(నెల్లూరు జిల్లా)

ముగ్గులకు ఆహ్వానం

నింగిలోని హరివిల్లులను నేలపైన పేర్చి.. కనులకింపైన రంగుల్ని అందంగా అద్దితే అది రంగుల మాలికవుతుంది. ముంగిట్లో రంగవల్లిక అవుతుంది. ధనుర్మాసం సందర్భంగా తెలుగు ముంగిళ్లలో రంగవల్లులను తీర్చిదిద్దడం ఆనవాయితీ.. ఆ సందర్భంగా ముగ్గులకు ఆహ్వానం పలుకుతోంది మాతృభూమి. ఆసక్తి కలవారు కింది చిరునామాకు ముగ్గులను పంపగలరు.

సూచనలు

★ ముగ్గులను పంపేవారు ఎ4 సైజు తెల్లకాగితంపై వేయాలి.

★ ముందుగా నల్లని ఇంక్‌తో ఔట్ లైన్ గీసిన తరువాత అందులో రంగుల్ని నింపాలి.

★ ఎన్ని చుక్కలను పెట్టి ముగ్గులు వేశారో.. అంటే సరిచుక్కలా, బేసి చుక్కలా, సంధు చుక్కలా.. అనే విషయం స్పష్టంగా రాయాలి.

★ ముగ్గుతో పాటు, మీ పాస్‌పోర్ట్ సైజు కలర్ ఫొటోని, చిరునామాని జతచేయాలి.

★ డౌన్‌లోడ్ చేసిన ముగ్గులు కాక, స్వయంగా చేతితో వేసిన ముగ్గులనే పంపాలి. అదీ చుక్కల ముగ్గులకే ఆహ్వానం.

ముగ్గులు పంపాల్సిన చిరునామా:
ఎడిటర్,
ఆంధ్రభూమి దినపత్రిక, సరోజినీదేవి రోడ్,
సికింద్రాబాద్- 500 003.

కర్మభూమి

రచనో, చిత్రమొ నాట్యమొ
రుచి పెంచెడి కర్మమొకటె ఋుతమై నిలుచున్
శుచియౌ ప్రేరణ నొసగుచు
కాచుచుఁబ్రోచుచు మనుజుల కాంక్షలు తీర్చున్

ఆంధ్రభూమి బుధవారం, 2 జనవరి 2019

శ్రీనరసింహ శతకము

సీ. లోకమందెవఁడైన లోభి మానవుఁడున్న
భిక్షమర్థికి (జేతఁ బెట్టఁ లేడు
తాను బెట్టక యున్న దగవు పుట్టదు గాని
యొరులుపెట్టఁగఁ జూచి యోర్వలేఁడు
దాత దగ్గఱఁ జేరి తనముల్లె చెడునట్లు
చిహ్వతోఁ జాడీలు చెప్పుచుండు
ఫలము విఘ్నంబైన బలుసంతసంబంధి
మేలు గల్గినఁ జాల మిడుకుచుండు
తే. శ్రీరమానాథ! యిటువంటి క్రూరునకును
భిక్షుకుల శత్రునని పేరు పెట్టవచ్చు
భూషణ వికాస! శ్రీధర్మపుర నివాస!
దుష్టసంహార ! నరసింహ!దురితదూర!

భావం: ఓ నరసింహప్రభూ! ఈ లోకంలో పిసినారి యాచకులకేమీ ఇవ్వరు. తానుపెట్టకపోతే విచారించపనిలేదు. కానీ ఇతరులు దానం చేస్తే చూచి సహించలేక దాత పంచచేరి లేనిపోనివి చెప్పి ఇవ్వబోయే దానాన్ని చెడగొట్టుతారు. యాచకులపై చాడీలు చెబుతారు. ఇవ్వబోయేవారు ఇవ్వకుండా ఉంటే ఎంతోసంతోషపడుతారు. ఇతరులకు మంచి జరిగితే ఎంతో బాధపడుతారు.

అనంతం



25 -గోపరాజు నాగేశ్వరరావు

ఏది ఏమైనా తనిప్పుడు ఇంటికి వెళ్లాలి. వెళ్లి తీరాలి. పెట్టె బేడ సర్దుకొని వెళ్లి ఇకపై తన 'ఆల్మకాం' గరుడాచలం దగ్గర పెట్టాలి. గరుడాచలమే రమ్మన్నాడు.

సుఖంగా బ్రతికే మార్గం అతను చూపిస్తున్నపుడు గూడెం గుడిసెలో హీనంగా వుండటం ఎందుకూ?


గరుడాచలంతోనే వుండాలన్న నిర్ణయానికి అప్పటికే వచ్చాడు రాగ్యా.

త్వరత్వరగా నడుస్తూ ఇంటికి చేరాడు.

కాళీచరణ్ ఇంట్లో లేడు.

తలమీది గాయం నెప్పి పుడుతున్నది. వొళ్ళు సలుపు తీస్తున్నది. జ్వరం వచ్చేట్టుంది. నీరసంగా వుంది.

కొంచెంసేపు విశ్రాంతి తీసుకొని ఓపిక రాగానే గరుడాచలం దగ్గరికి వెళ్ళాలనుకున్నాడు.



క్రింద చాప పరచుకొని పడుకున్నాడు రాగ్యా.

తీవ్రంగా మానసిక ఒత్తిడికి గురౌతూ, తల వంచుకొని ఇంట్లోకి వెళ్లాడు కానీ పరిసరాలను రాగ్యా గమనించలేదు.

జరిగిందంతా వాల్యా ఇంట్లో చెప్పాడు. అది తండా అంతా తెలిసిపోయింది.

రాగ్యాని ఇక ఉపేక్షించకూడదనుకున్నాడు నగ్గూరాం. మళ్లీ మళ్లీ తప్పు చేసే అవకాశం ఇచ్చి నట్టవుతుందని, పంచాయితీకి పట్టుపట్టాడు.

అందుకు చేరారు వాళ్ళంతా!

పంచాయితీ మొదలు కావడమే ఆలస్యం ఇక! పెద్దలు, తండావాళ్ళు అక్కడే ఉన్నారు.

వాల్యాని, చాంద్‌నీని అడగటం, ఏం జరిగిందో తెలుసుకొని రాగ్యాని వివరణ కోరటం, అపుడు శిక్షించటం జరుగుతుంది.

తండా పెద్దలనుంచి కబురంది కాళీచరణ్ చెట్టుదగ్గరికి వెళ్లిన సమయానికి రాగ్యా ఇంట్లో లేడు. ఒక్కడే వెళ్ళాడు.

''రాగ్యాగాడు రాలేదా'' పెద్దలు అడిగారు.

''యాడికిబోయిండో ఇంట్లో లేడు'' అన్నాడు కాళీచరణ్, నేల మీద కూర్చుంటూ.

ఎవ్వరెవ్వరో మాట్లాడుతున్నారు.

కాళీచరణ్‌కి అన్నీ వినిపిస్తున్నాయి.

''ఏంటిదంట మాయరోగవ్! అడవికి బోడు. అయ్యకి సేదోడుగుండడు. శాకిర్జెయ్యడు. సీపు మందు దాగి సిందులెయ్యటవ్ దప్ప మరేంటికీ పనికిరాడు. రాగ్యాగాడ్ని సావ గొట్టాలంతే''

''కాలీశరన్ కడుపున సెడబుట్టిండు! ఆడార్నాయాలు శాందినీ సెయ్యట్టుకుంటాడా! మదవెక్కింది. దించాల..'

''తొలీగా మంచోడే! పట్నంబోతా సెడిపోయిండు. కాళ్ళిరగనూకి పండుకోబెడితే, ఇంకబోడు పట్నానికి..''

కాళీచరణ్ వాళ్ళ మాటలిక వినలేకపోయాడు!

చివాల్నలేచి నిలబడ్డాడు.

అందరికీ రెండు చేతులూఎత్తి దణ్ణం పెడుతూ–

''శాందినీ యిసయంలో రాగ్యా శబ్బరపనే సేసింది. నే జేసిన గారాబవ్ అసువంటిది. సిన్నప్పట్నించి సావగొడతా శాకిరి జెయ్యటవ్ నేర్పిత్తే అట్టా తయారయ్యేవోడుగాడు. తల్లిలేని పిలగాడిని ఆలోచిస్తి ఇట్లా తయారయ్యిండు. నేనేం జెయ్యాలి?

నా సేతుల్తో కొడుక్కింత యిసవిచ్చి సంపలేను. వాడి కోసరవ్ బతగాలి గాన సావలేను.

మీరు గొట్టండి. సంపదండి! వాడు సచ్చినాకనే నేను సచ్చేది. ముందుగా సత్తే ఆడికి బువ్వెట్టే దిక్కుండదు.

ఇసువంటి ముదనట్టపు నాకొడుకు బుడతాడని ముందుగాల్నే తెలిస్తే కడుపు పోనూక్కుండేది, నా పెండ్లాం! అది తెలవక, కడుపున యీడు బడంగానే సంతోసిచ్చింది. మొగపిల్లోడే బుడతాడని తాండాకి పేరుదెచ్చే గొప్పోడగుతాడనీ భ్రవపడ్డది.

(ఇంకా ఉంది)

జానకి విముక్తి

-ముప్పాళ్ళ రంగనాయకమ్మ

చలం స్త్రీ గురించి చేసిన ఈ వ్యాఖ్యలకు అక్షర రూపమే రంగనాయకమ్మగారి ఈ విప్లవ రచన జానకి విముక్తి. ఈ రచన ఇప్పటి ఛాందసవాదుల్ని మూర్ఛపోయేలా చేసింది.

జానకి విముక్తిని చదివిన పాఠకులు తమని తాము అర్థం చేసుకోవగలుగుతారు. ఆర్థిక రాజకీయాంశాలను గురించిన కనీస అవగాహనకు వస్తారు. ఆత్మవిశ్వాసాలకూ, ఆత్మగౌరవాలకూ సంబంధించిన స్పష్టమైన నిర్వచనాలూ, మానవ సహజాతాలైన దయ, స్నేహం, ప్రేమ, శారీరక, మానసిక స్పందనలూ, పునరుత్పత్తి క్రియలలోని మాధుర్యాలను గురించి పునరాలోచిస్తారు.

ప్రకృతి విరుద్ధమైన వివాహపద్ధతులూ, వికృత చేష్టలయిన అలంకరణలూ, బలిసిన వ్యక్తుల ఆడంబరాలూ, బ్రతుకుల ఎడల కనీసపు ఆలోచనలు లేకుండా యాంత్రిక జీవనానికి అలవాటుపడిపోయిన వ్యక్తుల డొల్లతనాలూ స్పష్టంగా కళ్లకు కనపడతాయి ఈ నవల్లో. పశుపక్ష్యాదుల మీదా, పసిబిడ్డలమీదా, వృద్ధులమీదా, చెట్లు చేమల మీదా మనం పోగొట్టుకున్న మానవీయ భావాలు మళ్లీ మన కళ్లబడతాయి.

ఇలా ఎన్నో అంశాలపై పాఠకుడి జ్ఞానం వృద్ధి చెందుతుంది. ఎంతో మానసిక, శారీరక ఆనందాలూ, ఆరోగ్యాలూ పాఠకుడిలో చోటుచేసుకుంటాయి.

ఇక మళ్లీ మనం పాత్రల దగ్గరకొస్తే ఈ నవలలోని ఇంకో ప్రధానమైన పాత్ర శాంత. ఈమె లాయరు. ఈమె, సత్యం ఒకరినొకరు అర్థం చేసుకుంటూ, ప్రేమించుకుని పెళ్లితతంగం లేకుండా కలిసివుంటారు. సంస్కారవంతమైన చేష్టలతో, విప్లవాత్మక భావాలతో తనేమిటో, తన వర్గమేమిటో తెలుసుకొని, తమ ఉమ్మడి సమస్యల పరిష్కారానికి తన సహకారాన్ని అందించటమే తన జీవితాదర్శంగా జీవితాన్ని ప్రారంభించిన పాత్ర శాంత పాత్ర.

చదువు సంధ్యలు పెద్దగా లేని, ప్రపంచ జ్ఞానం అసలే లేని స్థాయి నుండి, శాంత ఆలోచనలతో సమానమైన స్థాయికి ఎదిగి, రాజకీయాలను అర్థం చేసుకుని విముక్తి ప్రస్తానం వైపు అడుగులు వేసే పాత్ర జానకి పాత్ర. అయితే బాగా చదువుకొని, జీవితానికవసరమైన అన్ని అంశాలలోనూ కనీస పరిజ్ఞానం పొందాక స్త్రీ విమోచన వైపు నడక సాగించిన పాత్ర శాంత పాత్ర.

ఈ రెండు పాత్రలూ పాఠకుల మనస్సుల్లో నుండి చెరిగిపోవు. ఈ ఇద్దర్నీ వెనక వుండి, ఆ స్థాయికి తీసుకువచ్చినవాళ్లు సత్యం, డాక్టర్ మూర్తి.

ఇంకోరకంగా చెప్పుకోవాలంటే, ఈ పాత్రలన్నీ ఎప్పుడూ అధ్యయనం ద్వారా, అనుభవాల ద్వారా తమని తాము వున్నతీకరించుకుంటాయనటం సబబుగా వుంటుంది.

ఇప్పుడిక సత్యం పాత్ర గురించి చెప్పుకొందాం!

ఇప్పటివరకూ తెలుగులో ఏ అభ్యుదయ, విప్లవ రచయితా ఏ నవలలోనూ పరిచయం చేయని పాత్ర ఇది సంప్రదాయ తెలుగు నవలా సాహిత్యంలో కనబడే అసహజమైన కల్పిత, కృత్రిమ హీరో పాత్రలకు విరుద్ధమయిన, విలక్షణమైన పాత్ర ఇది.

సత్యం సాదా సీదా మనిషి. ఆకారంలో, ఆలోచనలలో వున్నతమైన భావాలున్నవాడు. చిన్నపాటి ఉద్యోగంతో కుటుంబాన్ని నెట్టుకొస్తుంటాడు. పుస్తక పఠనం ద్వారా, తనకన్నా తెలివైనవాళ్ల ద్వారా తనని తాను అనునిత్యం జ్ఞానవంతుణ్ణి చేసుకుంటూ శ్రమిస్తుంటాడు. సరియైన జ్ఞానంలోంచి ఎదిగిన అతను మానవ శరీర ధర్మాలను గురించి, సమాజ నిర్మాణం గురించి, వ్యక్తులమధ్య సంబంధాల్ని గురించి, ఆర్థిక, రాజకీయ, సాంఘిక అంశాల్నిగురించి స్పష్టమైన అవగాహనతో వుంటాడు. అతని మనస్సులోని స్వచ్ఛత, మాటల్లోని స్పష్టత పాఠకుడికెంతో నచ్చుతాయి.

సత్యం శుభ్రంగా వంట చేస్తాడు. ఇంటిని శుభ్రపరుస్తాడు. ఆడవాళ్లతోపాటు అన్ని పనులూ సమానంగా చేస్తాడు. తను చెప్పేదాన్ని నూరుశాతం చేతల్లో ప్రదర్శిస్తాడు. ప్రేమించవలసినవాళ్లని మనస్ఫూర్తిగా ప్రేమిస్తాడు. ద్వేషించవలసినవాళ్లని ధైర్యంగా ద్వేషిస్తాడు.

సాధారణ పాఠకుడికి ఈ సత్యం పాత్ర ఎంతో విస్మయం కలిగిస్తుంది. ఆనందం కలిగిస్తుంది.

పురుష పాఠకలోకానికి మింగుడుపడని స్త్రీని చలం సృష్టిస్తే, మహిళా పాఠక లోకానికి ప్రీతిపాత్రమైన పురుషుణ్ణి ఈ నవల్లో రంగనాయకమ్మగారు సృష్టించారు.

వినమరుగైన..

-జి.మోహన్‌రావు

నవలంతా సున్నిత హాస్యంతో, హేతుబద్ధ తర్కంతో, సహజమైన వాక్య నిర్మాణంతో హాయిగొలిపే సన్నివేశాలతో నిండిపోయి జీవనంతో నిండి పొంగిపొర్లుతుంటుంది. చాలా చాలా సుందరమైన కొత్త పదాలు. అంతకుముందెప్పుడూ పరిచయం లేని కొత్త వ్యాఖ్యానాలు అడుగుగడుగునా మనకు కనిపిస్తాయి. ఇలాంటి కొత్తదనానికి కారణం బహుశా జానకి విముక్తి నవలాంశం కొత్తది కావటమే.

ఇన్ని విభిన్న సాంప్రదాయేతర అంశాల మేలుకలయిక జానకి విముక్తి. వెయ్యిన్నొక్క కొత్త విషయాల్ని ఈ నవల ద్వారా పాఠకుడు నేర్చుకుంటాడు.

ఇంతటి గొప్ప రచనను అందించిన రంగనాయకమ్మగారు మన సమకాలీనులు కావటం మనకు సంతోషం.

మంచి సాహిత్యానికుండాల్సిన లక్షణాలను గురించి మనం కొత్తగా ఇపుడు నిర్వచనం చెప్పుకోవాల్సిన అవసరం ఏమీ లేదు. మంచి సాహిత్యం ఎలా వుండాలో ఈ నవలలోనే మూడవ భాగంలోని 190-191 పేజీల్లో రంగనాయమ్మగారు చెప్పారు. ఆ వాక్యాల్నే ఇక్కడ గుర్తుచేసుకోవటం సందర్భోచితంగా వుంటుంది.

మంచి సాహిత్యంలో మానవ జీవితం వుంటుంది. మానవ హృదయాలలో వుండే న్యాయమూ, ఔన్నత్యమూ వుంటుంది. మార్గదర్శకత్వాన్నిచ్చే పాత్ర చిత్రణ వుంటుంది. దానిని చదివిన పాఠకుడికి తనని తాను సంస్కరించుకోవాలని ఆరాటం కలిగించే కళాత్మకత వుంటుంది. అందుకే వున్నత సాహిత్యం ఒక శాస్త్రమే. శాస్త్రంగా కనిపించని శాస్త్రం. శాస్త్రంకన్నా శక్తివంతమయిన శాస్త్రం. చక్కని రంగుతో, రుచితో, సువాసనలీనే ఔషధం లాంటిది మంచి సాహిత్యం.

జానకి విముక్తి నవల విషయంలోనూ ఈ నిర్వచనం అక్షర సత్యం.

-సమాప్తం

రెండు దశాబ్దాల క్రితం విజయవాడ ఆకాశవాణిలో ప్రసారమైన
శత వసంత సాహితీ మంజీరాలు - శీర్షిక నుంచి..

మాటాట

నిర్వహణ: సుధామ 1835

■	1		2			■
3	■	■		■	■	4
5	6	■		■	7	
■	8		■	9		■
10		■	11	■	12	13
	■	■		■	■	
	14					■

ఆధారాలు

అడ్డం

1.ఎల్లప్పుడూ పార్వతీపతి
5.ఎరుకలసాని చెప్పేది
7.బొమ్మరిల్లు చిత్రంలో ఓ మాంఛి పనోడు
8.అటుగా ఇది విచ్చుకుంటేనే పువ్వు
9.రంధి వంటిదే!
10.స్వభావం, తీరు
12.అరటిచెట్టు, దేవవేశ్య
14.ఆదిభట్ల నారాయణదాసు చెప్పినవి

★

నిలువు

2.ఆలయ పైభాగం
3.ఎందుకు పారేస్తాను నాన్నా విజయనగరం కథకుడు
4.ఏ.వీ.యస్ గారి తృప్తి!
6.దిక్కులోని ఏనుగు
7.పొడుగు జడ అనే భ్రాంతి కలిగించేది
10.ఇంగ్లీష్ రాత్రి
11.గడ్డి
13.జాగ్రత్త!

మాటాట-1834 సమాధానాలు

అడ్డం		నిలువు	
1.నవవర్షం	9.చీమ	2.వలపు	7.కోమలి
5.మంచి	10.మీకు	3.జాలరి	10.మీగడ
7.కోరి	12.తెర	4.సుమం	11.పరశు
8.నుడి	14.శుభాకాంక్షలు	6.చినుకు	13.లక్ష

బతుకు దృశ్యాల్ని బొమ్మకట్టించిన 'మట్టిరంగు బొమ్మలు'

పల్లె పదాల గుండె చప్పుళ్ళతో అక్షరం మొలకెత్తి, ప్రాంతీయ యాసతో గుభాళించినపుడు ఆ కవిత్వ స్ఫూర్తే వేరు. తారసపడిన ప్రతి సందర్భాన్నీ అనుభవ లోతులతో ఒడిసి పట్టుకుంటుంది. అలా రాటుదేలిన అక్షరశ్వాసే ఈ 'మట్టిరంగు బొమ్మలు' కవితా సంపుటి. దీని కవి ఉత్తరాంధ్ర పోరాట బతుకు ముఖచిత్రం సిరికి స్వామినాయుడు. డెబ్భై కవితలతో ఊపిరి పోసుకున్న ఈ మాండలిక ప్రాంతీయ అస్తిత్వ ఆర్తి జనజీవాలను పోషించడంలో తనదైన ప్రత్యేక ముద్రను వేసుకుంది. గతంలో 'మంటి దివ్వ'తో సుపరిచితమైన ఈ అక్షరకారుడికి వచనప్రాయమైన కవిత్వనిర్మాణ శైలి సహజంగానే ఒంటపట్టింది. స్థానిక సమస్యలను లోతైన చూపుతో పరిశీలించి, సరళ భాషలో వ్యక్తీకరించడంలో అందెవేసినచెయ్యి ఇతనిది. దీనికి కేంద్రంగా మట్టిరంగు జన జీవన ఘోషనే ప్రతిబింబించడం మొదలుపెట్టాడు.

''పచ్చని యింటిలోకి/ గుడ్లగూబలు దూరినట్టు / నాగరితా ముగేసుకొని / మాది కాని తనదేమో మాగూడల్లోకి చొరబడినప్పటినుండే/ మా ఆదివాసీ బతుకులు మరింత అల్లకల్లోలమైపోయాయి'' అంటాడు 'దుర్ల' అనే కవితలో. 'సమూహం' అర్థం వచ్చే ఈ భావజాల తిరుగుబాటు కవిత్వంలో.. తుడుంకొట్టి, సన్నాయి ఊపి, థింసాలాడే.. ఆకుపచ్చని ఆదివాసీ బతుకుల్లో, నవనాగరికతా ముసుగులో విధ్వంసం తొంగి చూసి, దురాక్రమణ జరిపే పెత్తందారులపై.. ఒక సుదీర్ఘ యుద్ధ నిరసనను ప్రకటిస్తాడు కవి స్వామినాయుడు. 'ఆది నుండీ అడవి ఒక యుద్ధ క్షేత్రం' అని నొక్కి చెప్పడంలో ఒక జీవన విషాద వాస్తవికత నిలువెత్తు దోపిడీగా తొంగిచూస్తుంది.

''జాలరి వాడ మీద నీలిజెండా'' అన్న కవితలో వర్తమాన సంక్షోభిత కల్లోల బతుకుల్ని చాలా ఆవేశపూరితంగా చిత్రిస్తాడు కవి.

''మీరు కొల్లగొట్టిన సముద్రం ఒట్టిపోయి/ మా కళ్లలోంచి కురుస్తోంది/ కనిపించని హోరు కెరటాల అలజడై/ మా గుండెల్లో ధ్వనిస్తోంది/ సముద్రం మా సామూహిక స్వప్నం


సముద్రం మా జాలరివాడమీద ఎగిరే నీలి జెండా'' అని అంటున్నపుడు.. మత్స్యకారుల జీవితాల్లో తొంగిచూస్తున్న అభద్రతాభావం కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. ''పంట పొలాల మీద/ ఏ మిడతల దండు దాడి జేసిందో/ తన పచ్చని బతుకును/ యే పెట్టుబడి కొల్లగొట్టిందో/ అతని ముఖంమీద చీకటి రెక్క విప్పింది'' అంటాడు 'బందీ' కవితలో ఒకచోట. పెట్టుబడిదారీ సమాజం వేళ్ళూనికొని జడలు విప్పినంత కాలమూ రాజకీయ వ్యవస్థలో మార్పు రానంతవరకూ.. నేల చూపులు చూస్తున్న రైతన్న నాగేటి కర్ర ఎప్పటికీ విషాదగీతాన్నే ఆలపిస్తుంది. ''యుద్ధం సోకని నేల కోసం'' శీర్షికలో ఒక చోట ఇలా అంటాడు–

''కన్నీళ్లు కళ్లాపి చల్లి/ తూరుపు ముగ్గు బుట్టలోంచి/ కాసింత వెలుగు పిండితో ముగ్గేసి/ పూల దీపాలు వెలిగించి/ యుద్ధం సోకని నేలకోసం/ కళ్లను కాగడాలను జేసి కాలం ఎదురుచూస్తోంది'' అని చెబుతున్నపుడు ఎడతెగని దుఃఖమే గుండెలోతుల్లోంచి పొంగుకొస్తుంది. నేల నలుచెరుగులా గుత్తాధిపత్యం నీడలు నిఘా నేత్రాలతో సంకెళ్లు వేసి, నిషేధాజ్ఞలను పరుస్తుంటే.. అస్తిత్వం ఉనికికే ముప్పు వాటిల్లి భవిష్యత్తును భయభ్రాంతులకు గురిచేస్తుంది. ఈ దృశ్యాన్నే ఆర్ద్రపూరితంగా చెబుతాడు కవి.

'రుతువుల కొమ్మలమీద /రాగాలు పాడే మట్టి గువ్వలు' అన్నపుడూ.. ''ప్రాణాలు రెండూ ఫలమాడే నాగుల్లా /ఒకే దేహమై ముచ్చట్లాడుకుంటాయి'' అని పలికినపుడూ..''నేల కొమ్మకు మెతుకు పూయదు కానీ'' చెప్పినపుడూ.. ''రైతు లేని రాజధాని / మీకు భూతల స్వర్గమేమో గానీ /మాకు మాత్రం భూతాల స్వర్గమే'' అంటూ నిర్వచించినపుడు కానీ.. స్వరం ఒకటే. ఆలోచనలు వేర్వేరు. ''శత్రు శిబిరాల్లా యుద్ధ మేఘాలు'', ''వాళ్ళ కళ్ళలోయల్లోంచి /వాగు పొంగుతూనే ఉంది'', ''ఒక ఎడబాటు / ఎడారి మీద ఒంటరితనాన్ని మోస్తూ'', ''బతుకు తీరం పొడుగునా / మనం కలిసి నడిచిన /జ్ఞాపకాల పాదముద్రలు', కవిలో దాగిన పల్లె వాసనల పవరింపులు బాధలుగా గాథలుగా కళ్ళముందు మెదులుతుంటాయి. శీర్షికల్లో నల్లకలువల నెత్తుటిదారుల్లో, అడవుల్ని అరుణపతాకాలు జేసీ, నేల ఒక అద్దె గర్భం, వెదుర పొదల యుద్ధ రహస్యం, దేహం ఓ కల్లోలిత ప్రాంతమై, నిత్యగాయాల నెలవంక, కూలిపిట్టల కన్నీటి పాట, గోడకు ఆవల సముద్రం వైవిధ్యపూరితమైనవి. 'మట్టిరంగుల బొమ్మలు'ని బొమ్మ కట్టించిన కవి సిరికి స్వామి నాయుడు కృషి ఎప్పటికీ అభినందనీయమే.

-మానాపురం రాజా చంద్రశేఖర్
9440593910

రాశిఫలం



- గౌరీభట్ల దివ్యజ్ఞాన సిద్ధాంతి

● **మేషం (అశ్విని, భరణి, కృత్తిక 1పా.)**
చంచలం అధికమవుతుంది. గృహంలో మార్పులు కోరుకుంటారు. స్వల్ప అనారోగ్య కారణంతో నిరుత్సాహంగా ఉంటారు. స్త్రీలతో తగాదాలేర్పడే అవకాశాలుంటాయి. ప్రయత్న కార్యాలు ఫలిస్తాయి.

● **వృషభం (కృత్తిక 2, 3, 4పా., రోహిణి, మృగశిర 1, 2పా.)**
సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారు. కుటుంబంలో సుఖ సంతోషాలు అనుభవిస్తారు. నూతన వస్తు, ఆభరణాలను పొందుతారు. ప్రయత్న కార్యాలన్నింటిలో విజయం సాధిస్తారు. శుభ వార్తలు వింటారు. ధైర్య సాహసాలు ప్రదర్శిస్తారు. ఆకస్మిక ధన లాభయోగముంటుంది.

● **మిథునం (మృగశిర 3, 4 పా., ఆరుద్ర, పునర్వసు 1, 2, 3పా.)**
విదేశయాన ప్రయత్నం సులభంగా నెరవేరుతుంది. మనోవిచారాన్ని పొందుతారు. కుటుంబ పరిస్థితులు సంతృప్తికరంగా వుంటాయి. ఆకస్మిక ధననష్టం పట్ల జాగ్రత్త వహించుట మంచిది. నూతన కార్యాలు వాయిదా వేసుకుంటారు.

● **కర్కాటకం (పునర్వసు 4 పా., పుష్యమి, ఆశ్రేష)**
కోరుకునేది ఒకటైతే జరిగేది మరొకటవుతుంది. అనారోగ్య బాధలు స్వల్పంగా వున్నాయి. వేళ ప్రకారం భుజించుటకు ప్రాధాన్యమిస్తారు. చంచలంవల్ల కొన్ని ఇబ్బందులెదురవుతాయి. మనోనిగ్రహానికి ప్రయత్నించాలి.

● **సింహం (మఖ, పుబ్బ, ఉత్తర 1 పా.)**
గొప్పవారి పరిచయం ఏర్పడుతుంది. స్త్రీల మూలకంగా లాభం వుంటుంది. మంచి ఆలోచనలను కలిగివుంటారు. బంధు, మిత్రులు గౌరవిస్తారు. కుటుంబ సౌఖ్యం సంపూర్ణంగా పొందుతారు. గృహ అవసరాలకు ప్రాధాన్యమిస్తారు.

● **కన్య (ఉత్తర 2, 3, 4పా., హస్త, చిత్త 1, 2 పా.)**
కుటుంబంలో చిన్న చిన్న గొడవలు వచ్చే అవకాశం ఉంది. పరిస్థితిని మీ అదుపులో ఉంచుకోండి. ప్రయాణాల్లో అప్రమత్తత అవసరం. ఆర్థిక ఇబ్బందులను అధిగమించుటకు ఋణప్రయత్నాలు చేస్తారు.

● **తుల (చిత్త 3, 4పా., స్వాతి, విశాఖ 1, 2, 3పా.)**
దర్మకార్యాలు చేయుటయందు ఆసక్తి పెరుగుతుంది. దైవదర్శనం చేసుకుంటారు. కుటుంబ సౌఖ్యముంటుంది. మానసికానందాన్ని అనుభవిస్తారు. పేరు ప్రతిష్ఠలు లభిస్తాయి. ఆకస్మిక ధనలాభముంటుంది. శుభవార్తలు వింటారు.

● **వృశ్చికం (విశాఖ 4 పా., అనూరాధ, జ్యేష్ఠ)**
నూతన వ్యక్తులను నమ్మి మోసపోరాదు. సంఘంలో అప్రతిష్ఠ రాకుండా జాగ్రత్తపడుట మంచిది. ప్రయత్న కార్యాలకు ఆటంకాలెదురవడంతో ఇబ్బంది పడతారు. దైవదర్శనానికి ప్రయత్నిస్తారు. ఋణప్రయత్నాలు ఆలస్యంగా ఫలిస్తాయి. సోదర వైరం కలిగే అవకాశముంటుంది.

● **ధనుస్సు (మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1 పా.)**
మనస్సు చంచలంగా వుంటుంది. బంధు, మిత్రులతో విరోధమేర్పడకుండా జాగ్రత్తపడుట మంచిది. అకాల భోజనంవల్ల అనారోగ్య బాధలనుభవిస్తారు. ఆకస్మిక కలహాలకు అవకాశముంటుంది. చెడు సహవాసానికి దూరంగానుండుటకు ప్రయత్నించాలి.

● **మకరం (ఉత్తరాషాఢ 2, 3,4పా., శ్రవణం, ధనిష్ఠ 1, 2పా.)**
ప్రయత్నం మేరకు స్వల్ప లాభముంటుంది. వృథా ప్రయాణాలెక్కువ చేస్తారు. వ్యాపార రంగంలో లాభాలుంటాయి. ఋణప్రయత్నాలు చేయవలసి వస్తుంది.

● **కుంభం (ధనిష్ఠ 3, 4పా., శతభిషం, పూర్వాభాద్ర 1,2, 3పా.)**
వ్యవసాయ రంగంలోని వారికి లాభదాయకంగా వుంటుంది. తొందరపాటువల్ల ప్రయత్న కార్యాలు చెడిపోతాయి. చెడును కోరేవారికి దూరంగా నుండుట మంచిది. ఆకస్మిక భయము, ఆందోళన ఆవహిస్తాయి. శారీరకంగా బలహీనమేర్పడుతుంది.

● **మీనం (పూర్వాభాద్ర 4 పా., ఉత్తరాభాద్ర, రేవతి)**
ఇతరులకు ఇబ్బందిని కలుగజేసే పనులను మానుకోవాల్సి వస్తుంది. వృత్తిలో ఇబ్బందుల అధిగమిస్తారు. మీరు చేసే ప్రతి పనిలో వ్యతిరేక ఫలితాలు కలుగకుండా జాగ్రత్త అవసరం. నూతన కార్యాలు ప్రారంభించకుండా వుంటే మంచిది.

హితవాక్యం

ఉపాయమాస్థితస్యాపి నశ్యన్త్యర్థాః ప్రమాద్యతః
హన్తి నోపశయస్థోపి శయాలుః మృగయుః మృగాన్
అది 'మాఘ' మహాకవి కట్టిన అక్షర మణితోరణం..
'శిశుపాలవధ' కావ్య ప్రాంగణంలోని దృశ్యమిది-

అది ద్వారక. శ్రీకృష్ణలీలకు మనోహర వేదిక. అప్పుడే నారదుడు వచ్చి వెళ్లాడు. "దుష్టుడైన శిశుపాలుణ్ణి త్వరగా తుదముట్టించాలి" అని మహేంద్రుని సందేశాన్ని కృష్ణుని చెవిలో ఊది వెళ్లాడు. ఇంతలో ఇంద్రప్రస్థపురంనుండి ధర్మజుని ఆహ్వానం అందింది, రాజసూయయాగానికి రమ్మని. కృష్ణుడు సందిగ్ధావస్థలో పడ్డాడు. "శిశుపాలుణ్ణి వధించడానికి చేది దేశం వెళ్ళాలా? లేక ఆప్తులు జరుపుకునే రాజసూయానికి వెళ్ళాలా?"- వెంటనే రహస్య సమావేశం జరిపాడు అన్నయైన బలరామునితో, పినతండ్రి, ప్రధాన సచివుడైన ఉద్ధవునితోను. ఉద్ధవుడు చేసిన ఉపదేశమాలికలోని ఒక పువ్విది.. పువ్వులో పరిమళించిన ధర్మ హృదయమిది..
"ఉపాయం కలవానికైనా అజాగ్రత్తవలన ప్రయోజనాలు నశించిపోతాయి. అది వివేకవంతునికైనను తప్పదు. అంటే-ఏకాగ్రత ముఖ్యమన్నమాట! నిద్రాళువైన వేటగాడు చాటుగా మాటువేసి ఉన్నను జంతువుల్ని వేటాడలేడు గదా! అంటే నిద్ర వాని దిట్టతనాన్ని నిష్ఫలం చేస్తుంది. అలాగే నిపుణుడైనను జాగ్రత్త లేక లక్ష్యసాధకుడు కాలేడు".

-వ్యాఖ్యాత:డి.యస్.దీక్షిత్

భారతీయమార్గము మాసప్రతిక (1987 జనవరి)నందు ప్రచురితమైన హితవాక్యాలు-వ్యాఖ్యాత-డి.ఎస్.దీక్షిత్. ప్రచురణ- శ్రీ శంకర సేవాసమితి (రిజి), శ్యామలానగర్ -గుంటూరు-522066.

శ్రీకాళహస్తీశ్వరా!

- నీతో యుద్ధము చేయనోపఁ; గవితానిర్మాణశక్తి నిన్నున్
బ్రీతుం చేయగలేను; నీ కొరకుఁ దండ్రిన్ చంపగాఁజాల; నా
చేతన్ రోకట నిన్ను మొత్తవెరతున్; చీకాకు నాభక్తి, యే
రీతిన్నాకికనిన్నుఁ చూడగలుగున్? శ్రీ కాళహస్తీశ్వరా!

భావం: *అర్జుననిలాగానీతో యుద్ధము చేయలేను. కవిత్వము చెప్పి సంతోషపరచలేను. శివభక్తునివలె తండ్రిని చంపలేను. శివభక్తురాలిలా రోకలితో మొత్తలేను. నా భక్తి, నాకు అడ్డమై నీ దయను పొందనీయకుండా చేస్తుంది. నిన్ను చూసే అవకాశం ఇంక నాకెలా కలుగుతుంది?*

- ఆలున్ బిడ్డలు తల్లిదండ్రులు ధనంబంచు న్మహాబంధనం
బేలా నామెడ గట్టినాడ విక నిన్నే వేళఁజింతింతు, ని
ర్మూలంబైన మనంబులో నెగడు దుర్మోహాబ్ధిలోఁగ్రుంకి, యీ
శీలామాలపుఁ జింత నెట్లుడిపెదో శ్రీకాళహస్తీశ్వరా!

భావం: *ఈశ్వరా! భార్యాపుత్రులు, తల్లిదండ్రులు, ధనములు అనే పాశములను నా మెడకు చుట్టావు. ఈ వ్యామోహంలో పడి నిన్ను నేనెట్లా స్మరించగలను? ఈ భరింపరాని దుఃఖము ఎలా పోగొడతావో శంకరా! నీ దయ.*

- నిప్పై పాతకతూలశైల మడచున్ నీనామము న్మానవుల్
తప్పన్ దవ్వుల విన్న నంతకభుజాదర్పోద్ధత క్లేశముల్
తప్పుందారును ముక్తులౌదురనిశాస్త్రంబుల్ మహాపండితుల్
చెప్పంగాఁ దమకింక శంకలుండవలెనా? శ్రీకాళహస్తీశ్వరా!

భావం: *శ్రీకాళహస్తీశ్వరా! నీ పేరు స్మరిస్తేనే కొండలవంటి పాపాలు పోతాయని, యముని వల్ల కలుగు నరకబాధలు తప్పుతాయని వేదశాస్త్రాలు, పండితులు చెప్తుంటే, ఈ మానవులకు ఇంకా అనుమానాలెందుకు? నీ పేరును స్మరించుటకు సిద్ధపడరెందుకు?*

- వీడెం బబ్బినయప్పుడున్, దమనుతుల్ విన్నప్పుడుం, బొట్టలో
గూ డున్నప్పుడు, శ్రీవిలాసములు పై కొన్నప్పుడుం గాయకుల్
పాడంగా వినునప్పుడుం చెలగుదంభప్రాయ విశ్రాణవ
క్రీడాసక్తుల నేమి చెప్పవలెనో శ్రీకాళహస్తీశ్వరా!

భావం: *ఈశ్వరా! నిన్ను, నీ ధ్యానమును మరచి, తమకు తాంబూలము దొరికినప్పుడు, అనగా భోగములు కలిగినప్పుడు, తమను ఎవరైనా పొగిడినప్పుడు, కడుపునిండా తిండి ఉన్నప్పుడు, ఐశ్వర్య వైభవములు బాగా ఉన్నప్పుడు, గాయకులు పాడినప్పుడు తమ గొప్పతనమును చూపుటకై ఆడంబరముగా దానధర్మములు చేస్తూ విర్రవీగు వారిని ఏమనాలో తెలియదు.*

ధర్మభూమి

ఒరులేయవి యొనరించిన
నరవర యప్రియము తన మనంబునకగు దా
నొరులకు నవిసేయకునికి
పరాయణము పరమ ధర్మ పథములకెల్లన్

ఆంధ్రభూమి బుధవారం, 2 జనవరి 2019

కాలకవృక్షీయోపాఖ్యానము



89 మహాభారతంలో ఉపాఖ్యానాలు

డాక్టర్ ముదిగొండ ఉమాదేవి

ఆ నది ముని శాపంతో రక్తంతో ప్రవహించసాగింది. అప్పుడు రాక్షసులు అక్కడకు వచ్చి ఆ రక్తాన్ని త్రాగుతూ సుఖంగా ఉండసాగారు. వారు స్వర్గాన్ని గెలిచినంత ఆనందాన్ని పొందేవారు. కొంతకాలానికి ఆ నదిలో మునగాలని కొందరు మహర్షులు అక్కడికి వచ్చారు. వారు సరస్వతీ తీర్థాలన్నింటిలో మునిగి ఆనందం పొంది చివరకు నెత్తురు ప్రవహిస్తున్న ఈ తీర్థానికి వచ్చారు. ఆ నీటిని చూసి ఆశ్చర్యపోయారు. అప్పుడు అక్కడ రాక్షసులు ఆ రక్తపు నీటిని త్రాగుతూ ఆ మునులను చంపి వారి రక్తాన్ని ఆ ప్రవాహంలో కలిపేయాలని ప్రయత్నించారు. కాని ఆ మునులు నదీమతల్లిని రక్షించాలనుకున్నారు. వారు ఆ నదికి నమస్కరించి ఇలా అడిగారు. ''కల్యాణీ! నీ ప్రవాహం ఎందుకు రక్తమయమైందో ఆ కారణం చెప్పు. మేమేదైనా ఉపాయం ఆలోచిస్తాము''.

అప్పుడు నది వారికి జరిగిన విషయం, ముని శాపం గురించి వివరించింది. అప్పుడు మునులు ఆ నదితో ఇలా అన్నారు. ''అనఘా! కారణం తెలిసింది. కనుక మునులందరు చేయగలగింది చేస్తారు'' అని మునులు ''మనం అందరం కలిసి సరస్వతిని శాపం నుండి విడిపిద్దాము'' అని నిశ్చయించుకొన్నారు.

ఆ మునులంతా తపస్సులతో, నియమాలో, ఉపవాసాలతో, వ్రతాలతో పరమేశ్వరుని అర్చించి సరస్వతి నదికి విముక్తి కలిగించారు. అప్పుడు ఆ నది పూర్వంలాగ స్వచ్ఛనమైన నీటితో ప్రవహించ సాగింది. మునులు నదీజాలలని ప్రక్షాళన చేసి నిర్మల జలాలుగా మార్చటం చూసి రాక్షసులు భయపడి వారిని శరణు వేడారు. వారు మునులతో ఇల ప్రార్థించారు. ''మేము ఆకలితో ఉన్నాం. ధర్మానికి దూరంగా ఉన్నాము. మేము అనేక పాపాలు చేశాము. మాకు మంచి మార్గదర్శనం చేయడానికి మీవంటి ధర్మాత్ములు, పుణ్యాత్ములు దొరుకలేదు. అందువల్ల ఇలాంటి పాపాలు చేస్తున్నాము. ఈ పాపాలు పెరిగితే మేము బ్రహ్మరాక్షసులమవుతాము. క్షత్రియ, వైశ్య, శూద్రులను, బ్రాహ్మణులను ద్వేషించేవారు రాక్షసులు అవుతారు. గురువును, వృద్ధులను, ఋత్విక్కులను అవమానించినవారు కూడా రాక్షసులౌతారు. కనుక మమ్మల్ని తరింపజేయండి. మా మీద దయ చూపండి.''

వారి మాటలు విన్న మునులు రాక్షసుల ముక్తికై నదిని ప్రార్థిస్తూ ఇలా అన్నారు. ''ఉమ్మివేసిన అన్నం, పురుగులు పడిన అన్నం, ఎంగిలి కూడు, కన్నీరులో తడిసిన అన్నం, కుక్కలు ముట్టిన అన్నం ... ఇవి లోకంలో రాక్షసుల భాగం కనుక పండితుడు వాటిని విసర్జించాలి.'' తర్వాత ఆ మునులు ఆ తీర్థాన్ని శుద్ధి చేసి రాక్షసవిముక్తికై నదిమీద ఒత్తిడి తెచ్చాడు. వారి అభిప్రాయం తెలుసుకొని నది తన స్వరూపం అయిన అరుణను రప్పించింది. రాక్షసులు ఆ అరుణలో స్నానం చేసి తమ శరీరాలను విడిచిపెట్టారు. అరుణి వారి పాతకాలను బ్రహ్మహత్యాపాపాన్ని పోగొట్టింది. ఇది తెలిసి దేవరాజు ఇంద్రుడు కూడా ఆ తీర్థంలో స్నానం చేసి తన బ్రహ్మహత్యాపాపాన్ని పోగొట్టుకున్నాడు. ఎందుకంటే అతను నముచి దగ్గర తాను చేసిన ప్రతిజ్ఞను భంగపరిచాడు.

పూర్వం ఇంద్రునికి భయపడి నముచి సూర్యరశ్మిలో దాగాడు. ఇంద్రుడు అతనితో స్నేహం చేసి ఇలా అన్నాడు. ''పగలుకాని, రాత్రి కాని, తడి ఆయుధంతో కాని పొడి ఆయుధంతో కాని నిన్ను చంపను''. ఇలా ప్రతిజ్ఞ చేసి అంతటా మంచు కప్పి ఉండటం చూసి నీటి నురుగుతో నముచి తలను ఖండించాడు. అలా తెగిన నముచి తల ఇంద్రుని వెంటపడింది. ఇంకా ఇలా అనసాగింది. ''ఓరీ పాపాత్ముడా! మిత్రద్రోహి!''

దానితో భయపడి ఇంద్రుడు బ్రహ్మతో నివేదించాడు.


అప్పుడు బ్రహ్మ ఇలా అన్నాడు. ''పాపభయాన్ని పోగొట్టే అరుణతీర్థంలో స్నానం చేసి యాగం చెయ్యి. మునులు తమ తపశ్శక్తితో ఆ తీర్థ జలాన్ని పవిత్రం చేశారు. అక్కడ అరుణ గుప్తంగా ఉంది. ''సరస్వతీనది అరుణను తన జలంతో ముంచింది. ఆ అరుణా సరస్వతుల సంగమ స్థానం అత్యంత పవిత్రమైనది.''

ఇంద్రుడు బ్రహ్మ చెప్పినట్లే చేశాడు. యాగం చేసి స్నానం చేశాడు. నముచి శిరస్సు కూడా ఆ తీర్థంలో తడిసి ఉత్తమ లోకాలకు చేరింది.

ఈ విధంగా సరస్వతీ నదీ తీరంలో ఉన్న తీర్థాలు మానవులకు, దేవతలకు, ఋషులకు ఎన్నో విధాల ఉపయోగపడ్డాయి.

కాలకవృక్షీయోపాఖ్యానము

పూర్వం క్షేమదర్శి అనే రాకుమారుడు యుద్ధంలో తన సైన్యాన్ని అంతా పోగొట్టుకొని దిక్కుతోచక తిరుగుతూ కాలకవృక్షీయుడు అనే మునిని కలిశాడు. అతను మునికి నమస్కరించి తన పరిస్థితి వివరించి ఈ కష్టం నుండి విముక్తి పొందే మార్గాన్ని చూపుమన్నాడు. అతను మునితో ఇలా అన్నాడు - ''మహాత్మా! ధనంపైన ఆధిపత్యం కోరుకొనేవాడు నాలా రాజ్యాన్ని పోగొట్టుకుంటే ఏమి ప్రయోజనం? దీని కోసం ఇతరులను ఆశ్రయించడంలాంటి నీచమైన పనులు కాక ఇంకేదైనా ఉపాయం దయచేసి చెప్పండి. శారీరిక, మానసిక వ్యాధులతో బాధపడేవారికి నీవంటి ధర్మజ్ఞుడు, కృతజ్ఞుడు శరణ్యుడు అగును. అప్పుడు అతను కోరికల పట్ల విరక్తి చెంది జ్ఞానమనే ధనాన్ని పొంది ప్రీతిని,




శోకాన్ని విడిచి పెట్టి సుఖాన్ని పొందుతాడు. కాని అర్థసంపాదనకు ప్రాధాన్యత ఇచ్చే నాలాంటి వారి సంగతేమిటి? నేను ఆ భోగాలమీద, ధనం మీద మోహాన్ని వదలుకోలేక పోతున్నాను. కనుక నాలాంటి వాడు పొందే ఇంకేదైనా సుఖం ఉంటే చెప్పండి'' అని తన దీనస్థితిని చెప్తూ బాధపడుతున్న ఆ రాకుమారుని చూసి మహాత్ముడైన ఆ ఋషి ఇలా అన్నాడు. ''నీకు అన్నీ తెలుసు. నేను - నాది అనేది అంతా అనిత్యమే. ఏదీ శాశ్వతం కాదు. నీ కళ్లముందు ఏది ఉందని అనుకుంటున్నావో అది అంతా లేదన్న నిజాన్ని గ్రహించు. అప్పుడు నీకు కష్టం వచ్చినా నీవు భరించగలవు. జరిగినది, జరుగబోయేది సమస్తమూ జరిగేది కాదు. ఇది తెలుసుకుంటే నీవు అధర్మాల నుండి బయటపడతావు. పూర్వం రాజ్యం, సంపద వంశపారంపర్యంగా వచ్చేవి. ఇక మీదట అలా ఉండకపోవచ్చు. ఇది తెలిస్తే ఏ బాధా ఉండదు. కనుక శోకించడం తగదు. పూర్వం ఉన్న నీ పితృ పితామహులు యిప్పుడు ఎచ్చట ఉన్నారు? నీవు వారిని చూడటం లేదు కదా! వారు నిన్ను చూడలేదు. శరీరం అనిత్యం. అలాంటి శరీరం ద్వారా పొందే వాటికోసం ఎందుకు దుఃఖిస్తావు? కొంతకాలానికి నీవు కూడా ఉండవు. నీవే కాదు నీ శత్రువులు కూడా నశించిపోతారు. అందువల్ల మన దగ్గర సంపదలు ఉన్నప్పటికీ 'ఇవి నావి కావు' అన్న భావనతో ఉండాలి.'' అతని మాటలు విని రాజు ఇలా అన్నాడు.

''మహాత్మా! ఈ రాజ్యం అంతా యాదృచ్ఛికమే అని తలుస్తాను. అన్నిటికంటే శక్తిమంతమైనది కాలం మాత్రమే.

ఇంకావుంది...

గాంధీతాత తెలుగు అడుగులు

'ఆంధ్రప్రదేశ్‌లో గాంధీజీ' అనే పుస్తకం- తెలుగు అకాడమీ ప్రచురణగా-1978లో వెలువడిన సంగతి మనలో చాలామందికి తెలుసు. తెలుగునాట గాంధీజీ చేసిన అనేక పర్యటనలకు సంబంధించిన విశ్వసనీయ చారిత్రక పత్రంగా దాని విలువ గురించి- నలభయ్యేళ్ళ తర్వాత-ఇపుడు కొత్తగా చెప్పవలసిన పనిలేదు. ఈ చారిత్రక పత్రం పెద్ద పెద్ద గ్రంథాలయాల్లో కూడా దుర్లభంగా మారిపోయిన వాస్తవం సయితం చదువురులందరికీ తెలిసిందే. గాంధీజీ నూట యాభయ్యో జయంతి నేపథ్యంలో ఇలాంటి పుస్తకాల కోసం కొత్తతరం పాఠకులు వెదుకులాడడం సహజం. తన జీవితమే తన సందేశమని గాంధీజీ చెప్పిన సంగతి మనకు తెలుసు. ఆ సందేశం వినాలని ప్రపంచమంతటా యువత చెవులు రిక్కించి వున్న ఈ పూర్వరంగంలో, వాళ్లకి మనం అందించగల ప్రామాణిక, చారిత్రిక సమాచార పత్రాలు ఏమున్నాయి? వందలమంది రచయితలూ, పరిశోధకులూ, పత్రికా రచయితలూ గాంధీజీ జీవితం గురించి ఎన్నెన్నో రచనలు చేశారు. కానీ, వాటిల్లో తెలుగు ప్రజలతో గాంధీజీ పెంచుకున్న ఆత్మీయ అనుబంధం గురించి విశేషంగా వివరించిన సందర్భాలు అరుదు. దక్షిణాఫ్రికాలో ఉండిన రోజుల్లోనే గాంధీజీ తెలుగువాళ్లపట్ల ప్రత్యేకమైన అభిమానం ప్రకటించిన సంగతి చరిత్రకెక్కినదే. గుజరాత్‌ని మినహాయిస్తే, ఆయన సంకీర్ణ మద్రాసు రాష్ట్రంలో సంచరించినంతగా మరెక్కడా తిరగలేదేమో! ఈ పూర్వరంగంలో, తెలుగు యువజనులకు గాంధీజీ తెలుగు ప్రజల పట్ల, తెలుగు ప్రాంతాలపట్లా ప్రదర్శించిన ప్రత్యేక అభిమానానికి తార్కాణంగా నిలిచే ఓ సమగ్ర గ్రంథం అందించాలనే ఆలోచనతో గుంటూరు నగరానికి చెందిన మిత్రులు కొందరు ముందుకు వచ్చారు. యువ పాఠకుల అవసరాలూ, అభిరుచులను దృష్టిలో పెట్టుకుని 'ఆంధ్రప్రదేశ్‌లో గాంధీజీ' పుస్తకాన్ని సంగ్రహ రూపంలో అచ్చు వెయ్యాలనుకుంటున్నామనీ, సంగ్రహపాఠం తయారుచేసే బాధ్యత నన్ను తీసుకోమనీ కోరారు. ప్రచురణకర్తల ఆలోచనలోని ఔచిత్యాన్నీ, సామంజస్యాన్నీ గ్రహించడం కష్టంకాదు. ఎందుకంటే గాంధీజీ ప్రజల మనిషి. ప్రజా జీవనంతో సంబంధం లేని జీవితమనేది ఆయనకి లేదు. అలా ఉండకుండా ఆయన చూసుకున్నారు. సత్యశోధనలో తన ప్రయోగాలు ఎంత వ్యక్తిగతమయినవైనా, వాటిని పాఠకులతో పంచుకోవాలన్నదే ఆయన తపన. ఆ కారణం చేతనే, గాంధీజీ ప్రజాజీవన చరిత్రకి, మిగిలిన రచనలకన్నా ఎక్కువ ప్రాధాన్యం ఏర్పడిందని నా అభిప్రాయం. అయితే, నెలన్నర రోజుల వ్యవధిలో ఈ సంగ్రహ పాఠం తయారుచేసి, అచ్చుకు సిద్ధం చెయ్యడం పెనుసవాలనే వాస్తవాన్ని నా మూడున్నర దశాబ్దాల పత్రికీయ అనుభవం తక్షణమే నా దృష్టికి తీసుకురాకపోలేదు. నిజానికి, ఈ ప్రయత్నంలో అంతుమించిన సవాళ్లు మరెన్నో ఉన్నాయని కూడా నాకు అనిపించకపోలేదు. అయినప్పటికీ, ప్రచురణకర్తలకు నా సంసిద్ధత తెలియజేశాను.



నాలుగు దశాబ్దాల కిందట అకాడెమీ ప్రచురించిన 'ఆంధ్రప్రదేశ్‌లో గాంధీజీ' పుస్తకానికి సంపాదక బాధ్యత వహించిన కొడాలి ఆంజనేయులు గొప్పకవి. ముద్దుకృష్ణ ఎంపిక చేసి, ప్రచురింపజేసిన భావకవితా సంకలనం 'వైతాళికులు'లో ఆంజనేయులుగారి ఉత్తమ కృతులు కూడా ఉన్న సంగతి అందరికీ తెలిసిన విషయమే. విశ్వనాథతో కలిసి కవిత్వ సీమను ఔజ్జ్వల్యమానం చేసిన ప్రతిభామూర్తి కొడాలి. 'సత్యాంజనేయ' కవుల జంటగా ఈ మహాకవులు చెప్పిన 'అవతార పరివర్తనము' అనే రచనను బ్రిటీష్ ప్రభుత్వం నిషేధించిన సంగతి కూడా చరిత్రకెక్కిన విషయమే. (తిలక్ అస్తమయం- గాంధీ అవతరణలే ఆ రచనకు ఇతివృత్తం కావడం కాకతాళీయం కాదు!) కొడాలి వారి పద్యాలు- ముఖ్యంగా 'హంపీ క్షేత్రం' కావ్యంలోనివి- చిన్నపుడు పాఠ్యపుస్తకాల్లో చదువుకుని పెరిగిన తరానికి చెందిన వాణ్ణి నేను. అటువంటి కొడాలి దాదాపు దశాబ్దంన్నర కాలం శ్రమించి రూపొందించిన వెయ్యిపేజీల గ్రంథాన్ని మూడోవంతుకు తగ్గించి ఆధునిక పాఠకతరానికి అందించ తలపెట్టడం ఎంత దుస్సాహసమో, అందులో ఎంతటి శ్రమ ఇమిడి వుంటుందో అప్పటికి నాకు పూర్తిగా బోధపడలేదు. ('సంగ్రహ'మనే మాటకి ఎత్తుకుపోవడం దొంగిలించడం అనే అర్థాలు కూడా ఉన్నాయని నిఘంటువులు చెప్తాయి. కొడాలి ఆంజనేయులుగారి కీర్తిప్రతిష్ఠల్ని నాలాంటి అర్భకుడు 'సంగ్రహించ'లేడని నాకు తెలియనిదేం కాదు!) అయినప్పటికీ, ప్రచురణకర్తలకు నా సంసిద్ధత తెలియజేశాను కనుక చేతనయిన మేరకి ఈ పుస్తకాన్ని అచ్చుకు సిద్ధం చేసి మీకు అందిస్తున్నాను.

ఇందులో గ్రంథస్తమయిన విషయానికి సంబంధించిన రెండు మూడు ముఖ్యాంశాలు మీ ముందుంచవలసి వుంది.

ఇందులో అర్థ శతాబ్ది కాలంలో తెలుగునాట బాపూ చేపట్టిన పర్యటనల విశేషాలు ఉన్నాయి. 1896లో గాంధీ దంపతులు తొలిసారి మద్రాసు పర్యటనకు వచ్చేనాటికి, అది తెలుగు నగరంగా వర్ధిల్లుతోంది. అలాగే, 1946లో ఆయన చివరిగా పర్యటించిన అనేక ప్రాంతాలు- ఆనాటి నిజాం రాజ్యంలో భాగంగా ఉన్న ఖమ్మం లాంటి పట్టణాలు- సయితం తెలుగు ఊళ్లే. రాజకీయ సరిహద్దులను మించి, తెలుగు జాతి అనేక ప్రాంతాలకూ, రాష్ట్రాలకూ విస్తరించి వున్న వాస్తవం మాకు తెలియనిది కాదు. అలాగే, తెలుగు జాతిని అంతటినీ ఒకటిగా ముడివేసి వుంచగల బంధం మన భాషేననీ మాకు తెలుసు. కానీ, పుస్తక ప్రచురణకు పూనుకున్నప్పుడు- కృత్రిమమే అయినప్పటికీ- కొన్ని పరిమితులకు లోబడక తప్పదు. ఆ కారణం చేతనే, ఇప్పటి 'ఆంధ్రప్రదేశ్' రాష్ట్రంలో భాగమైన పల్లెలూ పట్టణాలలో గాంధీజీ చేసిన పర్యటనల గురించిన విశేషాలకు మాత్రమే ప్రస్తుత సంగ్రహ పాఠం పరిమితమైంది.

విభిన్న ప్రాంతాల్లో వివిధ జన సమూహాలు గాంధీజీకి సమర్పించిన సన్మాన పత్రాలూ, స్వాగత పత్రాలూ, వినతిపత్రాలూ, అర్జీల లాంటివి- మచ్చుకు ఒకటి రెండు తప్ప- ఈ సంగ్రహపాఠంలో చేర్చలేదు. అలా చేర్చితే దాన్ని ఆ పేరిట పిలవడం సార్థకం కాదనే ఉద్దేశంతోనే అలాచేశాం. ముందే చెప్పినట్లుగా ఈ సంగ్రహ పాఠం లక్ష్యం, ఈతరం పాఠకుల అవసరాలను తీర్చడమే. ప్రచురణకర్తలు ఆ దృష్టితోనే ఈ పుస్తకంలోని భాషను సమకాలీన- ఆధునిక భావప్రకటనకు వాహికగా మార్చమని కోరారు. చదువరులకు పుస్తక పాఠం సహజంగా అనిపించే రీతిలో అలా చెయ్యవలసి వస్తే, మొత్తం పుస్తకాన్ని తిరగరాయవలసి వస్తుంది. అంచేత, వాడుకలోంచి తప్పుకున్న భావప్రకటనలను మాత్రమే సరిచేసి, పూర్వపాఠాన్నే కొనసాగించాం. ఇటువంటి ఆలోచనలు తుది పాఠం సిద్ధంచేసే దశలోనే తలెత్తుతూ ఉంటాయనీ, ఫలితంగా ఒక్కోసారి మొత్తం పాఠాన్ని తిరగదోడవలసి వస్తుందనీ విజ్ఞులకు తెలుసు. కాలపరిమితి విషయంలో మరికొంత వెసులుబాటు చిక్కివుంటే, నేనాపని- మొత్తం పుస్తకాన్ని ఆధునిక భాషలో తిరగరాసే పని-కచ్చితంగా చేసి వుండేవాణ్ణని ఈతరం చదువరులకు సవినయంగా మనవి చేసుకుంటున్నాను.

ప్రత్యక్షంగా ఈ పుస్తకంతో సంబంధం లేని ఒక విషయం ఇక్కడ ప్రస్తావించదల్చుకున్నాను. గాంధీజీ దక్షిణాఫ్రికాలో ఉండిన రోజుల్లోనే తెలుగు, తమిళం ఒకమేరకు నేర్చుకున్నారు. ఆ రెండు జాతుల ప్రజలంటే తనకు ప్రత్యేకంగా అభిమానమని బహిరంగ సభల్లోనే ప్రకటించి వున్నారాయన. మరో సందర్భంలో బిహార్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ప్రజలపై తనకు అపారమయిన ఆదరాభిమానాలున్నాయని కూడా గాంధీజీ పేర్కొన్నారు. వి.ఓ.చిదంబరంపిళ్ళై లాంటివారికి గాంధీజీ- 1915 ఆగస్ట్ నెలలోనే- తమిళంలో ఉత్తరాలు కూడా రాశారని చరిత్రకెక్కింది. ఇక, తెలుగు మాటలు ప్రయోగించి ఆంధ్ర మిత్రులను అలరించడం గాంధీజీకి ఎంతో మక్కువ కలిగించే కాలక్షేపమని ఆయన జీవిత చరిత్రను రాసిన వారు పేర్కొన్నారు. తెలుగు ప్రజానీకంపై కూడా గాంధీజీ ప్రభావం అపారం. 1919లో గాంధీజీ పర్యటన ప్రభావంతో బెజవాడ, గుంటూరు, ఏలూరు, పెదపాలెం, నారాయణవనం, విశాఖపట్టణం, బరంపురం, రాజమహేంద్రవరం, చిరివాడ, గంపలగూడెం, సంగం, ఘంటశాల, గుడివాడ, కొవ్వూరు, సుబ్బారెడ్డిపాలెం, కోలవెన్ను, ఈమని, తుళ్లూరు, కోడూరు తదితర ప్రాంతాల్లో రౌలట్ చట్టానికి వ్యతిరేకంగా సత్యాగ్రహ దీక్షలు జరిగాయి. వేలాది మంది స్వచ్ఛందంగా ఈ దీక్షల్లో పాల్గొన్నారు. 1929లో గాంధీజీ తెలుగునాట పర్యటించినప్పుడు, ఆయన దినచర్య పుస్తకం ఒకటి రాసుకున్నారు. దినచర్య పుస్తకాన్ని గుజరాతీ భాషలో 'రోజ్‌నిశి'అంటారు. నవజీవన్ ట్రస్ట్ ఈ రోజ్‌నిశీని 2014లో మొట్టమొదటిసారిగా అచ్చువేసింది. ఒకేరోజున గాంధీజీ 27నుంచి 29 గ్రామాల వరకూ పర్యటించిన విషయం అందులో ఉంది. నిజానికి ఇది రెండు దినచర్య పుస్తకాల సంకలనం. గాంధీజీతోపాటుగా, కుసుమ్‌దేశాయ్ కూడా ఈ పర్యటనలో పాల్గొని, తానూ ఓ డయరీ రాసుకున్నారు. గాంధీజీ అంతేవాసుల్లో ఒకరయిన హరిలాల్ మానిక్‌లాల్ దేశాయ్ భార్య కుసుమ్. బరోడా హైస్కూల్‌లో ఫ్రెంచ్ భాషా బోధకుడిగా పనిచేస్తూ వుండిన హరిలాల్ దేశాయ్ సహాయ నిరాకరణ ఉద్యమంలో తన ఉద్యోగానికి రాజీనామా చేశారు. 1927లో ఆయన కన్నుమూసిన తర్వాత కుసుమ్ సాబర్మతీ ఆశ్రమంలో చేరి, గాంధీజీకి సహాయకురాలిగా పనిచేశారు; అందులో భాగంగానే ఆమె 1929లో గాంధీజీతోపాటుగా ఆంధ్ర పర్యటనలో పాల్గొన్నారు. ఇంతవరకూ ఈ పుస్తకాలు తెలుగు భాషలోకి అనువాదమయినట్లు లేవు. ఆ పనికూడా చేసిన రోజున మాత్రమే, ఈ తరం పాఠకులకు గాంధీజీ గురించిన సమగ్ర సమాచారం అందించినట్లు అవుతుంది.

'తెలుగునాట బాపూ బాట' పుస్తకం తయారీలో నాకు సహకరించిన మిత్రుడు పి.వి.నరసింహారావుకు కృతజ్ఞతలు.

-మండలపర్తి కిషోర్

స్వాధ్యాయ సందోహం

హిందీ మూలం: స్వామీ వేదానంద తీర్థ

తెలుగు అనువాదం: డా॥ పాలకోడేటి జగన్నాథరావు 9490620512

విశ్వసంపద అంతా చేత చిక్కినా ఒక్క దైవాను గ్రహం లభించకుంటే అంతా వ్యర్థమే. దీనిని గ్రహించి ఓ మానవుడా నీకున్నదంతా ఈ లోకం మీదే విసిరివేసిపో. కాని ఆ దైవాన్ని మాత్రం విడువకు అన్న ఈ మంత్రోపదేశం సర్వమానవులకు శిరోధార్యమే.

184

172. నీ భక్తుణ్ణి ఎవరు ప్రతిఘటించగలరు?

కస్తమింద్ర త్వావసుమా మర్త్యో దధర్షతి।

శ్రద్ధా ఇత్తే మఘవన్‌పార్యే దివి వాజీ వాజం నిషాసతి॥

భావం:- ఓ ఇంద్రా! ఎవరికైతే నీవే ధనమో అట్టి వానిని ఎవడు అణచివేయగలడు?

పూజ్యార్హమైన ధనంగల ఓ ప్రభూ! సంసార సాగరాన్ని తరింపజేయగల నీ జ్ఞాన ప్రకాశంమీద శ్రద్ధగల జ్ఞాని జ్ఞానాన్ని, ఆహారాన్ని, ఆధ్యాత్మిక శక్తిని అందరకు పంచాలని కోరుకొంటాడు.

వివరణ:- ధనమదం చాల చెడ్డది. అది గల ధనవంతుడు నిర్ధనుణ్ణి అణచివేస్తాడు. రాజ్యాధికారం కూడ ధనబలం మీదనే ఆధారపడియుంది. కాబట్టి ధనంలో చాల బలముంది. ధనాధిక్యం చేత మనిషి గర్వోన్మత్తుడు కావడం చాల సహజం. అట్టివాడు తనకంటె తక్కువ వారిని చాల హీనులుగా పరిగణిస్తాడు. కాని భగవంతుడే ఎవరికి ధనమో అట్టి వానిని ఎవడు అణచివేయగలడు? సకల బలసమేతుడు కేవలం భగవంతుడే. ఆయనే ధనంగా ఉండి ఎవనిని నిర్ధనుడుగా ఉండేలా శాసించాడో అట్టివానిని తిరస్కారభావంతో చూడాలని మనసులోనైనా తలంచగలడా? భగవంతునకు గల సంసార సాగర తారణశక్తిమీద పూర్తివిశ్వాసంతో మనిషి దానశీలుడవుతాడు. అలా భగవద్విశ్వాస బుద్ధితో 'తవ ప్రణీతీ హర్యశ్వ సూరిభిర్విశ్వా తరేమ దురితా' ''ఓ మహాదేవా! నీ ఆశ్రయంలో మా పూర్తి పాపాలను, దురవస్థలను అధిగమించెదము''అని తమ సంపూర్ణ విశ్వాసాన్ని ప్రకటిస్తాడు. కాబట్టి అందరు అదే విశ్వాసంతో సంసార సుఖాలకు, సంసార జలధి దాటేందుకు భగవదాశ్రయాన్ని పొందాలి. అలా పొందేది ఎవరో కొద్దిమంది మాత్రమే.

'తవాయం విశ్వః పురుహూత పార్థివో- వస్యుర్నామ భిక్షతే' ''ఓ మహద్యశా! సమస్త చరాచర జగత్తు తన రక్షణకోసం నీ పవిత్ర నామాన్ని భిక్షగా అర్థిస్తున్నది'' నీ తారక నామమే గనుక లభ్యమయితే ఇక కావలసినదేముంటుంది?? సమస్త విశ్వమూ ఎవని ద్వారం వద్ద వినయంగా నిలిచి అర్చిస్తూ ఉందో అతడే మనిషికి సర్వస్వధనమే అయినపుడు అతడు ఎవడికి భయపడాలి? దాత మంచి యాచకుని ఎందుకు భయపెడతాడు? అతడిని చూచి ఎందుకు భయపడతాడు? దీనినిబట్టి యోగుల మరియు మహాత్ముల ఓజస్సునకు తేజస్సునకు గల కారణమేమిటో స్పష్టపడుతూంది. మహాఓజోవంతులు - తేజోవంతులు కావాలని కోరుకొనేవారు భగవంతుణ్ణి తమవాడిగా చేసుకోవాలి. ఆయననే తమ ధనంగా చేసుకోవాలి.

⁂

173. దేవుడెక్కడున్నాడు? ఎవడు చూసాడు?

ప్ర సు స్తోమం భరత వాజయంత ఇంద్రాయ సత్యం యది సత్యమస్తి।

నేంద్రో అస్తీతి నేమ ఉత్వ ఆహ క ఈం దదర్శ కమభి ష్టవామ॥

అయమస్మి జరితః పశ్య మేహ విశ్వా జాతిన్యభ్యస్మి మహ్నా।

ఋతస్య మా ప్రదిశో వర్ధయంత్యాదర్దిరో భువనా దర్దరీమి॥


భావం:- ఒక నాస్తికుడు ఇలా నాస్తిక వాదం చేస్తున్నాడు. ఒకవేళ భగవంతుడే ఉంటే జ్ఞానాన్ని, సర్వబల సంపన్నతను కోరుతూ మనోవాక్కాయ కర్మలతో సశాస్త్రీయంగా ప్రార్థన చేయి. కాని భగవంతుడనే వాడే లేడు. అసలు ఆయనను ఎవడు చూచాడు? ఎవనిని గురించి మేము స్తోత్రంచేయాలి?

ఈ నాస్తిక వాదానికి ఆస్తికుడు ప్రభావితుడు కాకుండా భగవంతుడే ఇలా సమాధానమిస్తున్నాడు:-

ఓ స్తోత్రకర్తా! నేనిక్కడే ఉన్నాను. నన్ను ఇక్కడే చూడు. పుట్టిన చరాచర సృష్టినంతా నేను నా మాహాత్మ్యంతో నియంత్రించి ఉంచుతున్నాను ఋతం అనగా సృష్టి శాసనాలను, ధర్మాలను, నియమాలను బాగా తెలిసినవారు నన్ను సమున్నతునిగా కీర్తిస్తున్నారు. నేనే ప్రళయకారుడను. సమస్త భువనాలకు మరల మరల ప్రళయాన్ని నేనే కల్పిస్తున్నాను.

వివరణ:- నీకు నిజంగా భగవంతుని ఎడల విశ్వాసమే ఉంటే ఆయనను తలంచి నీ హృదయాంతరంగం నుండి వెలువడే స్తోత్రంతో సన్నుతించు. అలా స్తోత్రం చేయడంవలన నీకే తప్ప ఆయనకేమీ లాభంలేదు అని భగవత్ స్తోత్ర విధానాన్ని ప్రబోధించిన ఋషి వాదానికి భిన్నంగా ఒక నాస్తికుడిలా ప్రత్యాఖ్యానం వినిపిస్తున్నాడు- దేవుడు దేవుడు అని అరచి గగ్గోలు పెడుతున్నావు అతడసలు లేనే లేడు. ఆయనే లేనప్పుడు 'కమభిష్టవామ = స్తోత్రం ఎవరిని గురించిచేయాలి? అసలు ఆయనను 'క ఈం దదర్శ' ఎవడు చూచాడు అని యోగశాస్త్రంలో సంశయమూ ఒక పెద్ద విఘ్నకారి యని చెప్పబడింది.

ఇంకా ఉంది



అసురన్‌పై ఫోకస్?

తమిళ స్టార్ హీరో ధనుష్ చేసిన మారి 2 ఒకింత అసంతృప్తిని మిగల్చటంతో, వెట్రిమారన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'అసురన్'పై ఎక్కువ ఫోకస్ పెడుతున్నాడట. పొలిటికల్ బ్యాక్‌డ్రాప్ స్టోరీగా తెరకెక్కనున్న చిత్రాన్ని వి క్రియేషన్స్ పతాకంపై నిర్మాత కలైపులి ఎస్ థాను నిర్మించనున్నారు. త్వరలోనే చిత్రం సెట్స్‌మీదకు వెళ్లనుంది. మారి -2 బాక్సాఫీస్ దగ్గర బలంగా నిలబడలేకపోవడంతో, ప్రస్తుతానికి తాను దర్శకత్వం వహించాల్సిన మల్టీస్టారర్ చిత్రాన్ని హోల్డ్‌లో పెట్టాడట. ఇప్పటికే ఒక షెడ్యూల్ పూర్తిచేసినా, అసురన్ పూర్తిచేసిన తరువాత మళ్లీ సెట్స్‌పైకి తీసుకెళ్లనున్నాడని ఇండస్ట్రీ టాక్. ఈ చిత్రంలో కింగ్ నాగార్జున ఒక ముఖ్యమైన పాత్రలో నటించనుండటం తెలిసిందే.

కల్కి.. ఇలా



ఇంపాక్ట్ రోల్స్‌తో స్పెషల్ క్రేజ్ క్రియేట్ చేసుకున్న హీరో రాజశేఖర్. కొత్త హీరోలు, కుర్ర హీరోల దూకుడు మొదలైన తరువాత పోటీలో క్రమంగా వెనకపడటం తెలిసిందే. వరుస ఫ్లాపులు సైతం రాజశేఖర్‌ను వెంటాడటంతో క్రమంగా ఇమేజ్ కరిగిపోయింది. సెకెండ్ ఇన్నింగ్స్‌లో పిఎస్‌వి గరుడవేగతో బ్లాక్ బస్టర్ అందుకున్న రాజశేఖర్ మళ్లీ ఫాంలోకి వచ్చేశాడు. సెలెక్టెడ్ స్టోరీలపైనే దృష్టిపెట్టడంతో కొంచెం గ్యాప్ తీసుకుని 'కల్కి' అవతారాన్ని చూపించేందుకు సిద్ధమయ్యాడు. 'అ' వంటి విలక్షణ చిత్రాన్ని తెరకెక్కించి ఔరా అనిపించుకున్న యువ దర్శకుడు ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రమే కల్కి. హ్యాపీ మూవీస్, శివానీ శివాత్మిక బ్యానర్లపై సి కళ్యాణ్, శివానీ రాజశేఖర్, శివాత్మిక రాజశేఖర్ సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రమిది. ఆదాశర్మ, నందితాశ్వేత, స్కార్లెట్ విల్సన్ హీరోయిన్లు. అశుతోష్ రాణా, నాజర్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. 1983 బ్యాక్‌డ్రాప్ కథతో తెరకెక్కుతున్న చిత్రానికి సంబంధించి న్యూ ఇయర్ సందర్భంగా కల్కి ఫస్ట్ లుక్ విడుదల చేశారు.



కాపాన్‌గా వస్తున్నాడు..

తమిళ స్టార్ హీరో సూర్య నటిస్తున్న 37వ చిత్రం టైటిల్ ప్రకటించేశారు. చిత్ర దర్శకుడు మూడు టైటిల్స్‌ను ప్రకటించి అందులో ఒకదాన్ని ఎంచుకోవచ్చంటూ పోల్ పెట్టడం తెలిసిందే. మీట్పాన్, కాపాన్, ఉఇర్కా టైటిల్స్‌లో ఉఇర్కాకు ఎక్కువ ఓట్లు పడ్డాయి. అదే టైటిల్‌ను ప్రకటించే అవకాశం ఉందని అంతా భావించారు. అయితే చిత్ర టైటిల్ న్యూఇయర్ రోజున అధికారికంగా ప్రకటిస్తామన్న చిత్ర బృందం, అనూహ్యంగా కాపాన్‌ను ఎంచుకుంది. కె.వి.ఆనంద్ తెరకెక్కిస్తున్న చిత్రంలో మోహన్‌లాల్, బోమన్ ఇరానీ, ఆర్య, చిరాక్ జానీ ముఖ్యపాత్రల్లో నటిస్తున్నారు. భారీ బడ్జెట్‌తో లైకా ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న చిత్రానికి హారిస్ జైరాజ్ సంగీతం సమకూరుస్తున్నాడు. ఈ చిత్రంలో సూర్య ఎన్‌జి కమాండర్‌గా కనిపిస్తాడు. ఇటీవల ఈ చిత్రం రెండు షెడ్యూల్స్ పూర్తిచేసుకుంది. ప్రస్తుతం సూర్య ఎన్‌జికె చివరి షెడ్యూల్ షూటింగ్‌లో పాల్గొంటున్నాడు. సెల్వరాఘవన్ తెరకెక్కిస్తున్న చిత్రాన్ని ఏప్రిల్ 14న విడుదల చేయనున్నారు.





ఒమంగ్+ఒబెరాయ్= మోదీ



గత కొంతకాలంగా భారతదేశ ప్రధాని నరేంద్ర మోదీ బయోపిక్ తెరకెక్కనుందని వార్తలు వస్తున్న సంగతి తెలిసిందే. పలువురు దర్శకులు సంచలనాల మోదీజీ జీవితాన్ని వెండి తెరకెక్కించాలని ఉవ్విళ్లూరుతున్నారని కథనాలు వచ్చాయి. అయితే ఇదీ క్లియర్ కట్ మ్యాటర్ అంటూ ఇప్పటికీ సమాచారం లేదు. తాజాగా ప్రముఖ బాలీవుడ్ దర్శకుడు ఒమంగ్ కుమార్ పూర్తి క్లారిటీతో ఈ బయోపిక్‌కోసం రెడీ అవుతున్నారట. గత కొంతకాలంగా నరేంద్ర మోదీ బయోపిక్‌కి సంబంధించిన స్క్రిప్టును ఒమంగ్ రెడీ చేస్తున్నారట. ప్రస్తుతం స్క్రిప్టు సిద్ధమై ప్రీప్రొడక్షన్ వర్క్ సాగుతోంది. ఈ జనవరిలో కొత్త సంవత్సర కానుకగా ఈ చిత్రాన్ని ప్రారంభిస్తారని తెలుస్తోంది. అయితే మోదీ పాత్రలో ఎవరు నటిస్తారు? అంటే గ్రేట్ యాక్టర్ రక్తచరిత్ర ఫేం వివేక్ ఒబేరాయ్ మోదీగా నటిస్తారని చెబుతున్నారు. ఒక సామాన్యుడు అసామాన్యుడిగా ఎదిగిన చరిత్ర ఇది. గుజరాత్ ముఖ్యమంత్రిగా మోదీ ఎదురే లేనివాడిగా పరిపాలన సాగించి అటుపై భారతదేశానికే ప్రధాని అయ్యారు. అలాంటి గొప్ప నాయకుని పాత్రలో నటించడం అంటే సవాల్ అనే చెప్పాలి. ఒబేరాయ్‌తో ప్రస్తుతం చర్చలు సాగుతున్నాయి. ఒమంగ్ కుమార్ అందుకు సంబంధించిన మంతనాలు సాగిస్తున్నారట. అధికారికంగా ప్రాజెక్టును కన్ఫామ్ చేయాల్సి ఉంది.

అలాంటివాడు కీర్తికి కావాలట!

కీర్తిసురేష్ తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపును దక్కించుకున్న విషయం తెల్సిందే. తెలుగులో కాస్త స్లోగా ఈమె జర్నీ సాగుతున్నా కూడా తమిళంలో మాత్రం ఈమె జోరు మామూలుగా లేదు. ఇప్పటికే అక్కడ దాదాపుగా స్టార్ హీరోలందరితో నటించేసింది. ఈమె తక్కువ సమయంలోనే అతి ఎక్కువమంది స్టార్ హీరోలకు జోడీగా నటించిన అరుదైన రికార్డును సొంతం చేసుకుంది. త్వరలోనే రజినీకాంత్‌తో ఈమె కనిపించబోతుంది. మురుగదాస్ దర్శకత్వంలో ఇప్పటికే ఈమె సర్కార్ చిత్రంలో విజయ్‌కి జోడీగా నటించింది. ఆ చిత్రం మంచి విజయాన్ని సొంతం చేసుకున్న నేపథ్యంలో కీర్తిసురేష్‌ను మరోసారి తన సినిమాకు మురుగదాస్ ఎంపిక చేసుకున్నాడు. అతి త్వరలోనే ప్రారంభం కాబోతున్న రజినీకాంత్ మూవీతోపాటు ఇంకా రెండు మూడు సినిమాలకు కూడా ఈమె కమిట్ అయ్యింది. ఒక మలయాళీ చిత్రంలో కూడా నటిస్తున్నట్లుగా వార్తలు వస్తున్నాయి. చాలా బిజీగా గడుపుతున్న కీర్తిసురేష్ తాజాగా ఒక మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు కీలక అంశాలపై స్పందించింది. కీర్తిసురేష్‌ను ఆ ఇంటర్వ్యూలో పెళ్లి గురించిన ప్రశ్నించిన సమయంలో ఇప్పుడు తనకు పెళ్లి ఆలోచన లేదని చెప్పింది. ప్రేమ పెళ్లా లేదంటే పెద్దలు కుదిర్చిన పెళ్లా అనే విషయంలో తాను ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని చెప్పుకొచ్చింది. పెళ్లిచేసుకునే సమయం తనకు ఇంకా రాలేదని చెప్పింది. అయితే ఎలాంటి వారిని పెళ్లిచేసుకోవాలని అనుకుంటున్నారని ప్రశ్నించిన సమయంలో మాత్రం తమిళ స్టార్ హీరోలు విజయ్, విక్రమ్‌ల మాదిరిగా ఉండే కుర్రాడిని పెళ్లిచేసుకోవాలనుకుంటున్నట్లుగా చెప్పింది.


సస్పెన్స్ థ్రిల్లర్‌గా 'మిరాకిల్'

హరి గిల్స్ హీరోగా సుమన్ రాణా హీరోయిన్‌గా వామన చలనచిత్ర స్టూడియోస్, చిగాస్ బ్రాడ్‌కాస్టింగ్ కంపెనీ బ్యానర్స్‌పై రుద్రపట్ల వేణుగోపాల్ (ఆర్‌విజి) దర్శకత్వంలో హరి, విష్ణు నిర్మిస్తోన్న చిత్రం మిరాకిల్. సస్పెన్స్ థ్రిల్లర్‌గా రూపొందుతున్న చిత్రాన్ని హిందీ, తెలుగు, తమిళం, కన్నడ భాషల్లో నిర్మిస్తున్నారు. ప్రస్తుతం మూడో షెడ్యూల్ షూటింగ్ హైదరాబాద్‌లో జరుగుతోంది. కాగా చిత్రం పోస్టర్ లాంచ్‌ను మాదాపూర్ ఆర్ట్ గ్యాలరీలో నిర్వహించారు. హీరో హరి గిల్స్, హీరోయిన్ సుమన్ రాణా, దర్శకుడు రుద్రపట్ల వేణుగోపాల్ (ఆర్‌విజి), ప్రముఖ నటులు విజయ్ కుమార్, జీవా, సందీప్ భరద్వాజ్ తదితరులు పాల్గొన్నారు. దర్శకుడు రుద్రపట్ల వేణుగోపాల్ మాట్లాడుతూ వాస్తవ సంఘటనలకు నిజ జీవిత పాత్రలకు కల్పన జోడిస్తూ సస్పెన్స్ థ్రిల్లర్‌గా మిరాకిల్ చిత్రాన్ని రూపొందిస్తున్నామన్నారు. గోవా, హైదరాబాద్, బెంగుళూరులో రెండు షెడ్యూల్స్ జరిపామని, మూడో షెడ్యూల్ హైదరాబాద్‌లో జరుగుతోందన్నారు. మారిషస్‌లో పాతాళ చిత్రీకరణ మార్చిలో పూర్తిచేసి, మే 24న ప్రపంచ వ్యాప్తంగా సినిమా విడుదల చేస్తామన్నారు. హీరో హరి గిల్స్ మాట్లాడుతూ హీరోగా తొలి చిత్రమే నాలుగు భాషల్లో నిర్మిస్తుండటం ఆనందంగా ఉందన్నారు. కచ్చితంగా సినిమా మిరాకిల్ అవుతుందన్నారు. హీరోయిన్ సుమన్ రాణా మాట్లాడుతూ ఇదొక డిఫరెంట్ సస్పెన్స్ థ్రిల్లర్ చిత్రమని, మోడల్‌గా వున్న తాను మిరాకిల్ చిత్రంతో హీరోయిన్‌గా పరిచయం కావడం హ్యాపీగా ఉందన్నారు.



లెస్బియన్ లవ్ స్టోరీ

'అ' సినిమా వరకు తెలుగులో మంచి క్రేజ్ ఉంది రెజీనా కసాండ్రకు. అయితే ఈమధ్య తెలుగు సినిమాల్లో ఆమె పెద్దగా కనిపించట్లేదు. కనిపించట్లేదు అనే కంటే ఆమెకు సరైన అవకాశాలు రావట్లేదనే చెప్పాలి. ఇలాంటి పరిస్థితుల్లో రెజీనా ఓ బాలీవుడ్ సినిమాలో ఓ ప్రత్యేక పాత్రలో కనిపించనుంది. సోనమ్‌కపూర్ ప్రధాన పాత్రలో 'ఏక్ లడకీ కొ దేఖాతో ఐసా లగా'అనే హిందీ సినిమా రాబోతున్న విషయం తెలిసిందే. అయితే ఇందులో సోనమ్‌కపూర్ ప్రేయసిగా రెజీనా కనిపించనుందనే వార్త ఇప్పుడు సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. ఎందుకంటే ఈ సినిమాలో సోనమ్, రెజీనా ఇద్దరూ లెస్బియన్స్ అని, వారిమధ్య ప్రేమకథే ఈ సినిమాలో ప్రధాన అంశం అని తెలుస్తోంది. షెల్లీ చోప్రాధర్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రాన్ని ఫిబ్రవరి 1న రిలీజ్ చేయనున్నారు. కాగా ఇప్పటికే విడుదల అయిన ట్రైలర్ చూసిన ఈ విషయం అర్థమవుతోంది. అయితే ట్రైలర్‌లో రెజీనా పెద్దగా ప్రాధాన్యత ఇచ్చినట్లు కనిపించట్లేదు.





సంక్రాంతికి వస్తున్న పెద్ద చిత్రాలు రెండూ కొత్త ఏడాది తొలి రోజునుంచే ఆడియన్స్‌ని ఊరించటం మొదలుపెట్టాయి. యన్‌టిఆర్ బయోపిక్‌లోని తొలిభాగం కథానాయకుడు జనవరి 9న, రామ్‌చరణ్ వినయ విధేయ రామ చిత్రం జనవరి 11న థియేటర్లకు వస్తుండటం తెలిసిందే. విడుదల సమయం దగ్గర పడుతుండటంతో ప్రతి అకేషన్‌నూ ప్రమోషన్‌కు ఉపయోగిస్తున్నాయి చిత్ర బృందాలు. కొత్త ఏడాది శుభాకాంక్షలు చెబుతూ రామారావు-బసవతారకంగా బాలయ్య -విద్యాబాలన్ ఇలా పలకరిస్తే, దేవాలయం సన్నివేశంలో కైరా అద్వానీని ఇలా ఎత్తుకుంటూ వినయ విధేయ రామ.. శుభాకాంక్షలు చెప్పాడు.

బ్లఫ్ మాస్టర్ గెలిచాడు

శ్రీదేవి మూవీస్ సంస్థ అధినేత శివలెంక కృష్ణప్రసాద్ సమర్పణలో, అభిషేక్ ఫిలిమ్స్ అధినేత రమేష్ పిళ్లై నిర్మాతగా తమిళంలో ఘన విజయం సాధించిన 'చతురంగ వేట్టై'ని ఆధారంగా చేసుకుని గోపీ గణేష్ పట్టాభి దర్శకత్వంలో.. తెలుగులో రూపొందిన చిత్రం 'బ్లఫ్ మాస్టర్'. 'జ్యోతిలక్ష్మి', 'ఘాజి' చిత్రాలఫేమ్ సత్యదేవ్ హీరోగా నటించారు. 'ఎక్కడికిపోతావు చిన్నవాడా' చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన నందితాశ్వేత ఇందులో నాయిక. 'బ్లఫ్ మాస్టర్' సక్సెస్ మీట్ హైదరాబాద్‌లో జరిగింది. ఈ సందర్భంగా మారుతి మాట్లాడుతూ.. 'గోపీగణేష్ నాకు ఎప్పటి నుంచో తెలుసు. సినిమాను బాగా తీశాడు. సత్యదేవ్‌ని చూస్తే జెన్యూన్ ఆర్టిస్టును చూసిన ఫీలింగ్ వచ్చింది. తను పాత్రకు న్యాయం చేశాడు. తమిళ సినిమాను తెలుగు ప్రేక్షకులకు నచ్చేలా తీశారు. ప్రతి పాత్రకూ డీటైలింగ్‌గా పనిచేశారు. ఇలాంటి చిన్న సినిమాలను ఆదరిస్తే వీళ్ల దగ్గర నుంచి మరిన్ని మంచి సినిమాలు వస్తాయి. వీళ్ల కష్టానికి మనం ఇచ్చే ఎనర్జీ థియేటర్‌కు వెళ్లి సినిమా చూడటమే'' అని అన్నారు. శివలెంక కృష్ణప్రసాద్ మాట్లాడుతూ 'తమిళ సినిమాను చూడగానే తెలుగులో రీమేక్ చేయాలనుకున్నా. రైట్స్‌కోసం తీవ్రంగా ప్రయత్నించాక రమేష్ పిళ్లై దగ్గర ఉన్నాయని తెలిసింది. ఆయన్ని అడిగితే ఇద్దరం కలిసి చేద్దామని అన్నారు. ఇది చిన్న సినిమాల్లో పెద్ద సినిమా. గీతా ఆర్ట్స్, సురేష్ ప్రొడక్షన్స్.. చూసిన ప్రతివాళ్లూ ఎగ్జయిట్ అయ్యారు. అదే ఎగ్జయిట్‌మెంట్ జనాల్లో కనిపిస్తుంది. నిర్మాతగా మాకు సంతృప్తిని ఇస్తుందని నమ్ముతున్నాం'' అని చెప్పారు. నందిత శ్వేత మాట్లాడుతూ.. ''అవని పాత్రలో నటించలేదు. జీవించాను. ఆ పాత్రనుంచి బయటకు రావడానికి చాలా రోజులు పట్టింది. సత్యదేవ్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అయ్యాడు అని చెప్పారు. సత్యదేవ్ మాట్లాడుతూ.. ''మా సినిమాకు పనిచేసిన యూనిట్ సభ్యులు, నా స్నేహితులు, కుటుంబ సభ్యులు సినిమా బావుందన్నప్పుడు నామీద ప్రేమతో చెప్పారనుకున్నా. మూడురోజులుగా థియేటర్ల రెస్పాన్స్ చూసి, విని గర్వంగా అనిపించింది. ఆనందంగా ఉన్నాను'' అని అన్నారు.

